మీడియాకు సంబంధించిన అన్ని విషయాల కోసం 9246213493
సహాయ
మీడియా సర్వీసు రి.
3-7-255,మన్సూరాబాద్,ఎల్బీనగర్,హైదరాబాద్-68

www.navabhoomi.in | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083

# నవభూమి

ANUKSHANAM
NAVABHOOMI TELUGU DAILY
నవతరం తెలుగు దినపత్రిక
Published from Hyderabad and Vijayawada
ఎడిటర్ : అజీద్
Navabhoomi daily fallows..
హైదరాబాద్ 21 గురువారం నవంబర్ 2024 పేజీలు 8-12 వెల: రూ.6 సంపుటి:3 సంచిక: 66




# సర్వేలన్నీ ఏకపక్షమే!

- మహారాష్ట్ర,జార్కండ్ రాష్ట్రాల్లో
- ఎన్డీఏదే అధికారమన్న ఎగ్జిట్ పోల్ సర్వేలు
- పోలింగ్ పూర్తయిన వెంటనే సర్వేలు విడుదల
- చాణక్య స్ట్రాటజీస్ ప్రకారం జార్కండ్‌లో ఎన్డీఏ
- ఎన్డీఏ కూటమికి 81 సీట్లకు 45-50 సీట్లు
- జేఎంఎం-కాంగ్రెస్ కూటమికి 35-38 సీట్లు
- మహారాష్ట్రలో కూడా ఎన్డీఏ కూటమికే అధికారం

2



**ముంబై-నవభూమిబ్యూరో**

జార్కండ్ రాష్ట్రంలో రెండో దశ ఎన్నికల పోలింగ్ బుధవారం సాయంత్రం 6 గంటలకు ముగిసింది. దీంతో పలు మీడియా సంస్థలు, సర్వే సంస్థలు ఎగ్జిట్ పోల్స్ విడుదల చేస్తున్నాయి. మెజార్టీ ఎగ్జిట్ పోల్స్ మహారాష్ట్ర, జార్కండ్ రాష్ట్రాల్లో ఎన్డీఏ కూటమి అధికారంలోకి వస్తుందని తెలుస్తున్నాయి. తాజాగా, చాణక్య స్ట్రాటజీస్ సర్వే తన అంచనాలను విడుదల చేసింది. ఓటర్ల నాడి ఏం చెబుతోంది..? చాణక్య స్ట్రాటజీస్ సర్వే అంచనాల ప్రకారం.. జార్కండ్ రాష్ట్రంలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ అధికారం చేపడుతుంది. ఎన్డీఏ కూటమికి మొత్తం 81 సీట్లకు గానూ 45-50 సీట్లు వస్తాయని అంచనా వేసింది. ఇక, జేఎంఎం-కాంగ్రెస్ కూటమికి 35-38 సీట్లు వచ్చే అవకాశం ఉందని పేర్కొంది. ఇతరులకు 3-5 స్థానాలు దక్కుతాయని అంచనా వేసింది. మరోవైపు, మరికొన్ని సర్వే సంస్థలు కూడా జార్కండ్ రాష్ట్రంలో ఎన్డీఏదే అధికారమని పేర్కొంటున్నాయి. మాట్రిట్జ్ సర్వే ప్రకారం.. ఎన్డీఏ కూటమికి 42-47 స్థానాలు, కాంగ్రెస్-జేఎంఎం కూటమి 25-30, ఇతరులు 1-4 సీట్లు సాధిస్తారని అంచనా వేసింది. జేవీసీ ఎగ్జిట్ పోల్స్ ప్రకారం.. ఎన్డీఏ కూటమికి 40-44, జేఎంఎం-కాంగ్రెస్ కూటమికి 30-40, ఇతరులకు 0-1 సీట్లు వస్తాయని పేర్కొంది. పీపుల్స్ పల్స్ అంచనాల ప్రకారం.. ఇండియా కూటమికి 44-53, ఇండియా కూటమికి 25-37, ఇతరులకు 5-9 స్థానాలు దక్కే అవకాశం ఉందని తేల్చింది. పీమార్క్ సర్వే ప్రకారం.. ఎన్డీఏకు 31-40

# సంక్రాంతి నాటికి గుంతలు లేని రోడ్లు

- రోడ్లపై గుంతలు పూడ్చడానికి రూ. 860 కోట్లు విడుదల
- రూ. 75 వేల కోట్లతో నేషనల్ హైవే పనులు జరుగుతున్నాయి
- రూ. 30 నుంచి 40 వేల కోట్ల పనులు త్వరలోనే ప్రారంభిస్తాం
- అమరావతికి పూర్వవైభవం తీసుకొస్తాం..
- రిలయన్స్ బయోగ్యాస్ రాబోతోంది: చంద్రబాబు

2



**అమరావతి-నవభూమిబ్యూరో**

అన్న క్యాంటీన్ల సంఖ్యను పెంచుతామన్న సీఎం వైసీపీ ప్రభుత్వం చెత్తపై పన్ను వేసిందని, అయితే చెత్తను మాత్రం ఎత్తలేదని ముఖ్యమంత్రి చంద్రబాబు ఎద్దేవా చేశారు. తాము చెత్త పన్నును రద్దు చేశామని... చెత్తను తీయిస్తున్నామని చెప్పారు. అమరావతి కొనసాగి ఉంటే రాష్ట్రానికి ఆదాయం వచ్చేదని అన్నారు. అమరావతికి పూర్వవైభవం తీసుకొస్తామని చెప్పారు. అసెంబ్లీలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రోడ్లపై గుంతలు పూడ్చడానికి రూ. 860 కోట్లు విడుదల చేశామని సీఎం తెలిపారు. సంక్రాంతి నాటికి గుంతలు లేని రోడ్లను తయారుచేస్తామని చెప్పారు. రూ. 75 వేల కోట్లతో రాష్ట్రంలో నేషనల్ హైవే పనులు జరుగుతున్నాయని తెలిపారు. రూ. 30 నుంచి 40 వేల కోట్ల పనులు త్వరలోనే ప్రారంభిస్తామని చెప్పారు. అమరావతి రైల్వే లైన్ కు కేంద్రం సహకరించిందని తెలిపారు. ఎన్టీపీసీ, జెన్ కో జాయింట్ వెంచర్ తో విశాఖలో లక్ష కోట్ల పెట్టుబడులు పెట్టబోతున్నారని చంద్రబాబు చెప్పారు. రూ. 65 వేల కోట్ల పెట్టుబడులతో రిలయన్స్ బయోగ్యాస్ రాబోతోందని తెలిపారు. ఈ బయోగ్యాస్ తో రెండున్నర లక్షల మందికి

# ఢిల్లీ హైకోర్టులో కాంగ్రెస్ నేత చిదంబరంకు ఊరట

- ఎయిర్సెల్-మాక్సిస్ కేసులో అభియోగాలు ఎదుర్కొంటున్న చిదంబరం
- చిదంబరంపై విచారణకు గతంలో, ట్రయల్ కోర్టు అనుమతి
- తాజాగా, ట్రయల్ కోర్టు ఉత్తర్వులను నిలిపివేసిన ఢిల్లీ హైకోర్టు

2



**న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో**

కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత చిదంబరంకు ఢిల్లీ హైకోర్టులో భారీ ఊరట లభించింది. ఆయన ఎయిర్సెల్-మాక్సిస్ మనీ లాండరింగ్ కేసులో అభియోగాలు ఎదుర్కొంటున్నాడు. ఈ కేసులో ఆయనపై విచారణకు అనుమతిస్తూ ట్రయల్ కోర్టు గతంలో ఉత్తర్వులను ఇచ్చింది. ఈ ఉత్తర్వులను చిదంబరం హైకోర్టులో సవాల్ చేశారు. దీనిని విచారించిన న్యాయస్థానం ఆయనపై విచారణకు ట్రయల్ కోర్టు ఇచ్చిన

# ఆయనేమైనా టెర్రరిస్టా..

- లగచర్లలో అధికారులపై దాడి కేసులో మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి అరెస్టు చేసిన తీరుపై మండిపడ్డ హైకోర్టు
- వాకింగ్‌కు కేబీఆర్ పార్కుకు వెళ్లిన మాజీ ఎమ్మెల్యేను పోలీసులు అదుపులోకి తీసుకోవడమేమిటి?

2



**హైదరాబాద్-నవభూమిబ్యూరో**

లగచర్లలో అధికారులపై దాడి కేసులో మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్

# సీమపై చంద్రబాబు గురి

- జమిలి వేళ సీమలో సంక్షేమ పథకాల అమలు
- ఎన్నికల హామీల అమలు దిశగా ప్రభుత్వం కార్యాచరణ
- కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుపైన చంద్రబాబు హామీ
- ఈ మేరకు కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు యత్నాలు

2



**అనంతపురం-నవభూమిబ్యూరో**

ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. కేంద్రంలో జమిలి దిశగా అడుగులు వేగంగా పడుతున్నాయి. ఇప్పటికే ఈ మేరకు సంకేతాలు అందుతున్నాయి. దీంతో, ఏపీలోని కూటమి ప్రభుత్వం పాలనా పరంగా .. రాజకీయంగా వరుస నిర్ణయాలు అమలు చేస్తోంది. సంక్షేమ పథకాల అమలు పైన ఫోకస్ చేసింది. జనవరి నుంచి మరిన్ని పథకాలు అమలు చేయాలని భావిస్తోంది. ఇదే సమయంలో రాయలసీమ కేంద్రంగా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ అమలు దిశగా ప్రభుత్వం కార్యాచరణ ప్రారంభించింది. ప్రభుత్వం లేఖతో అమరావతిని రాజధానిగా ఖరారు చేసిన సమయంలోనే కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు పైన చంద్రబాబు హామీ ఇచ్చారు. తాజా ఎన్నికల ప్రచార సమయంలోనూ ఈ అంశాన్ని మరోసారి స్పష్టం చేసారు. కొద్ది రోజుల క్రితం కర్నూలులోని లోకాయుక్తతో పాటుగా న్యాయ సంబంధిత కార్యాలయాలను అమరావతికి తరలిస్తున్నట్లు

# కేటీఆర్ ఇక జైలుకే..

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఢిల్లీకి కాదు.. చంద్ర మండలానికి వెళ్లి ఫిర్యాదు చేసినా తప్పు చేస్తే అరెస్ట్ అవడం ఖాయం
- ప్రభుత్వంలో ఉంటూ కుట్రలు చేశారంటూ కేటీఆర్‌పై రేవంత్ మండిపాటు
- మిడ్‌మానేరు నిర్వాసితుల సమస్యలు పరిష్కరిస్తామని సీఎం హామీ
- వేములవాడలో నిర్వహించిన ప్రజా విజయోత్సవ సభలో సీఎం రేవంత్

2



**వేములవాడ-నవభూమిప్రతినిధి**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై సీఎం రేవంత్ రెడ్డి మరోసారి నిప్పులు చెరిగారు. కేటీఆర్ కుట్రలను గమనిస్తున్నామంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. త్వరలోనే ఊచలు లెక్కపెట్టాల్సి వస్తుందని రేవంత్ రెడ్డి కేటీఆర్‌కు వార్నింగ్ ఇచ్చారు.

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌నుద్దేశించి సీఎం రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తవుతున్న నేపథ్యంలో వేములవాడలో నిర్వహించిన ప్రజా విజయోత్సవ సభలో ఆయన పాల్గొన్నారు. మిడ్‌మానేరు నిర్వాసితుల సమస్యలు పరిష్కరిస్తామని ఈ సందర్భంగా సీఎం హామీ ఇచ్చారు. కొన్నేళ్లుగా వాయిదా పడుతూవస్తున్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తామన్నారు. తమ మంత్రులు ఎప్పటికప్పుడు ప్రాజెక్టులపై సమీక్షిస్తారని చెప్పారు. ప్రజలకు మంచి చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని రేవంత్ రెడ్డి తెలిపారు. అదే సమయంలో కేటీఆర్ లక్ష్యంగా సంచలన వ్యాఖ్యలు చేశారు. అభివృద్ధి ప్రాజెక్టుల కోసం సేకరించే భూమికి రైతులకు రెండు రెట్ల పరిహారం ఇస్తామన్నారు. భూములు తీసుకుని గత బీఆర్ఎస్ ప్రభుత్వం లా పరిహారం ఇవ్వకుండా తప్పించుకోమన్నారు. భూమి మార్కెట్ ధర రూ.10 లక్షలు ఉంటే రూ.30 లక్షల పరిహారం ఇస్తామన్నారు. నష్ట పరిహారం ఎక్కువ ఇస్తే భూయజమానులు తమ భూములు ఇచ్చేందుకు స్వచ్ఛందంగా ముందుకు వస్తారన్నారు. పరిశ్రమలు రావాలంటే భూసేకరణ చేయాల్సిందేనన్నారు. తెలంగాణకు పరిశ్రమలు వద్దని బీఆర్ఎస్ కోరుకుంటుందా అని సీఎం ప్రశ్నించారు. ప్రభుత్వంలో ఉంటూ కుట్రలు చేశారంటూ కేటీఆర్‌పై రేవంత్ మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో సక్రమంగా పరిహారం ఇవ్వలేదన్నారు. కుట్రలు చేసిన కేటీఆర్ ఊచలు లెక్కపెడతారంటూ హెచ్చరించారు. కేటీఆర్ చేసిన కుట్రలను

# చర్చలకు కాంగ్రెస్ దూరం

- జార్కండ్,మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ పూర్తి
- మరో వైపు ఎగ్జిట్ పోల్స్,సర్వేల విడుదల
- ఈ సందర్భంగా జరిగే డిబేట్స్‌కు కాంగ్రెస్ దూరం
- టీవీ ఛానళ్లు టీఆర్పీ రేటింగ్స్‌ను పెంచుకోవడానికి డిబేట్లు
- అందుకే డిబేట్లకు దూరంగా ఉండాలని కాంగ్రెస్ నిర్ణయం

2



**న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో**

జార్కండ్‌లో రెండో విడత అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ జోరుగా కొనసాగుతోంది. మొత్తం 38 నియోజకవర్గాల్లో పలువురు ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకుంటోన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరి నిల్చున్నారు. అటు మహారాష్ట్రలో 288 నియోజకవర్గాల్లో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకుంటోన్నారు. జార్కండ్‌తో పోల్చుకుంటే మహారాష్ట్రలో తొలి రెండు గంటల్లో పోలింగ్ మందకొడిగా సాగడం గమనార్హం. మధ్యాహ్నం 3 గంటల సమయానికి జార్కండ్‌లో 61.47 శాతం మేర పోలింగ్ రిజిస్టర్ అయింది. మహారాష్ట్ర లో ఈ సంఖ్య 45.53 శాతమే. ఈ రెండింటితో పాటు దేశవ్యాప్తంగా రాష్ట్రాల్లో ఉప ఎన్నికల పోలింగ్ కూడా ముమ్మరంగా సాగుతోంది. మహారాష్ట్రలోని నాందెడ్ లోక్‌సభ నియోజకవర్గానికీ ఉప ఎన్నిక నేడే జరుగుతోంది. కాంగ్రెస్ సిట్టింగ్ లోక్‌సభ సభ్యుడు వసంత్ రావ్ బల్వంత్ రావ్ చవాన్ మరణంతో ఇక్కడ ఉప ఎన్నిక అవసరమైంది.

# మరో ఇద్దరు రైతుల ఆత్మహత్య

- అప్పుల బాధ భరించలేక..
- రంగారెడ్డి, మానుకోట జిల్లాల్లో బలవన్మరణం
- ఒకరు ఉరి,ఇంకొకరు పురుగుల మందు తాగి

2



**మొయినాబాద్/నర్సింహులపేట-నవభూమి:** అప్పుల బాధ భరించలేక రంగారెడ్డి, మహబూబాబాద్ జిల్లాల్లో ఇద్దరు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలంలోని పెద్దమంగళారం గ్రామానికి చెందిన బల్వం సిద్ధాంతిగౌడ్ (48) వ్యవసాయం చేయడంతోపాటు ప్రైవేటు ఉద్యోగం కూడా చేసేవాడు. వచ్చిన జీతంతో కుటుంబం గడవని పరిస్థితి నెలకొన్నది. వ్యవసాయం చేయడానికి అప్పులు చేసి పెట్టుబడి పెట్టడంతో నష్టం వచ్చింది. సాగు కోసం చేసిన అప్పులు తీర్చలేక కొన్ని రోజుల క్రితం ఆత్మహత్యకు యత్నించాడు. పెద్దలు మందలించడంతో కొన్ని రోజులు బాగానే ఉన్నా అప్పులు అతన్ని వెంటాడుతునే ఉన్నాయి. చేసిన అప్పులు తీర్చుడానికి మార్గం లేకపోవడంతో బుధవారం ఉదయం పొలంలో ఉన్న చింత చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ పవన్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

# రాజన్న సిరిసిల్ల జిల్లాపై సీఎం రేవంత్ వరాలజల్లు

**వేములవాడ-నవభూమిప్రతినిధి**

రాజన్న సిరిసిల్ల జిల్లాపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరాల జల్లు కురిపించారు. జిల్లాలో పర్యటన సందర్భంగా పలు అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపనలు, భూమి పూజలు చేయనున్నారు. ప్రజాపాలన తొలి ఏడాదిలోనే మొత్తం రూ.694.50 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు శ్రీకారం చుట్టారు సీఎం. రూ. 76 కోట్లతో చేపట్టే శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవాలయ అభివృద్ధి పనులకు ధర్మగుండం వద్ద శంఖుస్థాపన చేయనున్నారు.

రూ.35.25 కోట్లతో చేపట్టే అన్నదానం సత్రం నిర్మాణ పనులు ప్రారంభించనున్నారు. రూ. 45 కోట్లతో చేపట్టే మూల వాగు బ్రిడ్జి నుంచి దేవస్థానం వరకు రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేయనున్నారు. రూ. 166 కోట్లతో చేపట్టే వైద్య కళాశాల, హాస్టల్ బ్లాక్ నిర్మాణ పనులకు సీఎం భూమి పూజ చేస్తారు. రూ.50 కోట్లతో నూలు డిపో నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టనున్నారు. రూ. 52 కోట్లతో కొనరావుపేట మండలంలో చేపట్టే హై లెవెల్ బ్రిడ్జి పనులు, రూ. 3 కోట్లతో నిర్మించే డ్రైన్ పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్నారు. రూ.235 కోట్లతో 4696 మిడ్ మానేరు రిజర్వాయర్ నిర్వాసితులకు నిర్మించే ఇందిరమ్మ ఇండ్ల పనులకు భూమి పూజ చేస్తారు.

మేడిపల్లి మండలంలో జూనియర్ కళాశాల రుద్రంగి మండల కేంద్రంలో అడ్వాన్స్ టెక్నాలజీ కేంద్రానికి శంకుస్థాపన చేయనున్నారు. సిరిసిల్ల లో రూ. 26 కోట్లతో నిర్మించిన ఎస్పీ కార్యాలయ భవనం, వేములవాడలో రూ. కోటి 45 లక్షలతో నిర్మించిన జిల్లా గ్రంధాలయ భవనం, రూ. 4 కోట్ల 80 లక్షలతో నిర్మించిన వర్కింగ్ ఉమెన్ హాస్టల్ భవనాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారుర. గల్ఫ్ దేశాలలో మరణించిన 17 కుటుంబాలకు 85 లక్షల పరిహారం పంపిణీ చేయనున్నారు. 631



2

# బెల్టు షాపు పెడితే.. బెల్టు తీస్తా

- ఏపీ సీఎం చంద్రబాబు మాస్ వార్నింగ్
- ఎవరైనా క్రైమ్‌కు పాల్పడితే తాట తీస్తానన్న చంద్రబాబు
- వైసీపీ పాలనలో రాష్ట్రం వెంటిలేటర్ పైకి వెళ్లిందని విమర్శ
- రాష్ట్రం ఇప్పుడిప్పుడే గాడిలో పడుతోందని వ్యాఖ్య

2



**అమరావతి-నవభూమిబ్యూరో**

మద్యం అమ్మకాలు పారదర్శకంగా ఉండాలని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. కేవలం వైన్ షాపుల ద్వారా మాత్రమే అమ్మకాలు జరగాలని చెప్పారు. ఎవరైనా బెల్టు షాపులు పెడితే... వారి బెల్టు తీస్తామని మాస్ వార్నింగ్ ఇచ్చారు. బెల్టు షాపులు లేకుండా స్థానిక ఎమ్మెల్యేలు చూసుకోవాలని చెప్పారు. రాష్ట్రంలో ఎవరైనా క్రైమ్ కు పాల్పడితే తాట తీస్తానని హెచ్చరించారు. అమ్మాయిలు, మహిళలపై సోషల్ మీడియాలో ఎవరైనా పోస్టులు పెడితే అదే వారికి ఆఖరి రోజు అన్నారు. అసెంబ్లీలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. నాలుగు దశాబ్దాలుగా ప్రజలు తనను ఆదరించారని... ఎక్కువసార్లు ప్రజలు తనను సీఎం చేశారని చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వంలో తనను ఎన్నో ఇబ్బందులకు గురి చేశారని... జైలుకు కూడా పంపించారని అన్నారు. అధికారం ఉన్నా, లేకున్నా తాను ప్రజల కోసమే పని చేశానని చెప్పారు. వైసీపీ పాలనలో రాష్ట్రం వెంటిలేటర్ పైకి వెళ్లిందని అన్నారు. కీలక సమయంలో ప్రజలు తమకు ఘన విజయం అందించారని చెప్పారు. కేంద్రం అన్ని విధాలుగా సాయం చేస్తోందని చెప్పారు. రాష్ట్రం ఇప్పుడిప్పుడే గాడిలో పడుతోందని అన్నారు.

అధికారంలోకి రాగానే పెన్షన్లు రూ. 4 వేలకు



## మెట్రోస్టేషన్ల వద్ద ఆకతాయిలు..

**హైదరాబాద్-నవభూమి:** నగరంలోని పలు మెట్రోస్టేషన్ల( వద్ద ఆకతాయిల ఆగడాలు పెరిగిపోతున్నాయి. రాత్రి పదిన్నర గంటల తర్వాత మద్యం తాగి పోకిరీలు, యాచకులు రైలుదిగి ఇంటికి వెళ్తున్న వారితో అసభ్యంగా ప్రవర్తిస్తున్నారు. దీంతో ప్రయాణికులు, ముఖ్యంగా మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నగరంలోని ఎల్బీనగర్-మియాపూర్, జేబీఎస్-ఎంజీబీఎస్, నాగోలు-రాయదుర్గం కారిడార్ల పరిధిలో 57 స్టేషన్లు ఉన్నాయి.

ఆయా స్టేషన్ల మీదుగా ప్రతినిత్యం 1028 సర్వీసులు నడుస్తున్నాయి. ఉదయం 6 నుంచి రాత్రి 11 గంటల వరకు రైళ్లు తిరుగుతూనే ఉంటాయి. రాత్రివేళల్లో మెట్రోస్టేషన్ల కింద కొంతమంది యువకులు గుంపులుగా చేరి మద్యం, సిగరెట్లు తాగుతూ హల్‌చల్ చేస్తున్నారు. మెట్రో, పోలీసుల అధికారుల నిఘా లోపం వల్లే ఆకతాయిలు వికృత చేష్టలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అమీర్‌పేట, ఎస్ఆర్‌నగర్, కూకట్‌పల్లి, ఖైరతాబాద్, గాంధీభవన్, మలక్‌పేట, విక్టోరియా, సికింద్రాబాద్ వెస్ట్, ఉప్పల్ స్టేషన్ల కింద రాత్రి 10.30 గంటలు దాటిన తర్వాత ఫుట్‌పాత్‌పై నడుచుకుంటూ వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నామని పలువురు ప్రయాణికులు చెబుతున్నారు. కొంతమంది యువకులు బైక్‌లు పార్క్ చేసి మద్యం తాగుతున్నారని వాపోతున్నారు.

- కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ, మియాపూర్ స్టేషన్ల సమీపంలో రాత్రి 11 దాటిన తర్వాత కొంతమంది యువతీ, యువకులు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.



## నారాయణపేట ప్రభుత్వ పాఠశాలలో ఫుడ్ పాయిజన్.. 50 మంది విద్యార్థులకు అస్వస్థత



**నారాయణపేట-నవభూమి:**రాష్ట్రంలోని విద్యాలయాల్లో మరోసారి ఫుడ్‌పాయిజన్ ఘటన వెలుగులోకి వచ్చింది. నారాయణపేట జిల్లా మాగనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం వికటించి 50 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేస్తుండగా ఒక్కసారిగా వాంతులు చేసుకున్నారు. ఇది గమనించిన పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయులు వెంటనే విద్యార్థులను స్థానిక ఆస్పత్రికి తరలించారు. ఫుడ్‌పాయిజన్‌కు గురైన ఘటనలో 8 మంది విద్యార్థుల పరిస్థితి విషమంగా ఉంది. కాగా, ముగ్గురు విద్యార్థులను మక్తల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మరో ఐదుగుర్ని మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

## కురుమూర్తి స్వామిని దర్శించుకున్న హరీశ్‌రావు



**మహబూబ్‌నగర్ -నవభూమి:** : మహబూబ్‌నగర్ జిల్లా చిన్న చింతకుంట మండల పరిధి లోని అమ్మాపురం కురుమూర్తి స్వామి ఆలయాన్ని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ పూజారులు హరీష్ రావుకు సంప్రదాయ పద్ధతిలో ఆశీర్వచనం అందించి, స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. హరీశ్‌రావు వెంట మాజీ మంత్రులు నిరంజన్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్ రెడ్డి, చిట్టెం రామ్మోహన్ రెడ్డి, లక్ష్మారెడ్డి, గువ్వల బాలరాజు, మాజీ ఎంపీ శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, వెంకటేశ్వర్ రెడ్డి, రజనీ సాయిచంద్, ఇంతియాజ్‌తో పాటు పలువురు ఉన్నారు.

## హైదరాబాద్ ట్రాఫిక్ కష్టాలకు చెక్.. ఎలివేటెడ్ కారిడార్లకు ప్రాథమిక నోటిఫికేషన్



**హైదరాబాద్-నవభూమి:** జంట నగరాల్లో ట్రాఫిక్ తగ్గించేందుకు హైదరాబాద్-కరీంనగర్, హైదరాబాద్- కండ్లకోయ పైవంతెనల కారిడార్ల నిర్మాణాలకు రేవంత్ సర్కార్ నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. రాజధాని హైదరాబాద్‌లో ట్రాఫిక్ చిక్కులకు చెక్‌పెట్టేందుకు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా వీటిని చేపట్టింది. అయితే ఈ ప్రాజెక్టుల నిర్మాణంలో కీలక ముందడుగు పడింది. కారిడార్ల భూసేకరణకు జిల్లా కలెక్టర్ ప్రాథమిక నోటిఫికేషన్ విడుదల చేశారు.

హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ కష్టాలకు చెక్ పెట్టేందుకు తొలి డబుల్ డెక్కర్, ఎలివేటెడ్ కారిడార్లు నిర్మించేందుకు రేవంత్ సర్కార్ నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. జంట నగరాల (హైదరాబాద్, సికింద్రాబాద్)తో పాటు ఉత్తర తెలంగాణ జిల్లాల ప్రజలు, వాహనదారుల ట్రాఫిక్ కష్టాలకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. నేషనల్ హైవే 44పై 5.320 కిలోమీటర్ల కారిడార్‌ను రూ.1,580 కోట్ల వ్యయంతో నిర్మించనున్నారు. సికింద్రాబాద్ ప్యారడైజ్ నుంచి తాడ్‌బండ్, బోయినపల్లి జంక్షన్ మీదుగా డెయిరీ ఫామ్ రోడ్డు వరకు 5.32 కిలోమీటర్ల డబుల్డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్, జేబీఎస్ నుంచి శామీర్పేట ఓఆర్‌ఆర్ను కలుపుతూ(18.1 కిలోమీటర్ల) మరో ఎలివేటెడ్ కారిడార్ నిర్మించనున్నారు. ఈ కారిడార్ నిర్మాణంలో కీలక ముందడుగు పడింది. కారిడార్ల నిర్మాణాలకు రెవెన్యూ యంత్రాంగం భూసేకరణ చేపట్టేందుకు సిద్ధమైంది. ఈ మార్గాల్లో ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులతోపాటు సర్కార్ భూముల వివరాలను గుర్తించేందుకు హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ప్రైమరీ నోటిఫికేషన్ జారీ చేశారు. భూసేకరణ ప్రక్రియను వేగంగా పూర్తిచేయాలని డిప్యూటీ కలెక్టర్లు, స్థానిక ఎమ్మార్వోలకు సూచించారు. భూసేకరణ పనులను నిర్ణీత గడువులోనే పూర్తి చేయాలన్నారు. 100 రోజుల్లోపు ప్రాథమిక నోటిఫికేషన్, డిక్లరేషన్ల ప్రక్రియలు పూర్తవ్వాలని చెప్పారు. మరో మూడు నెలల్లో భూసేకరణ ప్రక్రియ పూర్చి చేయాలని.. ఆ తర్వాత నెల కారిడార్ల పనులను మ్మొదలు పేట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇక కంటోన్మెంట్ పరిధిలో ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం కోసం భూములు సేకరించిన తర్వాత మిగిలిన భూములు కబ్జా కాకుండా ప్రహరీలు నిర్మించాలని హెచ్ఎండీఏ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఎలివేటెడ్ కారిడార్ కోసం కంటోన్మెంట్ పరిధిలో మ్మొత్తం 113.48 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉంది. ఎంత భూమిని సేకరిస్తే అంతే మొత్తంలో భూములను ఇతర ప్రాంతాల్లో కంటోన్మెంట్‌కు ఇవ్వడానికి హెచ్ఎండీఏ ఇప్పటికే అంగీకారం తెలిపింది. ప్రాజెక్టుల కోసం సేకరించిన డిఫెన్స్ భూములు మినహా, మిగిలిన భూములకు ప్రహరీ నిర్మించేందుకు హెచ్ఎండీఏ సిద్ధమైంది. దాదాపు రూ.27 కోట్లతో ప్రహరీలు నిర్మించడానికి తాజాగా టెండర్లను ఆహ్వానించింది. ఈ ఫెన్సింగ్నిర్మాణాలను నాలుగు రీచ్లుగా విభజించి పనులు చేపట్టనున్నారు. ఈ ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణంతో ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య పూర్తిగా తొలగిపోయే ఛాన్స్ ఉంది. నేషనల్ హైవే%-%44 రహదారిలో మేడ్చల్, మెదక్, కామారెడ్డి, నిజామాబాద్, నిర్మల్, ఆదిలాబాద్ రూట్లలో వెళ్లే వాహనాలకు ట్రాఫిక్ ఇబ్బందులు తప్పనున్నాయి. అలాగే జేబీఎస్-శామీర్పేట వరకూ నిర్మించే కారిడార్లో తిరుమలగిరి, అల్వాల్జంక్షన్ల వద్ద ట్రాఫిక్ రద్దీ తగ్గనుంది.

# తెలంగాణ మహిళలకు గుడ్‌న్యూస్.. ఈ ఏడాది రూ.25 వేల కోట్లు, భట్టి కీలక ప్రకటన



**హైదరాబాద్-నవభూమి:**మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దటమే తమ ప్రభుత్వ లక్ష్యమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడించారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు రానున్న ఐదేళ్ల కాలంలో రూ. లక్ష కోట్లు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. ఏడాది కాలంలోనే రూ. 25 వేల కోట్ల రుణాలు మంజూరు చేస్తామన్నారు. తెలంగాణ మహిళలకు రేవంత్ సర్కార్ తీపి కబురు చెప్పింది. మహిళా సంఘాలకు ఐదేళ్ల కాలంలోనే రూ.లక్ష కోట్ల వడ్డీ లేని రుణాలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. ఏడాదిలో రూ.25వేల కోట్ల రుణాలు ఇవ్వనున్నట్లు వరంగల్ సభలో స్పష్టం చేశారు. ఈ రుణాలతో మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగాలనే సంకల్పంతో తమ ప్రభుత్వం ముందుకు వెళ్తోందని అన్నారు. మహిళా సంఘాలతో సౌర విద్యుత్తు ప్లాంట్లు ఏర్పాటు చేయించడం చరిత్రాత్మక నిర్ణయమని వ్యాఖ్యానించారు.

తెలంగాణలోని మహిళల ఎదుగుదలకు తమ ప్రభుత్వం ఎన్ని కోట్లయినా ఖర్చు చేస్తుందని చెప్పారు. అవసరమైతే ఐదేళ్లలో రూ.లక్ష కోట్లు ఖర్చు చేయడానికి సిద్ధంగా ఉన్నాం. మహిళలు ఆర్థికంగా బలోపేతమైతేనే ఏ రాష్ట్రమైనా బాగుపడుతుందన్నారు. అనేక భావజాలాలకు స్వేచ్ఛగా మాట్లాడుకునే వాతావరణాన్ని తమ ప్రభుత్వం కల్పించిందన్నారు. గత ప్రభుత్వం వడ్డీలేని రుణాలను ఇవ్వకుండా మహిళా ఆర్థిక స్వాతంత్ర్యాన్ని నిర్లక్ష్యం చేసిందని భట్టి విమర్శించారు. జనాభాలో సగం మంది ఉన్న మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దుతామని.. వారిని కోటీశ్వరులను చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. అస్తవ్యస్తంగా ఉన్న ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దుతున్నామని.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. మరో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. మహిళలకు సోలార్ ప్లాంట్లు, బీమా సౌకర్యం కల్పించడం దేశంలోనే ప్రథమమని చెప్పారు. ధరణిలో 2.45 లక్షల దరఖాస్తులు పెండింగ్‌లో ఉంటే వాటన్నింటినీ తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పరిష్కరించినట్లు చెప్పారు. వరంగల్‌ను మహానగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా మాస్టర్‌ప్లాన్‌కు ఆమోదం తెలిపామన్నారు. గత ప్రభుత్వం హయంలో కొంతమంది పెద్దలు పేదల, ప్రభుత్వ భూములను కబ్జా చేశారని ఆరోపించారు. తమ ప్రభుత్వంలో ప్రతి గజాన్నీ స్వాధీనం చేసుకొని పేదవాళ్లకు ఇస్తామని చెప్పారు. త్వరలోనే కొత్త రెవెన్యూ చట్టాన్ని తీసుకురానున్నట్లు మంత్రి పొంగులేటి వెల్లడించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తొలి బడ్జెట్‌లోనే రైతుల సంక్షేమం కోసం రూ.72 వేల కోట్లు కేటాయించామన్నారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి మాటా నెరవేరుస్తున్నామని వెల్లడించారు.

# సీమపై చంద్రబాబు గురి

**(1వపేజీ తరువాయి)**ప్రభుత్వం పేర్కొంది. దీని పైన సీమ ప్రాంతానికి చెందిన వైసీపీ నేతలు అభ్యంతరం వ్యక్తం చేసారు.

ఈ సమయంలో ప్రభుత్వం కీలక అడుగు వేసింది. గతంలో ఇచ్చిన హామీ మేరకు కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు దిశగా ప్రక్రియ ప్రారంభించింది.

ఈ మేరకు రాష్ట్ర న్యాయ శాఖ కార్యదర్శి సునీత రాష్ట్ర హైకోర్టు రిజిస్ట్రార్ కు లేఖ రాసారు. సీఎం కార్యాలయం నుంచి న్యాయశాఖకు వచ్చిన లేఖతో ప్రక్రియను న్యాయశాఖ మొదలుపెట్టింది. "ఉచిత బస్సు, రైతు భరోసా అమలు ముహూర్తం ఖరారు..!!" హైకోర్టు బెంచ్ రాయలసీమ ప్రాంతంలోని నాలుగు ఉమ్మడి జిల్లాలు గా ఉన్న కర్నూలు, కడప, అనంతపురం, చిత్తూరు జిల్లాల కు సంబంధించి హైకోర్టులో పెండింగ్ లో ఉన్న కేసుల వివరాలు ఇవ్వాలని న్యాయ శాఖ కార్యదర్శి తన లేఖలో కోరారు.

కర్నూలులో బెంచ్ ఏర్పాటు చేయాలంటే ఈ నాలుగు జిల్లాకు సంబంధించి ప్రస్తుతం కోర్టులో ఉన్న కేసుల్లో 1/3 ఉండాలని లేఖలో పేర్కొన్నారు. అదే విధంగా రాష్ట్రంలో ప్రస్తుత జనాభా 4.95 కోట్లుగా ఉంది. రాయలసీమలో 1.59 కోట్ల మంది ఉన్నట్లు తాజా లెక్కలు స్పష్టం చేస్తున్నాయి.

దీని ద్వారా 25 శాతం మంది రాయలసీమ జిల్లాల్లో ఉన్నట్లు స్పష్టం అవుతోంది. దేశ వ్యాప్తంగా ఇప్పటికే ఏడు రాష్ట్రాల్లో పలు ప్రాంతాల్లో హైకోర్టుల బెంచ్ లు ఏర్పాటు చేసారు. సీమ ప్రాంతం నుంచి నేరుగా రాజధానికి రవాణా సౌకర్యాల అంశం ప్రస్తావనకు వచ్చింది.

# చర్చలకు కాంగ్రెస్ దూరం

**(1వపేజీ తరువాయి)**పాలక్కాడ్- కేరళ, ఛబ్బేవాల్- పంజాబ్, గిద్దర్‌బాహా- పంజాబ్, డేరా బాబా నానక్- పంజాబ్, బర్నాలా- పంజాబ్, ఘజియాబాద్- ఉత్తర ప్రదేశ్, మఝువాన్- ఉత్తర ప్రదేశ్, మీరాపూర్- ఉత్తర ప్రదేశ్, ఖైర్- ఉత్తర ప్రదేశ్, ఫూల్‌పూర్- ఉత్తర ప్రదేశ్, కుందార్కి- ఉత్తర ప్రదేశ్, కర్హాల్, కటేహారి- ఉత్తర ప్రదేశ్, కేదార్‌నాథ్- ఉత్తరాఖండ్ నియోజకవర్గాలకు ఉప ఎన్నిక కొనసాగుతోంది. ఆయా ఎన్నికల ఫలితాలు ఈ నెల 23వ తేదీన వెలువడతాయి.

కాగా- పోలింగ్ ప్రక్రియ మగిసిన వెంటనే ఎగ్జిట్ పోల్స్ వెలువడనున్నాయి. మహారాష్ట్ర, జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికలపై తాము నిర్వహించిన సర్వేలు, ఎగ్జిట్ పోల్స్‌పై తమ అంచనాలను వెల్లడించనున్నాయి. ఇదివరకు హర్యానా, జమ్మూ కాశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలపై ఎగ్జిట్ పోల్స్ అంచనాలు పెద్దగా వాస్తవ రూపాన్ని దాల్చని నేపథ్యంలో ఈ సారి ఎలా ఉంటాయనేది ఆసక్తి రేపుతోంది.

కాగా- ఈ పరిణామాల మధ్య అఖిల భారత కాంగ్రెస్ కమిటీ కీలక నిర్ణయాన్ని తీసుకుంది. ఎగ్జిట్ పోల్స్ సందర్భంగా టీవీ ఛానళ్లు, వివిధ మీడియా సంస్థలు నిర్వహించబోయే డిబేట్లల్లో పాల్గొనకూడదని నిర్ణయించింది. ఈ చర్చల్లో పార్టీ తరఫున ఎవ్వరూ పాల్గొనకూడదని ఆదేశించింది. ఒకవేళ ఎవరైనా పాల్గొంటే అది వారి వ్యక్తిగత అభిప్రాయమౌతుందని పేర్కొంది. టీవీ ఛానళ్లు తమ టీఆర్పీ రేటింగ్స్‌ను పెంచుకోవడానికి ఇలాంటి డిబేట్లను పెడుతుంటాయని కాంగ్రెస్ పార్టీ అభిప్రాయపడుతోంది. ఈ ఏడాది ముగిసిన లోక్‌సభ ఎన్నికల ఎగ్జిట్ పోల్స్‌కు కూడా కాంగ్రెస్ పార్టీ దూరంగా ఉన్న విషయం తెలిసిందే. ప్రజా తీర్పు ఈవీఎంలల్లో నిక్షిప్తమైందని, రాజెవరో, బంటెవరో ఓట్ల లెక్కింపులో తేలుతుందని పేర్కొంది.

# చెరువులకు పునరుజ్జీవం

- కాలుష్యరహితంగా మార్చేందుకు చర్యలు
- అపార్ట్‌మెంట్లలో ఎస్టీపీల ఏర్పాటుపై దృష్టి
- తొలివిడతలో ఐదు చెరువుల సుందరీకరణ

**హైదరాబాద్-నవభూమి** హైదరాబాద్ చెరువులను కాలుష్యరహితంగా మార్చే దిశగా దృష్టిపెట్టింది హైడ్రా. కాలుష్యనియంత్రణ బోర్డుతో ఇటీవల సమావేశమైన కమిషనర్ రంగనాథ్ చెరువుల శుద్ధీకరణపై చర్చించారు. చెరువులు కలుష్యకాసారంలా మారడానికి కారణాలను తెలుసుకున్నారు. ముఖ్యంగా చెరువుల్లోకి మురుగునీరు ఎలా చేరుతుందో మార్గాలను తెలుసుకునే దిశగా ఆయా చెరువులు ఉన్న ప్రాంతాల్లో వివిధ శాఖల సమన్వయంతో సర్వే నిర్వహించాలని నిర్ణయించారు.

బెంగళూరు పర్యటన తర్వాత పైలట్ ప్రాజెక్ట్ చేయాలనుకున్నప్పటికీ బడ్జెట్ కారణంగా అది వాయిదా పడింది. దీంతో చెరువులను శుద్ధీ చేసే ప్రక్రియపై హైడ్రా దృష్టిపెట్టింది. లేక్ మ్యాన్ ఆనంద్‌మల్లిగవాడ్‌తో కలిసి బెంగళూరులో ఆయన అభివృద్ధి చేసిన 35 చెరువులను పరిశీలించిన హైడ్రా కమిషనర్.. ప్రస్తుతం హైదరాబాద్‌లో తొలిదశలో ఐదు చెరువుల శుద్ధీకరణకు నిర్ణయం తీసుకున్నారు. తొలిదశలో చందానగర్‌లోని ఈర్లచెరువు, అంబర్‌పేటలోని బతుకమ్మకుంట, తార్నాకలోని ఎర్రకుంట, మాదాపూర్‌లోని తమ్మిడిచెరువు, ఖాజాగూడలోని తౌతాని కుంటలను పునరుద్ధరించాలని నిర్ణయించారు.

**100 చెరువుల్లో మురుగునీరు**

హైడ్రా పరిధిలో ఓఆర్ఆర్ లోపల 565 చెరువులున్నాయి. వీటిలో సుమారు వంద చెరువుల్లో మురుగునీరు ఉన్నట్లు హైడ్రా బృందం సర్వేలో తేలింది. చెరువుల్లో పూడికతీయడంతో పాటు ఆ మట్టితో గట్లు ఏర్పాటు చేసి.. సుందరీకరణ పనులు చేస్తారు. చెరువులోకి చేరే మురుగునీటిని శుద్ధిచేసే ప్రక్రియపై స్థానికులతో కలిపి ఒక పరిరక్షణ కమిటీ ఏర్పాటు చేయాలని కూడా నిర్ణయించారు.

**బెంగళూరు తరహాలో..**

బృహత్ బెంగళూరు మహాపాలిక తరహాలో జీహెచ్ఎంసీ, ఓఆర్ఆర్‌లోపలి మున్సిపాలిటీల పరిధిలో చెరువుల్లోకి వస్తున్న పారిశ్రామిక వ్యర్థాలు, నాలాలు, అపార్ట్‌మెంట్ల ద్వారా వస్తున్న వ్యర్థాలపై దృష్టి పెట్టి ఆయా శాఖల సహకారంతో వాటిని ఆపడానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలో చర్చించారు. ఏయే చెరువుల్లో పరిశ్రమల వ్యర్థాలు కలుస్తున్నాయో పరిశీలించి.. వాటికి నోటీసులను ఇవ్వాలని పీసీబీ బృందానికి హైడ్రా కమిషనర్ సూచించినట్లు తెలిసింది. అంతేకాకుండా అపార్ట్‌మెంట్లలో ఎస్టీపీలు ఏర్పాటుపై సంబంధిత అధికారులు పర్యవేక్షించి రిపోర్ట్ ఇవ్వాలని సూచించారు.

**తొలివిడతలో..**

తొలివిడతలో 5 చెరువులను శుద్ధీ చేయడానికి నిర్ణయించారు. ఈర్లచెరువు, బతుకమ్మకుంట, ఎర్రకుంట, తౌతాని కుంట, తమ్మిడి చెరువులను ఎంపిక చేశారు. బతుకమ్మకుంట, ఎర్రకుంట, తౌతానికుంటలను ఇప్పటికే హైడ్రా కమిషనర్ రంగనాథ్ బృందం సందర్శించిస్థానికులతో చెరువుల అభివృద్ధిపై చర్చించింది. తక్కువ ఖర్చుతో చెరువుల శుద్ధీకరణతో పాటు సుందరీకరణ చేపట్టాలనుకుంటున్నారు.




## సర్వేలన్నీ ఏకపక్షమే!

**(1వపేజీ తరువాయి)**సీట్లు, ఇండియా కూటమికి 37-47, ఇతరులకు 1-6 సీట్లు వస్తాయని పేర్కొంది. పీమార్క్ తోపాటు యాక్సెస్ మైఇండియా, పోల్స్ ఆఫ్ పోల్స్ ఇండి కూటమికి ఎక్కువ సీట్లను కట్టబెట్టాయి. యాక్సెస్ మైఇండియా ఎగ్జిట్ పోల్స్ ప్రకారం.. ఎన్డీఏకు 25 సీట్లు, ఇండియా కూటమికి 53 సీట్లు, ఇతరులకు 3 స్థానాలు దక్కే అవకాశం ఉందని అంచనా వేసింది. పోల్స్ ఆఫ్ పల్స్ అంచనాల ప్రకారం.. ఎన్డీఏకు 38-43 సీట్లు, ఇండియా కూటమికి 34-41 స్థానాలు, ఇతరులకు 2-5 సీట్లు వస్తాయని వెల్లడించింది. మొత్తానికి ఈ ఎగ్జిట్స్ పోల్స్ అధికారంలో ఉన్న జేఎంఎం పార్టీకి కొంత నిరాశనే కలిగించాలే ఉన్నాయి. అయితే, నవంబర్ 23 వచ్చే అసలైన ఫలితాల వరకు వేచిచూడాల్సిందే.

## ఢిల్లీ హైకోర్టులో కాంగ్రెస్ నేత చిదంబరంకు ఊరట

**(1వపేజీ తరువాయి)**ఉత్తర్వులను నిలిపివేసింది. ఈ మేరకు సింగిల్ జడ్జి ధర్మాసనం ఈడీకి నోటీసులు జారీ చేసింది. ఎయిర్సెల్ - మాక్సిస్ కేసులో చిదంబరం, ఆయన కుమారుడు కార్తి చిదంబరంపై ట్రయల్ కోర్టులో ఈడీ ఛార్జిషీట్‌లు దాఖలు చేసింది. అయితే, ఆ ఉత్తర్వులను నిలిపివేయాలని చిదంబరం హైకోర్టును ఆశ్రయించారు. దీంతో తాజాగా హైకోర్టు ఈ విచారణను నిలిపివేసింది.

## ఆయనేమైనా టెర్రరిస్టా..

**(1వపేజీ తరువాయి)**నేత పట్నం నరేందర్ రెడ్డిని పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. వాకింగ్ కోసం కేబీఆర్ పార్కుకు వెళ్లిన మాజీ ఎమ్మెల్యేను పోలీసులు అదుపులోకి తీసుకుని బలవంతంగా తరలించడంపై బీఆర్ఎస్ మండిపడింది. ఈ సంఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. తాజాగా ఈ కేసు కోర్టులో విచారణకు రాగా.. పట్నం నరేందర్ రెడ్డిని అరెస్టు చేసిన తీరుపై హైకోర్టు సీరియస్‌గా స్పందించింది. ఆయనేమైనా టెర్రరిస్టా.. ఎందుకలా అరెస్టు చేయాల్సి వచ్చిందని పోలీసులను ప్రశ్నించింది. వాకింగ్‌కు వెళ్లిన మాజీ ఎమ్మెల్యేను ఉగ్రవాదిలా అరెస్టు చేయడమేంటని నిలదీసింది. నరేందర్ రెడ్డి పరారీలో ఉన్నాడా అంటూ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ను కోర్టు ప్రశ్నించింది. అదేవిధంగా, లగచర్ల ఘటనపై పోలీసులు ఇచ్చిన రిపోర్టునూ తప్పుబట్టింది. లగచర్లలో జరిగిన దాడిలో అధికారులకు తీవ్ర గాయాలయ్యాయని చెప్పిన పోలీసులు.. నివేదికలో మాత్రం చిన్న గాయాలైనట్లు పేర్కొన్నారని హైకోర్టు అసహనం వ్యక్తం చేసింది.

## కేటీఆర్ ఇక జైలుకే..

**(1వపేజీ తరువాయి)**గమనిస్తున్నామని రేవంత్ పేర్కొన్నారు. ఎంత ఎగురుతావో ఎగురంటూ చురకలంటించారు. కేటీఆర్ తన వైఖరి మార్చుకోవాలని రేవంత్ పరోక్షంగా సూచించారు.

తెలంగాణ రాజకీయం గత కొద్దిరోజులుగా రేవంత్ వర్సెస్ కేటీఆర్‌గా నడుస్తోంది. ఓవైపు గత బీఆర్ఎస్ ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయిందని, అసమర్థ పాలనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని కాంగ్రెస్ ఆరోపిస్తుంటే.. అధికారంలోకి వచ్చిన ఏడాదవుతున్నా సీఎం రేవంత్‌కు పాలన చేతకావడంలేదని బీఆర్ఎస్ విమర్శిస్తోంది. రేవంత్ రెడ్డిని బీఆర్ఎస్ టార్గెట్ చేయగా.. కేటీఆర్‌ను కాంగ్రెస్ టార్గెట్ చేస్తోంది. రెండు పార్టీల కంటే ఇద్దరు వ్యక్తుల మధ్య వార్‌గా తెలంగాణ రాజకీయాల్లో గత కొద్దిరోజులుగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో కేటీఆర్ ఊచలు లెక్కపెట్టాల్సి వస్తోందంటూ రేవంత్ చేసిన వ్యాఖ్యలు కలకలం రేపుతున్నాయి.

## మరో ఇద్దరు రైతుల ఆత్మహత్య

**(1వపేజీ తరువాయి)**గోల్‌తండాలో యువరైతు..మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలం గోల్ బోడ్కతండా గ్రామ పంచాయతీ పరిధిలోని గోల్‌తండాకు చెందిన రైతు లూనావత్ సురేశ్ (20)కు ఎకరం 10 గుంటల పొలం ఉన్నది. ఎకరంలో మిర్చి, 10 గుంటల్లో వరి సాగు చేశాడు. మిరప పంటకు పురుగు మందులు తదితర సాగు ఖర్చులకు డబ్బులు లేకపోవడంతో భార్య పుస్తెలతాడు కుదువ పెట్టేందుకు ప్రయత్నించగా ఆమె నిరాకరించింది. ఈ క్రమంలో గొడవలు జరిగాయి. పంట పెట్టుబడికి డబ్బులేక, కు టుంబ కలహాలతో మనస్తాపం చెందిన సురేశ్ ఈ నెల 14న పురుగుల మందు తాగడంతో చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించగా, చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

## రాజన్న సిరిసిల్ల జిల్లాపై సీఎం రేవంత్ వరాల జల్లు

**(1వపేజీ తరువాయి)**శివశక్తి మహిళా సంఘాలకు రూ.102 కోట్ల బ్యాంకు లింకేజీ రుణాల చెక్కును సీఎం రేవంత్ పంపిణీ చేయనున్నారు. కాగా.. ఉదయం వేములవాడ రాజన్న ఆలయానికి చేరుకున్న సీఎం రేవంత్‌కు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆపై శ్రీ రాజరాజేశ్వరస్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆపై ముఖ్యమంత్రి కోడె మొక్కులు చెల్లించుకున్నారు. రాజన్న ఆలయంలో దర్శనానంతరం సీఎం రేవంత్ ప్రజా విజయోత్సవం సభలో పాల్గొని ప్రసంగించనున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ వెంట మంత్రులు ఉత్తమ్ కుమార్, శ్రీధర్ బాబు, దామోదర రాజానర్సింహా, పొంగులేటి, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఉన్నారు.

## సంక్రాంతి నాటికి గుంతలు లేని రోడ్లు

**(1వపేజీ తరువాయి)**ఉపాధి లభించే అవకాశం ఉందని చెప్పారు. పరిశ్రమల కోసం 25 పాలసీలు తీసుకొచ్చామని తెలిపారు. ఇప్పటికే మెగా డీఎస్సీ ప్రకటించామని చెప్పారు. గంజాయి, డ్రగ్స్ వల్లే రాష్ట్రంలో దారుణాలు జరుగుతున్నాయని ముఖ్యమంత్రి తెలిపారు. మాదకద్రవ్యాల నిర్మూలనకు కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. నేరాలు చేసే వారిపై ఉక్కుపాదం మోపుతామని... దోషులకు శిక్ష విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని హెచ్చరించారు. రాష్ట్రంలో ఇప్పటికే 101 అన్న క్యాంటీన్లు ఉన్నాయని... భవిష్యత్తులో మరిన్ని క్యాంటీన్లను ప్రారంభిస్తామని చంద్రబాబు చెప్పారు. బుక్ చేసుకున్న వారందరికీ ఉచిత గ్యాస్ సిలిండర్లను ఇస్తున్నామని తెలిపారు. విజయవాడ వరదల సమయంలో రూ. 500 కోట్ల విరాళాలు వచ్చాయని... తమ ప్రభుత్వంపై నమ్మకంతో దాతలు పెద్ద మొత్తంలో విరాళాలు ఇచ్చారని చెప్పారు.

### బెల్టు షాపు పెడితే..బెల్టు తీస్తా

**(1వపేజీ తరువాయి)**పెంచామని చంద్రబాబు చెప్పారు. 64 లక్షల మందికి పెన్షన్లు అందిస్తున్నామని తెలిపారు. వైసీపీ పాలనలో రూ. 10 లక్షల కోట్ల అప్పులు చేశారని మండిపడ్డారు. అప్పులను లెక్కలతో సహా అసెంబ్లీలో చూపించామని చెప్పారు. పేదలకు పక్కా ఇళ్లను నిర్మించిన ఘనత టీడీపీకే దక్కుతుందని అన్నారు.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in




## మహా ఎన్నికలు.. ఓటేసిన సినీ ప్రముఖులు



**ముంబై-నవభూమి:** మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ మందకొడిగా సాగుతోంది. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ మధ్యాహ్నం 1 గంట వరకూ 32 శాతం మాత్రమే నమోదైంది. ఇక బాలీవుడ్ తారలు పోలింగ్ కేంద్రాలకు తరలి వచ్చి ఓటు హక్కు వినియోగించుకుంటున్నారు.బీటౌన్ సెలబ్రిటీలు మాధురీ దీక్షిత్, రకుల్ ప్రీత్ సింగ్, జాకీ భగ్నానీ, అర్జున్ కపూర్, ప్రేమ్ చోప్రా, సింగర్ కైలాశ్ ఖేర్, సునీల్ శెట్టి, రితేశ్ దేశ్‌ముఖ్, జెనీలియా, సైఫ్ అలీఖాన్, కరీనా కపూర్ ఖాన్, పూనమ్ దిల్లాన్, జునైద్ ఖాన్, జావెద్ అక్తర్, మనీశ్ మల్హోత్ర, సింగర్ శంకర్ మహదేవన్, డైరెక్టర్ రోహిత్ శెట్టి తదితరులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ప్రజలు తమ విలువైన ఓటు హక్కు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.

## పార్క్ చేసిన కారు టాప్‌పై కోతి జంప్.. తర్వాత ఏం జరిగిందంటే?




**లక్నో-నవభూమి:** పార్క్ చేసిన కారు టాప్‌పై ఒక కోతి జంప్ చేసింది. అయితే ఆ కారు సన్‌రూఫ్ పగిలింది. కారులో పడిన కోతిని వెంటనే బయటకు దూకింది. ఆ తర్వాత అక్కడి నుంచి పారిపోయింది. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో ఈ సంఘటన జరిగింది. నవంబర్ 19న మధ్యాహ్నం వేళ విషేశ్వరగంజ్ ప్రాంతంలో ఒక కారు పార్క్ చేసి ఉంది. అయితే ఒక కోతి ఆ కారు టాప్‌పైకి జంప్ చేసింది. అయితే ఆ కారు సన్‌రూఫ్ పగిలిపోయింది. దీంతో కారు లోపల ఆ కోతి పడింది. అయితే వెంటనే బయటకు జంప్ చేసింది. అక్కడి నుంచి పారిపోయింది.

కాగా, ఆ ప్రాంతంలోని సీసీటీవీలో ఇది రికార్డ్ అయ్యింది. దీంతో ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఈ వీడియోపై నెటిజన్లు భిన్నంగా స్పందించారు. ఆ కోతికి ఏమైనా గాయమైందా? అని కొందరు ప్రశ్నించారు. అయితే కారుకు జరిగిన నష్టంపై మరికొందరు ఆరా తీశారు. ఆ కారు యజమాని ఈ నష్టాన్ని ఇన్సూరెన్స్ కంపెనీకి ఎలా వివరిస్తాడు? అని ఒకరు అనుమానం వ్యక్తం చేశారు. అందుకే కారు కొనకూడదని నిర్ణయించుకున్నట్లు మరొకరు చమత్కరించారు.

## మరో మార్గంలో కొత్తగా వందే భారత్ రైలు.. ప్రారంభించనున్న ప్రధాని మోదీ



**న్యూఢిల్లీ-నవభూమి:** భారతీయ రైల్వేశాఖ కొత్తగా మరో రూట్‌లో వందే భారత్ రైలును ప్రవేశపెట్టనున్నది. ఇప్పటికే సెమీ హైస్పీడ్ రైలు దేశవ్యాప్తంగా 50కిపైగా మార్గాల్లో దూసుకుపోతున్నది. ప్రస్తుతం ఈ కొత్త రైళ్లకు ప్రయాణికుల నుంచి ఆదరణ లభిస్తున్నది. ఈ క్రమంలోనే మరికొద్ది మార్గాల్లో రైల్వేశాఖ సెమీ హైస్పీడ్ రైళ్లకు శ్రీకారం చుట్టబోతున్నది. ఉధంపూర్-శ్రీనగర్-బారాముల్లా రైల్ లింక్ లో కశ్మీర్ నుంచి న్యూఢిల్లీకి అనుసంధానించే వందే భారత్ రైలును వచ్చే ఏడాది జనవరిలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభిస్తారని రైల్వేశాఖ సహాయ మంత్రి రవ్‌నీత్ సింగ్ తెలిపారు. ఈ రైలు ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన రైల్వే వంతెన చీనాబ్ రైలు వంతెనగుండా వెళ్తుందని పేర్కొన్నారు. 272 కిలోమీటర్ల యూఎస్‌బీఆర్ఎల్ ప్రాజెక్ట్‌లో రైల్వే 255 కిలోమీటర్ల పూర్తయ్యింది. కత్రా, రిసియా మధ్య 17 కిలోమీటర్లు డిసెంబర్ నాటికి పూర్తి కావాల్సి ఉంది. ఈ ఏడాది చివరి వరకు ప్రాజెక్టు పూర్తవుతుందని అధికారులు పేర్కొన్నారు. ప్రతి అంశాన్ని పరిశీలించాల్సి ఉందని.. ఇప్పటికే సాంకేతిక బృందాలు తనిఖీ చేసి ప్రామాణికంగా ఉండేలా చూస్తున్నారన్నారు. ప్రధాని షెడ్యూల్ ప్రకారం.. జనవరిలో వందే భారత్ రైలు ప్రారంభోత్సవం ఉంటుందని రైల్వేమంత్రి రవ్‌నీత్ సింగ్ పేర్కొన్నారు. ప్రతి అంశాన్ని పరిశీలించిన తర్వాతే ప్రారంభోత్సవం తేదీని నిర్ణయించన్నట్లు మంత్రి పేర్కొన్నారు. చలికాలంలో హైవేపై ట్రక్కులు, వాహనాల ఒత్తిడి ఎక్కువగా ఉంటుంది. ఈ ప్రాజెక్టు లోయలో ప్రజలకు ఎంతో ఊరట కలుగుతుందన్నారు. పర్యాటకానికి ప్రోత్సాహకం అందిస్తుందన్నారు. ఇది కశ్మీర్ ప్రజలకు ఎన్‌డీఏ ప్రభుత్వం, ప్రధానమంత్రి ఇచ్చిన బహుమతి అని పేర్కొన్నారు. గతంలో ప్రాజెక్టు పనులు నిలిచిపోయాయని.. గత ఎనిమిదేళ్లలో పనులు వేగవంతం చేశామన్నారు. ప్రాజెక్ట్‌లో పాలుపంచుకున్న ఉద్యోగులు, అధికారుల త్యాగాలు, కృషిని మంత్రి గుర్తు చేశారు. డిసెంబరు 25 నుంచి ప్రారంభమయ్యే పార్లమెంట్ సమావేశాల్లోనూ ఈ ప్రాజెక్టుపై చర్చిస్తామన్నారు. ఇక వందేభారత్ టికెట్ ధర విషయానికి వస్తే.. ఢిల్లీ నుంచి కశ్మీర్‌కు కేవలం రూ.1,500 నుంచి రూ.2100గా నిర్ణయించినట్లు తెలుస్తున్నది. రైలు మార్గమధ్యలో జమ్మూ, శ్రీమాతా వైష్ణోదేవి కత్రాలో స్టాప్స్ ఉంటాయన్నారు. ప్రాజెక్టు అపారమైన పర్యాటక సామర్థ్యం కలిగి ఉందని.. ఈ ప్రాంతంలో పర్యాటకాన్ని పెంచుతుందన్నారు.

## బైక్‌ను ఢీ కొట్టి ఈడ్చుకెళ్లిన బీఎండబ్ల్యూ కారు.. జర్నలిస్ట్ మృతి




**చెన్నై-నవభూమి:** తమిళనాడులో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఓ బీఎండబ్ల్యూకారు బైక్‌ను ఢీ కొట్టి కొంత దూరం అలానే ఈడ్చుకెళ్లింది ప్రమాదంలో ఓ వీడియో జర్నలిస్ట్ ప్రాణాలు కోల్పోయాడు ఈ ఘటన మంగళవారం రాత్రి చెన్నై లో చోటు చేసుకుంది.

పాండి బజార్‌కు చెందిన ప్రదీప్ కుమార్.. ప్రముఖ తెలుగు న్యూస్ ఛానెల్‌లో కెమెరామెన్ గా పనిచేస్తున్నాడు. పార్ట్‌టైమ్‌గా రాత్రి సమయంలో ర్యాపిడో డ్రైవర్‌గానూ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం రాత్రి రైడ్‌లో ఉన్న సమయంలో అతడి బైక్‌ను మధురవాయల్ తాంబరం ఎలివేటెడ్ బైపాస్‌పై వేగంగా వెళ్తున్న బీఎండబ్ల్యూ కారు వెనుక నుంచి బలంగా ఢీ కొట్టింది. అనంతరం అలాగే వంద మీటర్ల వరకూ ఈడ్చుకెళ్లింది. ఈ ఘటనలో ప్రదీప్ కుమార్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకొని పరిశీలించారు. అక్కడ పూర్తిగా ధ్వంసమైన బైక్‌ను గుర్తించారు. ప్రమాదం జరిగిన వంద మీటర్ల దూరంలో కుమార్ డెడ్‌బాడీని గుర్తించి పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కారు డ్రైవర్ కోసం గాలింపు చేపట్టారు.

## ఎన్నికల మార్గదర్శకాలు ఉల్లంఘించిన పోలీసులు.. ఈసీ సస్పెండ్



**లక్నో-నవభూమి:** ఎన్నికల మార్గదర్శకాలు ఉల్లంఘించినట్లు పోలీసులపై ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో పలువురు పోలీస్ అధికారులు, సిబ్బందిని సస్పెండ్ చేయాలని ఎలక్షన్ కమిషన్ (ఈసీ) ఆదేశించింది. (%జుజ ౦బం-జూవఅఎం ఖా జూశీశ్రీఱఎవ జూవతీంశీఅఅవశ్రీ%) ఎన్నికలు పారదర్శకంగా జరిగేలా చూడాలని జిల్లా ఎన్నికల అధికారులు, ఎస్పీలకు సూచించింది. ఉత్తరప్రదేశ్ కాన్పూర్‌లోని సిసమావు అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నిక నేపథ్యంలో బుధవారం పోలింగ్ జరిగింది.కాగా, ఎన్నికల విధుల్లో ఉన్న పోలీస్ అధికారులు ఓటర్లను వేధిస్తున్నారని సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ ఆరోపించారు. చట్టవిరుద్ధంగా ఓటరు కార్డులు, ఆధార్ ఐడీలను తనిఖీ చేస్తున్న పోలీస్ అధికారులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈసీకి ఫిర్యాదు చేయడంతోపాటు వీడియో క్లిప్‌ను సోషల్ మీడియాలో షేర్ చేశారు.మరోవైపు ఈ ఆరోపణలపై ఈసీ స్పందించింది. ఎన్నికల మార్గదర్శకాలు ఉల్లంఘించిన పోలీసులపై చర్యలు చేపట్టింది. ఎన్నికల విధుల్లో మోహరించిన పోలీసుల్లో ఆరోపణలు వచ్చిన వారిని సస్పెండ్ చేయాలని ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ ఆదేశించారు. దీంతో ఏడుగురు పోలీస్ అధికారులపై చర్యలు చేపట్టారు. కాన్పూర్, ముజఫర్‌నగర్ జిల్లాల్లో ఇద్దరు చొప్పున, మొరాదాబాద్‌లో ముగ్గురు పోలీస్ అధికారులను సస్పెండ్ చేశారు.

## మధ్యాహ్నం 3 వరకూ మహారాష్ట్రలో 45 శాతం పోలింగ్



**ముంబై-నవభూమి:** మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ కొనసాగుతోంది. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 6 గంటల వరకూ కొనసాగనుంది. ఈ నేపథ్యంలో మధ్యాహ్నం 3 గంటల వరకూ 45.53 శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. అదే సమయంలో జార్కండ్‌లోనూ 61.47 శాతం ఓటింగ్ జరిగినట్లు వెల్లడించారు.మహా ఎన్నికల్లో బాలీవుడ్ తారలు పోలింగ్ కేంద్రాలకు తరలి వచ్చి ఓటు హక్కు వినియోగించుకుంటున్నారు. మాధురీ దీక్షిత్, రకుల్ ప్రీత్ సింగ్, జాకీ భగ్నానీ, అర్జున్ కపూర్, ప్రేమ్ చోప్రా, సింగర్ కైలాశ్ ఖేర్, సునీల్ శెట్టి, రితేశ్ దేశ్‌ముఖ్, జెనీలియా, సైఫ్ అలీఖాన్, కరీనా కపూర్ ఖాన్, పూనమ్ దిల్లాన్, జునైద్ ఖాన్, జావెద్ అక్తర్, మనీశ్ మల్హోత్ర, సింగర్ శంకర్ మహదేవన్, డైరెక్టర్ రోహిత్ శెట్టి తదితరులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ సైతం తన కుమారులు, కోడలితో కలిసి ముంబైలోని ఓ పోలింగ్ కేంద్రంలో ఓటు వేశారు.మహారాష్ట్రలో మొత్తం 288 శాసనసభ నియోజకవర్గాలకు పోలింగ్ జరుగుతోంది. 9.63 కోట్ల మంది ఓటర్లు 4 వేల 136 మంది అభ్యర్థుల భవితవ్యాన్ని ఈవీఎంలలో నిక్షిప్తం చేయనున్నారు. సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ కొనసాగనుండగా 31 సమస్యాత్మాక ప్రాంతాల్లో సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనున్నది. ఈ నెల 23 మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి.

## కాంగ్రెస్ నేత పీ చిదంబరానికి ఊరట.. ట్రయల్ కోర్టు విచారణపై ఢిల్లీ హైకోర్టు స్టే



**న్యూఢిల్లీ-నవభూమి:** ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ దాఖలు చేసిన ఎయిర్ సెల్ మ్యాక్సిస్ కేసులో కాంగ్రెస్ సీనియర్ నేత పీ చిదంబరానికి ఢిల్లీలో హైకోర్టు ఊరటనిచ్చింది. ట్రయల్ కోర్టు విచారణపై ఢిల్లీ హైకోర్టు బుధవారం స్టే విధించింది. కాంగ్రెస్ నేత పిటిషన్‌పై ఈడీకి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. మనీలాండరింగ్ కేసులో చిదంబరం, ఆయన తనయుడు కార్తీ చిదంబరంపై ట్రయల్ కోర్టులో ఈడీ దాఖలు చేసిన ఛార్జిషీట్‌ను పరిగణలోకి తీసుకొని నోటీసులు జారీ చేసింది. కేసు విచారణను జనవరి 22కి వాయిదా వేస్తున్నట్లు జస్టిస్ మనోజ్ కుమార్ ఓహ్రి పేర్కొన్నారు. ఈ కేసులో వివరణాత్మక ఉత్తర్వులు జారీ చేయనున్నట్లు తెలిపారు.చిదంబరం తరపున సీనియర్ న్యాయవాది ఎన్ హరిహరన్, అర్షదీప్ సింగ్ ఖురానా, అక్షత్ గుప్తా వాదనలు వినిపించారు. మాజీ కేంద్రమంత్రిపై ప్రాసిక్యూషన్‌కు ఎలాంటి అనుమతి లేకపోవడంతో ప్రత్యేక న్యాయమూర్తి మనీలాండరింగ్‌కు సంబంధించిన ఛార్జిషీట్‌ను పరిగణలోకి తీసుకున్నారని.. ఆయనపై వచ్చిన ఆరోపణలు అధికారిక విధులతో సంబంధం లేదని.. ఈ కేసులో ప్రాసిక్యూషన్‌కు అనుమతి అవసరం లేదని ఈడీ న్యాయవాది అభ్యంతరాలు లేవనెత్తారు. ఈ క్రమంలో మధ్యంతర ఉపశమనం కల్పించాలని.. ట్రయల్ కోర్టులో కొనసాగుతున్న విచారణపై స్టే విధించాలని చిదంబరం కోరారు. ఎయిర్‌సెల్-మ్యాక్సిస్ కేసులో చిదంబరం, కార్తీలపై సీబీఐ, ఈడీ దాఖలు చేసిన చార్జిషీట్‌లపై ట్రయల్ కోర్టు నవంబర్ 27, 2021న విచారణ చేపట్టి, సమన్లు జారీ చేసింది.సీఆర్‌పీసీ సెక్షన్ 197 (1) ప్రకారం ప్రాసిక్యూషన్ కోసం అనుమతి పొందడం తప్పనిసరని.. ఈడీ ఇప్పటి వరకు ప్రాసిక్యూషన్‌కు అనుమతి తీసుకోలేదని చిదంబరం తరఫు న్యాయవాది వాదనలు వినిపించారు. ప్రస్తుతం, అభియోగాల పరిశీలన కోసం ట్రయల్ కోర్టు ఎదుట ప్రొసీడింగ్స్ ఫిక్స్ అయ్యాయని లాయర్ తెలిపారు. 2006లో చిదంబరం కేంద్ర ఆర్థిక మంత్రిగా ఉన్న సమయంలో ఎయిర్‌సెల్-మ్యాక్సిస్ ఒప్పందానికి అనుమతి లభించింది. ఆర్థిక మంత్రిగా చిదంబరం ఈ ఒప్పందాన్ని ఆమోదించేందుకు తనశక్తికి మించి ప్రయత్నించారని.. దాంతో కొందరికి లబ్ధి చేకూరిందనే ఆరోపణలున్నాయి. ఈ వ్యవహారంపై సీబీఐ కేసు నమోదు చేయగా.. మనీలాండరింగ్ నేపథ్యంలో ఈడీ సైతం

## పెళ్లికి ఒప్పుకోలేదని.. స్కూల్ టీచర్‌ను చంపిన వ్యక్తి



**చెన్నై-నవభూమి:** తమిళనాడులో దారుణం జరిగింది. తంజావూర్ జిల్లాలో 26 ఏళ్ల స్కూల్ టీచర్ రమణి హత్యకుగురైంది. 30 ఏళ్ల మదన్ అనే వ్యక్తి ఆమెను హతమార్చాడు. వివరాల్లోకి వెళ్తే.. మల్లీపట్టణం గవర్నమెంట్ స్కూల్‌లో రమణి టీచర్‌గా పనిచేస్తున్నది. అయితే ఇటీవల రమణి, మదన్ కుటుంబ సభ్యులు పెళ్లి కోసం చర్చలు జరిపారు. కానీ పెళ్లి ప్రపోజల్‌ను రమణి నిరాకరించినట్లు తెలుస్తోంది. దీంతో ఆవేశానికి గురైన మదన్.. ఆమెపై అటాక్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

వ్యక్తిగతమైన కక్షతో మదన్ దాడి చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు, అతన్ని విచారిస్తున్నారు. మెడలో తీవ్రగాయాలైన రమణిని.. ఆస్పత్రికి తరలించారు. కానీ ఆమె మార్గమధ్యంలోనే ప్రాణాలు విడిచింది. పెళ్లికి రమణి నిరాకరించడంతో.. ఆమె స్కూల్‌కు వెళ్లిన మదన్.. తన చేతుల్లో ఉన్న పదునైన ఆయుధంతో మెడపై అటాక్ చేశాడు.

## గోనె సంచిలో దళిత బాలిక మృతదేహం.. బీజేపీకి మద్దతిచ్చినందుకే హత్య చేశారని ఫ్యామిలీ ఆరోపణ



**లక్నో-నవభూమి:** గోనె సంచిలో దళిత బాలిక మృతదేహాన్ని గుర్తించారు. ఉప ఎన్నికల్లో బీజేపీకి మద్దతిచ్చినందుకు ఆ యువతిపై అత్యాచారానికి పాల్పడి చంపినట్లు ఆమె కుటుంబం ఆరోపించింది. ఒక వ్యక్తిపై ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని మెయిన్‌పురి జిల్లాలో ఈ సంఘటన జరిగింది. నవంబర్ 19న కర్హాల్‌లో ఇద్దరు వ్యక్తులు దళిత యువతిని కిడ్నాప్ చేశారు. బెక్‌పై ఎక్కించుకుని తీసుకెళ్లినట్లు కొందరు చూశారు. అయితే బుధవారం కంజారా నది వంతెన వద్ద ఆ దళిత యువతి నగ్న మృతదేహం గోనె సంచిలో కనిపించింది.

కాగా, ఈ విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. దళిత యువతి మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే ఆమె హత్య వెనుక రాజకీయ నేపథ్యం ఉందని ఆమె కుటుంబం తెలిపింది. ఉప ఎన్నికలో బీజేపీకి మద్దతిచ్చినందుకు సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ)కి చెందిన ప్రశాంత్ యాదవ్ ఆమెను బెదిరించినట్లు ఆరోపించింది. అతడు ఆ యువతిపై అత్యాచారానికి పాల్పడి హత్య చేశాడని ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మావోయిస్టు అగ్రనేత కీలక నిర్ణయం..

# రంగంలోకి పోలీసులు



**భువనేశ్వర్-నవభూమి:** ఒడిశాలోని బెర్హాంపూర్ జైలులో జీవిత ఖైదు అనుభవిస్తున్న మావోయిస్ట్ అగ్రనేత సవ్యసాచి పాండ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఒడిశా స్టేట్ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా ఎమ్ఏ పబ్లిక్ ఎడ్మినిస్ట్రేషన్ చేయాలనుకుంటున్నట్లు ఆయన జైలు అధికారులకు తెలిపారు. ఈ నేపథ్యంలో బెర్హాంపూర్ సర్కిల్ జైలు ఎస్పీ డీఎన్ బరిఖ్ బుధవారం స్పందించారు. జైల్లో మొత్తం ఆరుగురు ఖైదీలు ఉన్నత విద్యను అభ్యసించాలని నిర్ణయించారని చెప్పారు. ఈ నేపథ్యంలో ఈ ఖైదీలను సంబంధించిన పత్రాలను ఇప్పటికే యూనివర్సిటీకి పంపినట్లు ఆయన వివరించారు. వీరి పేర్లు యూనివర్సిటీలో ఎన్ రోల్ కాగానే.. ఈ కోర్సుకు సంబంధించిన స్టడీ మెటిరియల్ అందజేస్తామని చెప్పారు. జైల్లోనే వారు స్వయంగా చదువుకుని.. ఈ పరీక్షలకు హాజరవుతారని తెలిపారు.

రెండేళ్ల క్రితమే సవ్యసాచి పాండ ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా బీఏ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించారని జైలు ఎస్పీ గుర్తు చేశారు. అలా బీఏ పట్టా అందుకున్న.. ఆయన ఎమ్ఏ పట్టా అందుకునేందుకు కష్టపడుతున్నారని చెప్పారు. సవ్యసాచి పాండ వయస్సు ప్రస్తుతం 55 ఏళ్లు అని జైలు ఎస్పీ స్పష్టం చేశారు. ఎమ్ఏ చదువుతున్న వారిలో ఇద్దరు ఖైదీలు ప్రస్తుతం విచారణను ఎదుర్కొంటున్నారన్నారు.

ఒడిశాలోని వివిధ జిల్లాల్లో జరిగిన విధ్వంసాల్లో మావోయిస్టు అగ్రనేత సవ్యసాచి పాండ ప్రమేయం ఉందనే అరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో 2014, జులై 14న పాండను పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం అతడికి స్థానిక కోర్టు జీవిత ఖైదు విధించింది. నాటి నుంచి ఆయన బెర్హాంపూర్ జైల్లోనే శిక్షను అనుభవిస్తున్నారు.మరోవైపు దేశంలో మావోయిస్టులను నిర్మూలించేందుకు కేంద్రం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తుంది. అందులోభాగంగా 2026, మార్చి మాసాంతానికి దేశంలో మావోయిస్టులు లేని దేశంగా మార్చాలని మోదీ, అమిత్ షా ద్వయం లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. ఆ క్రమంలో ఇప్పటికే దేశంలోని వివిధ రాష్ట్రాల్లో.. మావోయిస్టులను నిర్మూలించారు. జార?ండ్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, బీహార్, మధ్యప్రదేశ్, కేరళ, తమిళనాడు తదితర రాష్ట్రాల్లో వీరి జాడ ఎక్కడ లేకుండా పోయింది.కానీ ఛత్తీస్ గఢ్ లో మావోయిస్టుల ప్రభావం కొద్దిగా ఉంది. ఈ నేపథ్యంలో అబూజ్ మాడ్ లో మావోయిస్టుల ఏరివేతకు కేంద్రం కంకణం కట్టుకుంది. దీంతో ఇటీవల కాలంలో ఆ రాష్ట్రంలో వరుస ఎన్ కౌంటర్లు చోటు చేసుకుంటున్నాయి. దాంతో మావోయిస్టులకు వరుస దెబ్బ మీద దెబ్బ పడుతుంది. ఇంకోవైపు మావోయిస్టులు లొంగిపోవాలని కేంద్ర ఇప్పటికే పిలుపు ఇచ్చిన సంగతి తెలిసిందే. జన జీవన స్రవంతిలో కలిసి.. దేశ నిర్మాణంలో భాగస్వామ్యం కావాలని మావోయిస్టులను రాష్ట్ర ప్రభుత్వాలు సైతం సూచించిన విషయం విధితమే.

## ముంబైలో ఓటేసిన నటి రకుల్‌ప్రీత్ సింగ్ దంపతులు..



**ముంబై-నవభూమి:** మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో నటి రకుల్‌ప్రీత్ సింగ్ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. మహారాష్ట్ర రాజధాని ముంబైలోని ఓ పోలింగ్ కేంద్రంలో ఆమె తన భర్త జాకీ భగ్నానీతో కలిసి ఓటు వేశారు. ఓటు వేసిన అనంతరం రకుల్ దంపతులు మీడియాతో మాట్లాడారు. తాము ఓటు వేశామని, ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.దయచేసి ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని, ఓటు వేయడమని చాలా ముఖ్యమని రకుల్ దంపతులు అన్నారు. ఓటు వేయకుండా ఇంట్లో కూర్చుని ప్రభుత్వాలపై మాటిమాటికి ఫిర్యాదులు చేయడం కరెక్టు కాదని చెప్పారు. ఓటు వేసిన వారికే ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు ఉంటుందని పేర్కొన్నారు. ఓటు హక్కును వినియోగించుకోవడం ప్రతి పౌరుని బాధ్యత అన్నారు.పోలింగ్ కేంద్రాల దగ్గర ఏర్పాట్లు చాలా బాగున్నాయని, ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఓటు వేసి వచ్చేలా అవకాశాలు కల్పించారని రకుల్ దంపతులు చెప్పారు. కాగా మహారాష్ట్రలో మొత్తం 288 స్థానాలకు ఇవాళ ఒకే విడతలో పోలింగ్ జరుగుతున్నది.



## తప్పనిసరిగా ఓటు వేసేలా చట్టం చేయాలి : కేంద్ర మంత్రి అథవాలే

**ముంబై-నవభూమి:** దేశంలోని ప్రతి పౌరుడు తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించుకునేలా చట్టం తీసుకురావాలని కేంద్ర మంత్రి రాందాస్ అథవాలే అన్నారు. మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ మందకొడిగా కొనసాగుతుండటంపై ఆయన స్పందించారు. ఉదయం 11 గంటల వరకు కేవలం 18 శాతం పోలింగ్ మాత్రమే నమోదు కావడంపై అసంతృప్తి వ్యక్తంచేశారు.ఎన్నికల ప్రశాంతమైన వాతావరణంలో ఎలాంటి అవాంతరాలు లేకుండా కొనసాగుతున్నాయని, కానీ ఓటింగ్ శాతం మందకొడిగా సాగుతుండటం ఏం బాగలేదని రాందాస్ అథవాలే వ్యాఖ్యానించారు. ఓటింగ్ శాతం మరింత పెరగాలని, ఓటు హక్కు ఉన్న ప్రతి వ్యక్తి తప్పనిసరిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన సూచించారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఓ చట్టం రూపొందించాలని అభిప్రాయపడ్డారు.'ఇక ఈ అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపు ఎవరిది..?' అని మీడియా ప్రతినిధి అడిగిన ప్రశ్నకు ఆయన స్పందిస్తూ.. విజయం తమదేనని ధీమా వ్యక్తంచేశారు. రాష్ట్రంలోని మొత్తం 288 సీట్లకుగాను 165 నుంచి 170 స్థానాలు అధికార మహాయుతి కూటమి గెలుస్తుందని చెప్పారు. స్పష్టమైన మెజారిటీతో తాము ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని అన్నారు.



## మరాఠీల మనసులో ఏమున్నది?

మహారాష్ట్రలో గత వారం కింద కొన్నిరోజుల పాటు పర్యటించినపుడు ఒక విషయం గుర్తించి ఆశ్చర్యం కలిగింది. బీఆర్ఎస్ పార్టీ తెలం గాణలో ఓడినప్పటికీ అక్కడి ప్రజలు ఇప్పటికీ ఆ పార్టీని కోరుకుం టున్నారు. బీఆర్ఎస్ వేరే రాష్ట్రపు పార్టీ. అధికారంలో ఉండినపుడు మహారాష్ట్రలో ప్రచారం సాగించింది కొద్ది నెలలు మాత్రమే. అధికారం కోల్పోయి ఏడాది అవుతున్నది. తర్వాత కాలంలో అటు వైపు వెళ్లలేదు. ఈ మాటలన్నీ గమనించినప్పుడు మామూలుగానైతే అక్కడి ప్రజలు బీఆర్ఎస్‌ను మరిచిపోయి ఉండాలి. కానీ, పరిస్థితి ఆ విధంగా ఎంతమాత్రం లేదు. ఆశ్చర్యం కలగటం అందువల్లనే. వెళ్లింది మరాఠ్వాడా, విదర్భ ప్రాంతాలకు. అక్కడ నాందేడ్ వంటి ఒక ముఖ్య నగరంతో పాటు కొన్ని పట్టణాలకు, గ్రామాలకు పోయి కలిసి మాట్లాడిన వారిలో పలు వర్గాల వారున్నారు. అందువల్ల, బీఆర్ఎస్ పట్ల అభిమానం, దానితో పాటు నమ్మకం అన్నవి మహారాష్ట్ర సమాజంలో విస్తృతంగా నేటికీ నిలిచి ఉన్నాయనే అభిప్రాయానికి రాక తప్పలేదు. అందుకు కారణాలు ఏమిటన్నది వారి మాటలలోనే వినేందుకు ప్రయత్నించాను. అవి విన్న మీదట, వారందరు చెప్పిన వాటి సారాంశం ఒకేవిధంగా ఉండటం గమనించాను. అప్పుడు అర్థమైంది బీఆర్ఎస్ మహారాష్ట్రలో నేటికీ ఒక భావనగా ఎందుకు సజీవంగా ఉన్నదో.పైన పేర్కొన్న వేర్వేరు వర్గాల వారి మాటల సారాంశమేమిటో ముందుగా చూద్దాం. వారు తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వం చేసిందేమిటో పదేండ్ల పాటు గమనించారు. దానిని తమ పరిస్థితులతో పోల్చి చూసుకున్నారు. కేసీఆర్ తెలంగాణలో మాట్లాడుతున్నదేమిటో వార్తలు, సమాచారం అందుతూనే ఉన్నాయి. తర్వాత తమ వద్ద సభలలో చెప్పింది ప్రత్యక్షంగా విన్నారు.మరొకవైపు తమ రాష్ట్రాలకు చెందిన వేర్వేరు పార్టీ ల నాయకులు చెప్పింది వింటూ ఈ రెండింటినీ పోల్చుకున్నారు. కేసీఆర్‌లో వారికి దేశ పరిస్థితులు, దేశాభివృద్ధి, దీర్ఘకాలిక దృష్టి విషయాలలో ఒక దార్శనికుడు కనిపించగా, ఇతర పార్టీల వారిలో కేవలం అధికారం కోసం ప్రజలకు మాయమాటలు చెప్తూ మోసగించే వారే ఉన్నారు. వీటన్నింటికి తోడు కేసీఆర్ తన ఆలోచనలేమిటో చెప్తూ పోయారు తప్ప ఇతరులను విమర్శిస్తూ గడపలేదు. అంతిమంగా, 'అబ్ కీ బార్ కిసాన్ సర్కార్' అనే అద్భుతమైన నినాదాన్నిచ్చి అందరి మనస్సులను తాకారు.ప్రజల మాటల్లో రాజకీయపరమైనవి కూడా కొన్నున్నాయి. తెలంగాణలో బీఆర్ఎస్ ఓటమిని వారు నిజమైన ఓటమిగా చూడటం లేదు. రాజకీయాలలో జయాపజయాలు జరుగుతూనే ఉంటాయన్నది ఒక అభిప్రాయం. కాంగ్రెస్ ఇచ్చిన మితిమీరిన హామీలు పనిచేశాయన్నది మరొక అభిప్రాయం. దానినట్లుంచితే, బీఆర్ఎస్ తెలంగాణలో ఓడినా మహారాష్ట్రలో తన పని కొనసాగించి ఉండవలసిందన్న మాట అంతటా వినిపించింది. అట్లా చేసి ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికలలో పోటీ చేసి ఉంటే చెప్పుకోదగినన్ని స్థానాలు గెలిచి ఉండేదన్నారు వారు. కేసీఆర్ తెలంగాణలో మళ్లీ గెలిచి మరొక నాలుగేండ్ల తర్వాతనైనా సరే తిరిగి వచ్చినట్లయితే అంతే ప్రజాదరణ లభించగలదని చెప్పారు.ఇవీ సారాంశాలు. వీటిని చుట్టుకొని ఉన్న వివరాలను, అందుకు సంబంధించి ప్రజల మాటలను, వాటిని ప్రతిఫలించే మహారాష్ట్ర స్థితిగతులను చెప్పుకోవాలంటే చాలా ఉన్నాయి. వీటన్నింటిని కలిపి చూసినప్పుడు గాని, బీఆర్ఎస్ అక్కడ ఎందుకింకా సజీవంగా ఉన్నదో, కేసీఆర్ పేరు మరవలేనిదిగా మారిందో, భవిష్యత్తులో ఆయన తిరిగి తమ మధ్య కు రావాలనే కోరిక బలంగా ఉందో మనకు అర్థం కాదు. తాత్త్వికంగా చెప్పుకోవాలంటే, ఈ తత్త్వానికి మూలాలు, ఆధారాలు అక్కడి పరిస్థితులలో ఉన్నాయి. అక్కడి చారిత్రకమైన వెనుకబాటుతనంలో, రైతులూ పేదల ఘర్షణలలో, గురువులూ సంఘ సం స్కర్తలకు లభించిన ఎనలేని ఆదరణలో ఉన్నాయి. వర్తమానానికి వస్తే అన్ని పార్టీల వైఫల్యంలో, సామాన్యులలో తరతరాలుగా గూడు కట్టుకొని ఉన్న బాధ లో, నిరసనలో ఉన్నాయి. ఎక్కడైనా, ఎపుడైనా ఆర్థి క, సామాజిక స్థితిగతులు ఆ విధంగా ఉండి ఒక తాత్త్వికత ఏర్పడినప్పుడు ప్రజలు సహజంగానే దానినుంచి వెలికి వచ్చేందుకు ప్రయత్నిస్తారు. అం దుకు మార్గం ఒక దశలో కొందరికి ఒక సంఘ సం స్కర్త రూపంలో కనిపించవచ్చు. మరొక దశలో ఒక తిరుగుబాటు రూపంలో కావచ్చు. రాజకీయంగా చూస్తే ప్రస్తుతం కేసీఆరా, రేపు మరొకరా అన్నది కాదు ప్రశ్న. ఎవరైనా కావచ్చు.ఆదిలాబాద్ జిల్లాను దాటి మరాఠ్వాడా ప్రాంతంలోకి అడుగుపెట్టడమే తడవు రెండు రాష్ట్రాలకు మధ్య గల తేడా ఏమిటో కొట్టవచ్చినట్టు కనిపిస్తుంది. ఆ రోడ్లు, గ్రామాలు, పట్టణాలు, ప్రజలు, దుకాణ సముదాయాలు, రవాణా బస్సులూ, సమస్తం ఆ తేడాను ప్రతిఫలిస్తాయి. వీటన్నింటి మధ్య గమనించదగినదేమంటే భూములన్నీ సారవంతమైన నల్లరేగడివి. అయినప్పటికీ సరిహద్దుకు ఇటు అభివృద్ధి, అటు వెనుకబాటుతనం అనే ఒకే ఒక్క తేడాలోనే పైన చెప్పుకున్న తాత్త్వికతకు గాని, కేసీఆర్ పట్ల పొంగుకొచ్చిన ఆశలకు గాని బీజాలున్నాయి. వాటిని ఆయన ఏ కారణం చేతనైనా సరే అదేవిధంగా వదిలివేసినట్లయితే, అది అక్కడి ప్రజలకు ఒక చారిత్రక విషాదం వంటిదవుతుంది. ఈ మాట అతిశయోక్తిగా తోచవచ్చు. అవునో, కాదో అర్థం కావాలనే స్వయంగా అక్కడికి వెళ్లి ప్రజలను కలిసి మాట్లాడవలసి ఉంటుంది. పైన చెప్పినట్టు వీరు వారని గాక అన్ని వర్గాలలో, నగరాల నుంచి గ్రామాల వరకు, ఏడాది వ్యవధి తర్వాత కూడా మరొక రాష్ట్రంలో ఇటువంటి అభిప్రాయాలున్నప్పుడు, ఇది గాక మరొక మాట చెప్పగలమా?,,టీఆర్ఎస్ అనే ప్రాంతీయ పార్టీని బీఆర్ఎస్ అనే జాతీయ పార్టీగా ఒక మౌలికమైన, దీర్ఘకాలికమైన దార్శనికతతో మార్చిన కేసీఆర్, ఈ విధమైన కదలికలను అంతటితో అణగారిపోకుండా చూడవలసి ఉంటుంది. అట్లా జరగకపోతే అది ఒక విషాదమవుతుంది. ఈ సందర్భంలో చర్చించుకోవలసిన ముఖ్య విషయం ఒకటున్నది. ప్రాంతీయ పార్టీని జాతీయ పార్టీగా మార్చినప్పుడు పలువురు పలు విధాలైన సందేహాలను, ప్రశ్నలను లేవనెత్తారు. గత అసెంబ్లీ ఎన్నికలలో ఓడినప్పుడు పలువురు పలు విధాలైన సందేహాలను, ప్రశ్నలను లేవనెత్తారు.గత అసెంబ్లీ ఎన్నికలలో ఓడినప్పుడు ఆ ప్రశ్నలు తీవ్రంగా మారాయి. అవి పార్టీ లోపలి నుంచి, బయటినుంచి కూడా వినిపించాయి. తిరిగి టీఆర్ఎస్‌గా మార్చాలనే ఒత్తిళ్లు పెరిగాయి. కానీ, అందుకు కేసీఆర్ నిరాకరించటం గమనించదగ్గది. ఎందుకు కాదంటున్నారో ఆయన వివరించిందీ లేనిది తెలియదు గాని, మనకుగా ఆలోచిస్తే తోచేవి కొన్నున్నాయి.టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్‌గా మార్చటానికి ఏ కారణాలున్నాయో వాటికి ఇప్పటికీ అదే విలువ ఉందన్నది తమ అభిప్రాయం కావచ్చు. తెలంగాణలో ఒకసారి ఓడినంత మాత్రాన ఆ విలువ మాయమైపోదు. నిజానికి మన రాజ్యాంగం ప్రకారం చూసినా ప్రాంతీయతలకు, జాతీయతకు మధ్య వైరుధ్యమేమీ లేదు. బలమైన రాష్ట్రాలు, బలమైన కేంద్రం అనే మాట, సహకార ఫెడరలిజం అనే మరొక మాట ఉన్నాయి. కనుక వైరుధ్యమేమీ లేదని ఆ విధంగా కూడా స్పష్టమవుతున్నది. మరొక విధంగా చెప్పాలంటే, ఇంగ్లీషులో వన్ ఫర్ ఆల్, ఆల్ ఫర్ వన్ అన్నట్టు ఇది అందరి కోసం (రాష్ట్రాలు) ఒకరు (కేంద్రం), ఒకరి కోసం అందరూ వంటి స్థితి. ఈ అవగాహన గాని, రాజ్యాంగపరమైన ఏర్పాటుగాని సజావుగా సాగి ఉంటే పరిపాలనలు, పరిస్థితులు అందుకు తగినట్టే ఉండేవి.

# హరిత పరివర్తనకు భద్ర మార్గమేమిటి?



ప్రపంచ ఆటోమొబైల్ పరిశ్రమ మున్నెన్నడు లేని రీతిలో భవిష్యత్తు గురించి మథన పడుతోంది. విద్యుత్ వాహనాల ప్రవేశంతో ఇంటర్నల్ కంబశ్చన్ ఇంజిన్ (ఐసి) కార్లను త్యజించాల్సిన అనివార్యత ఏర్పడింది. అయితే అందువల్ల ఆటోమొబైల్ పరిశ్రమ దిగ్గజ సంస్థలు వ్యాపార సౌష్ఠవాన్ని కోల్పోయి అస్థిరత్వం పాలవుతాయి. హరిత పరివర్తన(జీవ వైవిధ్యం, పర్యావరణ వ్యవస్థల పరిరక్షణ, పునరుద్ధరణ) లక్ష్యానికి నిబద్ధమైన సంపన్న దేశాలపై దీని ప్రభావమెలా ఉంటుంది? వర్ధమాన దేశాలలోని కొత్త శక్తుల నుంచి సంపన్న దేశాల ప్రధాన పరిశ్రమ-ఆటోమొబైల్-కు పోటీ ఎదురవుతుంది. ఈ పోటీలో ఆ పరిశ్రమ వైభవం క్షీణించిపోయే అవకాశం బాగా ఉన్నది.

చైనా. అవును, చైనా గురించి మాట్లాడవలసిన సందర్భమిది. ప్రపంచ విద్యుత్ వాహనాల పరిశ్రమలో ప్రాబల్యం ఇప్పుడు ఈ ఆసియా దేశానిదే. ముడి పదార్థాలు, బ్యాటరీ టెక్నాలజీ, అత్యాధునిక కార్లను చౌకగా ఉత్పత్తి చేయడంలో సామర్థ్యం మొదలైన అంశాలు అన్నిటిలో చైనానే అగ్రగామిగా ఉన్నది. చైనా దూర దృష్టితో, ఉద్దేశపూర్వకంగా విద్యుత్ వాహనాల అభివృద్ధికి విశేష స్థాయిలో మదుపులు చేసింది. సంప్రదాయ ఐసి ఇంజిన్ల వాహనాల తయారీలో తాను పాశ్చాత్య దేశాలతో పోటీ పడలేనన్న వాస్తవం చైనాకు తెలుసు. కాగా ఇప్పుడు వాతావరణ మార్పును నిరోధించడానికి ప్రపంచ దేశాలు దృఢంగా సంకల్పించుకున్నాయి. విద్యుత్ వాహనాలకు ప్రాధాన్యమివ్వడం వాటి ఆ ఎజెండాలో భాగమే. కార్ల నుంచి కార్బన్ డై ఆక్సైడ్ ఉద్గారాలకు వ్యతిరేకంగా యూరోపియన్ యూనియన్ కఠిన ఆంక్షలు విధించింది. 2035 నుంచి శూన్య ఉద్గారాల కార్లు మాత్రమే విక్రయించాలని ఆదేశించింది. పెట్రోల్, డీజిల్ వాహనాల ఉత్పత్తి, విక్రయాలు యూరోపియన్ దేశాలలో ఇక ఉండ బోవు. 2030 సంవత్సరం నాటికి కొత్త వాహనాల విక్రయాలలో 50 శాతం తప్పనిసరిగా విద్యుత్ వాహనాలు అయి ఉండాలని అమెరికాలో అధ్యక్షుడు జో బైడెన్ ప్రభుత్వం ఒక కొత్త హరిత పరివర్తన లక్ష్యాన్ని నిర్దేశించింది.

వాతావరణ మార్పుపై పోరుకు కీలకమైన గ్రీనర్ ట్రాన్స్ పోర్టేషన్ (పర్యావరణంపై ప్రతికూల ప్రభావం చూపని ప్రయాణ సాధనాలు)కు సంపన్న దేశాలు ఇస్తున్న ప్రాధాన్యం చైనా ఆటోమొబైల్ పరిశ్రమకు మహా సానుకూలతను సృష్టించింది. చైనా ప్రాబల్యాన్ని ఎదుర్కోలేక పాశ్చాత్య దేశాల విద్యుత్ వాహనాల పరిశ్రమ వెనుకబడితే జరిగేదేమిటి? ఇదే ఇప్పుడు అసలు ప్రశ్న.

వాహనాల తయారీ పరిశ్రమ చాలా దేశాలలో వస్తూత్పత్తి, ఉద్యోగాలకు ప్రధాన ప్రాతిపదికగా ఉన్నది. యూరోపియన్ కమిషన్ సమాచారం ప్రకారం ఆటోమోటివ్ పరిశ్రమలు 13.8 మిలియన్ యూరోపియన్లకు ఉద్యోగాలను సమకూరుస్తోంది. 12.6 మిలియన్ మందికి ప్రత్యక్షంగా ఉద్యోగాలు కల్పిస్తుంది. వీరు వస్తూత్పత్తి రంగంలోని ఉద్యోగులలో 8.5 శాతంతో సమానం.

ఈ కారణంగా చైనాలో ఉత్పత్తి అయి దిగుమతి అవుతున్న కార్లు, వాటి విడి భాగాలపై అధిక సుంకాలు విధించాల్సిన అగత్యం అమెరికాకు (యూరోప్‌కు కూడా) ఏర్పడింది. చైనీస్ విద్యుత్ వాహనాల దిగుమతిపై అమెరికా 100 శాతం సుంకం వసూలుచేస్తోంది. కెనడా సైతం అమెరికాను అనుసరిస్తోంది. చైనీస్ విద్యుత్ వాహనాలపై దిగుమతి సుంకాన్ని పది శాతం పెంచేయోచనలో యూరోపియన్ యూనియన్ ఉన్నది. అమెరికా అధిక దిగుమతి సుంకం విధించడంతో పాటు విద్యుత్ వాహనాలకు భారీ రాయితీలు కల్పిస్తోంది. అయితే ఒక విదేశీ కంపెనీ సరఫరా చేసే ఖనిజాలు లేదా బ్యాటరీలను ఉపయోగిస్తున్న వాహనాలకు ఈ ప్రోత్సాహకాలు వర్తించవనే షరతు విధించింది. అమెరికా లక్ష్యంగా పెట్టుకున్న దేశం చైనా అని మరి చెప్పనవసరం లేదు. ఒక చైనీస్ కంపెనీకి సహ లేదా అనుబంధ సంస్థ అయిన ఒక ఇండోనేసియన్ కంపెనీ సరఫరా చేసిన నికెల్‌ను వినియోగించుకున్న కారుకు ఎటువంటి సబ్సిడీ లభించబోదు. మరి వినియోగదారులు విద్యుత్ వాహనాలకు మారాలంటే ఈ సబ్సిడీనే చాలా ముఖ్యం.

చైనాలో విద్యుత్ వాహనాలు విపరీతమైన ప్రజాదరణ పొందుతున్నాయి. గత జూలైలో ఐసి ఇంజిన్ల కార్ల కంటే విద్యుత్ వాహనాల విక్రయాలే అత్యధికంగా జరిగాయి. ఆ ఒక్క నెలలోనే 8,53,000 విద్యుత్ వాహనాలు విక్రయమయ్యాయి. చైనా ఉత్పత్తి చేసే విద్యుత్ వాహనాలు చాలా చౌకగాను, భరించగలవిగాను ఉండడమే అందుకు కారణం. అయితే బ్యాటరీ టెక్నాలజీ, క్రిటికల్ మినరల్ (కాపర్, లిథియం, నికెల్, కోబాల్ట్) ప్రాసెసింగ్, కార్మిక వ్యయాలు తక్కువగా ఉండడమే విద్యుత్ వాహనాల తయారీ రంగంలో తమ ప్రాబల్యానికి కారణమని చైనా వాదిస్తోంది. పాశ్చాత్య దేశాలు ఈ వాదనతో ఏకీభవించడం లేదు. చైనా విద్యుత్ వాహనాల తయారీలో అగ్రగామి కంపెనీ బివైడి తన కార్యకలాపాలను వియత్నాం, ఇండోనేసియా, మలేసియాలకు విస్తరింపచేయనున్నది. విద్యుత్ వాహనాలు కనీసం ఈ దేశాలలోనైనా ఇప్పుడు ఎంతో అవసరమైన హరిత పరివర్తనను శీఘ్రతరం చేస్తుంది కదా. నిస్సందేహంగా ఇదొక శుభ వార్త.

తమ సొంత పరిశ్రమలు కూలిపోతాయనే భయంతో చైనా దిగుమతులపై ఆంక్షలు విధించిన పాశ్చాత్య దేశాలలో గ్రీన్ మొబిలిటీ ట్రాన్సిషన్ సఫలమవుతుందా? విద్యుత్ వాహనాల తయారీకి అవసరమైన సరఫరాలను సమకూర్చుకునేందుకు ఈ దేశాలు అంటే పాశ్చాత్య సంపన్న దేశాలు, వాటి మిత్ర రాజ్యాలు (ఇండియా కూడా వీటిలో ఒకటి) తమ ప్రయత్నాలలో భాగంగా 'మినరల్స్ సెక్యూరిటీ పార్టనర్ షిప్' సృష్టించుకున్నాయి. ఖనిజాల వెలికితీత, ప్రాసెసింగ్, రీసైక్లింగ్‌తో ఈ దేశాలు తమకు అవసరమైన సప్లయ్ చైన్స్ (ఉత్పత్తి సరఫరా ప్రక్రియల పరంపర) సంయుక్తంగా నిర్మించుకుంటాయి.

హరిత పరివర్తనలో ఆర్థిక ప్రయోజనాలు ఉన్నాయి. వాటిని సాధించుకోవాలంటే దేశీయ వస్తూత్పత్తిని, ఉద్యోగాల కల్పనను పెంచుకోవాలి. అదే సమయంలో వాతావరణ మార్పు అనేది ఒక తిరుగులేని వాస్తవమనే విషయాన్ని విస్మరించకూడదు. కర్బన ఉద్గారాలను తగ్గించే అత్యాధునిక సాంకేతికతలకు సత్వరమే మారవలసిన అవసరం ప్రపంచ దేశాలు అన్నిటికీ ఉన్నది. అదే సమయంలో హరిత పరివర్తనకు నష్టం వాటిల్లని రీతిలో ఆర్థిక వ్యవస్థలను రూపొందించుకోవలసి ఉన్నది. ఇదెలా సాధ్యం? ఈ విషయమై విస్తృతంగా దాపరికం లేని చర్చ జరగాల్సిన అవసరమున్నది. అయితే మన కాలం అసహనాలలో ఆ చర్చకు ఆస్కారం లేకుండా పోతోంది.

# ఆకలి.. అవమానం!



ప్రపంచ ఆకలి సూచీలో భారతదేశం స్థానం కాస్తంత మెరుగుపడినందుకు సంతోషించాలో, పరిమాణంలోనూ, ఆర్థికంగానూ చిన్నవైన పొరుగుదేశాలతో పోల్చితే బాగా వెనుకబడి ఉన్నందుకు బాధపడాలో తెలియడం లేదు. శ్రీలంక, నేపాల్, మయన్మార్, బంగ్లాదేశ్‌లు ఈ సూచీలో భారత్‌కంటే మెరుగ్గా ఉన్నాయి. 127దేశాల జాబితాలో భారత్ ప్రస్తుతం 105వ స్థానంలో ఉంది. గత ఏడాది 125దేశాల్లో 111వస్థానంలో, అంతకుముందు 107లోనూ ఉన్నందున ప్రస్తుతానికి స్థానం కాస్తంత మెరుగుపడినట్టే. కానీ, తీవ్రమైన ఆకలిబాధ చవిచూస్తున్న దేశంగా ముద్ర పడటం అవమానకరం. పదేళ్ళలో దేశం అద్భుతంగా అభివృద్ధి చెందిందనీ, జీడీపీ హెచ్చిందనీ, అతిపెద్ద ఆర్థికవ్యవస్థ పరుగుపందెంలో ముందంజలో ఉన్నదని ప్రచారం చేసుకుంటున్న మన పాలకులను ఇటువంటి నివేదికలు కచ్చితంగా కలవరపెడతాయి. వాటిని విదేశీకుట్రగా ముద్రవేయడం, తప్పులతడక అంటూ తీసిపారేయడం వారికి ఎంతో సులువు.ఆకలిబాధ ఆందోళనకర స్థాయిలో ఉన్న దేశాల్లో మనది కూడా ఒకటి. మరోలా చెప్పుకోవాలంటే, ఆ లెక్కన పాకిస్థాన్, అఫ్ఘానిస్థాన్ వంటి దేశాల సరసన భారత్ నిలిచింది. పోషకాహారలోపం, శిశుమరణాలు ఇత్యాది ప్రాతిపదికలమీద ఆకలిబాధను లెక్కగట్టే ఈ నివేదిక భారత్‌లో ఉన్న తీవ్రమైన పరిస్థితులను లోతుగా ప్రస్తావించింది. దాదాపు 14శాతం మంది పోషకాహారలోపాన్ని ఎదుర్కొంటున్నారు, ఐదేళ్ళలోపు పిల్లల్లో మూడో వంతుకంటే ఎక్కువమంది వయసుకు తగ్గ ఎత్తు ఎదగలేదు, సుమారు 19శాతం మంది ఎత్తుకు తగ్గబరువు లేరు. ఐదేళ్ళు నిండకుండానే కన్నుమూస్తున్న పిల్లల మూడుశాతం వరకూ ఉన్నారు. నాలుగు కీలకమైన అంశాలను తీసుకొని, పోషకాహారలోపం, శిశుమరణాలకు మూడోవంతు విలువ, మిగతా రెండింటికీ ఆరోవంతు విలువ ఇస్తూ మొత్తం స్కోరు లెక్కగట్టే ప్రక్రియలో భారత్ 27.3 పాయింట్లు దక్కించుకుంది. పోషకాహారం మాట పక్కనబెడితే, ఆహారం అందుబాటులో ఉండటమన్నది కూడా ఒక సమస్య అని ఈ నివేదిక తెలియచెబుతోంది. ఆర్థికసంక్షోభంలో కూరుకుపోయి అప్పులకోసం వెంపర్లాడుతున్న శ్రీలంక, రాజకీయ సంక్షోభంలో మునిగిన బంగ్లాదేశ్, నలుదిక్కులా పోరాటాలతో, అంతర్యుద్ధంతో తీసుకుంటున్న మయన్మార్ వంటి దేశాలు మనకంటే ఎంతో మెరుగైన స్థానంలో ఎలా నిలవగలిగాయన్నది అసలు ప్రశ్న. పౌష్టికాహారలోపం ఎదుర్కొంటున్న ప్రజల సంఖ్య ప్రపంచస్థాయిలో కూడా పెరుగుతున్నదని, యుద్ధాలు, అంతర్యుద్ధాలు, వలసలు, వాతావరణ మార్పులు వంటివి ప్రపంచ ఆకలిసూచీ స్కోరును పెంచేస్తున్నాయని ఈ నివేదిక అంటోంది.గ్లోబల్ హంగర్ ఇండెక్స్‌ను భారతదేశ పాలకులు ఒప్పుకోకపోవడం కొత్తేమీ కాదు. లోపభూయిష్టమైన పద్ధతుల్లో, విధానాల్లో ఈ లెక్కలు కడుతున్నారని, కొద్దిమందిని నమూనాగా తీసుకొని, ఆకలిని దేశవ్యాప్తంగా వర్తింపచేస్తున్నారని మన ప్రభుత్వం వాదన. ఈ నివేదికలో దేశాలన్నింటికీ వర్తించిన కొలమానాలే తప్ప మనకు వేరు లెక్కలంటూ ఏమీ ఉండవు. పైగా, నివేదిక తయారీలో వాడిన వివరాలు, గణాంకాలన్నీ ప్రపంచ ఆరోగ్యసంస్థ, యునిసెఫ్ తదితర ఐక్యరాజ్యసమితి అనుబంధ సంస్థల నుంచి సేకరించినవో, అవి ప్రచురించిన నివేదికలనుంచి తీసుకున్నవో అవుతాయి. గత నివేదికలను ప్రభుత్వం తిరస్కరించినప్పుడు కూడా భారత ప్రభుత్వ జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వేల వంటివి ఈ చేదునిజాలను ముందే చెప్పిన విషయాన్ని విపక్షాలు, మీడియా గుర్తుచేశాయి కూడా.గత కొన్ని దశాబ్దాలుగా భారత్ స్కోరు మెరుగుపడినప్పటికీ, దేశంలో ఇంకా ఆకలికేకలు తగ్గలేదని ఈ సూచీ చెబుతున్నది. అంతర్జాతీయ సమాజం ముందు తలవంపులు తెచ్చే ఇటువంటి నివేదికలను తిరస్కరించడానికే పాలకులు ఉత్సాహపడటం సహజం. ఒప్పుకోనంత మాత్రాన నిజాలు అబద్ధాలు కావు. ప్రభుత్వం ఆధ్వర్యంలో సాగే సర్వేలు, వివిధ ప్రభుత్వశాఖలు సేకరించే గణాంకాలమీద ఇటీవలి కాలంలో పాలకులకు అయిష్టత పెరుగుతూ, వాటిని పూర్తిగా నిర్వహించకపోవడమో, వాయిదావేయడమో, సర్వేలు చేపట్టినా వివరాలు బహిర్గతపం చకపోవడమో జరుగుతోంది. కానీ, ప్రజలకు ఆహారాన్ని అందించే విషయంలో ఎంతో శ్రద్ధపెడుతున్నామంటున్నవారు, ఆశించిన లక్ష్యం నెరవేరుతున్నదీ లేనిదీ తెలుసుకోక తప్పదు. జాతీయ ఆహారభద్రతాచట్టం, ప్రధాన మంత్రి అన్న యోజన, మాతృవందన, పోషణ్ వంటి అనేకానేక పథకాలతో ఆకలిని ఉపశమింపచేసి, పలు కార్యక్రమాల ద్వారా పోషకాహారాన్ని అందిస్తున్నామన్న ప్రభుత్వం వాదనను ఆకలిసూచీలో మన స్థానం సవాలు చేస్తున్నమాట నిజం.

## కామ్రేడ్ మానసయ్యను టార్గెట్ చేసిన శ్రీరామసేన: ఖండన

**పిజే జేమ్స్, ప్రధాన కార్యదర్శి సిపిఐ (ఎం.ఎల్) రెడ్ స్టార్**



కర్నాటకలో, రాష్ట్రంలోని మనువాద (ఇస్లామోఫోబిక్) ముస్లిం వ్యతిరేక ప్రచారాన్ని తీవ్రంగా వ్యతిరేకించినందుకు సిపిఐ (ఎంఎల్) రెడ్ స్టార్ పొలిట్ బ్యూరో సభ్యుడు భారత కార్మిక సంఘాల కేంద్రం(టియుసిఐ )ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ ఆర్ మానసయ్యపై హిందుత్వ సంస్థలలో ఒకటైన శ్రీరామసేన మండిపడింది. సావర్కర్, గోల్వాల్కర్‌ల అడుగుజాడల్లోనే విషపూరిత హిందుత్వ ఫాసిస్టులు రాష్ట్రంలోని ముస్లింలు, దళితులను లక్ష్యంగా చేసుకుని హిందూరాష్ట్రంలో ఫాసిస్టులు పిచ్చిపిచ్చిగా దాడి చేస్తుంటే, మానసయ్య నేతృత్వంలోని పార్టీ, దాని సాంస్కృతిక కార్యకర్తలు సైద్ధాంతికంగా, రాజకీయంగా బయటపెట్టి, ప్రతిఘటించడంలో ముందున్నారు.



ఈ క్రమంలోనే మానసయ్యకు క్షమాపణలు చెప్పాలంటూ శ్రీరామ సేన బెదిరింపు ప్రకటనతో పాటు రాయచూర్‌లోని ఆయన నివాసం ఎదుట ' మానసయ్యఅంత్యక్రియల ఊరేగింపు', దిష్టిబొమ్మను దహనం చేస్తామంటూ హెచ్చరించింది.

కర్నాటకలోని కార్మికవర్గం మైనారిటీలతో సహా అణగారిన వారందరికీ అతివాద, ప్రతిఘటన హిందుత్వ ఫాసిస్టులకు వ్యతిరేకంగా ఐక్య పోరాటానికి ముందుకు రావాలని విజ్ఞప్తి చేస్తున్నాము. కామ్రేడ్ ఆర్ మానసయ్యకు సంఘీభావంగా నిలబడాలని అన్ని ప్రగతిశీల-ప్రజాస్వామ్య శక్తులను అభ్యర్థిస్తున్నాము.

పిజె జేమ్స్
జనరల్ సెక్రటరీ
సిపిఐ (ఎంఎల్) న్యూఢిల్లీ



# ఎందుకీ నిరీక్షణ

భక్తి

మానవ జీవితకాలమంతా కర్మయోగంతో ముడివడి ఉంటుంది. ప్రతి ఒక్కరూ కర్మఫలితాల్ని ఆశించడం సర్వసాధారణ విషయమైనా, అవి వెంటనే అందవు. కొన్ని పనులు దీర్ఘకాలంలో, మరికొన్ని స్వల్పకాలంలో ఫలితాలనిస్తుంటాయి. వాటి కోసం నిరీక్షణ మనిషికి తప్పనిసరి. దాన్ని 'ఎదురుచూపు'గా చెబుతారు.ఆధ్యాత్మిక జగత్తులో, భగవంతుడి అనుగ్రహ ప్రాప్తికి భక్తుల్లో ఎడతెగని నిరీక్షణ కనిపిస్తుంది. అది ఒక్కోసారి విసుగు పుట్టించేలా, వేదన కలిగించేలా ఉంటుంది. రామకృష్ణ పరమహంస 'భవతారిణి' అనుగ్రహం ప్రాప్తిస్తుందని ఎంతో ఆర్తిగా ఎదురుచూసేవారు. నిరీక్షణలో భాగంగా అనేక ఉపాసనలు, పద్ధతులను ఆయన అవలంబించేవారు. భగవంతుడి అనుగ్రహం సిద్ధించడమన్నది ఒకవిధంగా జీవితకాల నిరీక్షణ ఫలితమే! శ్రీరామ దర్శనం కోసం ఎంతోకాలం నిరీక్షించింది శబరి. ఆయన అరణ్యవాసం ఆమె పాలిట వరంగా మారింది. వనవాటికలో రాముడికి భక్తిపూర్వక ఆతిథ్యమిచ్చిన ఆమె ధన్యురాలైంది. కొన్ని అనాలోచిత, ఆవేశపూరిత నిర్ణయాలు సైతం ఇతరుల్ని భరింప శక్యంగాని నిరీక్షణకు గురిచేస్తాయి. స్వార్థపూరితమైన కైకేయి కోరిక, ఆమె తనయుడు భరతుణ్ని ఎంతో నిరీక్షింపజేసింది. ఆయన పద్నాలుగు సంవత్సరాలు తన అన్న శ్రీరామచంద్రుడి రాక కోసం ఎదురుచూసేలా చేసింది.లక్ష్మణుడి భార్య వూర్మిళ, తన నిరీక్షణ కాలమంతా నిద్రలో వెళ్లబుచ్చాల్సి వచ్చింది.ఎవరి నిరీక్షణ కాలమైనా బాధ, అయోమయం, ఆందోళన, అస్థిరత్వాలకు కారణమవుతుంది. మనసును పలు విధాల కుంగదీస్తుంది. మనిషికి ఆత్మవిశ్వాసం, నమ్మకం అవసరం. కర్మాచరణల పట్ల అతడికి స్థిరచిత్తం ఉండాలి. అప్పుడు ఎంత నిరీక్షణ అయినా అంతగా బాధించదు. మనోభారాన్ని దరిచేర నివ్వదు. అందుకే- ప్రతి పనినీ హృదయపూర్వకంగా, ఆత్మీయంగా పూర్తిచేయాలంటారు ఆధ్యాత్మిక తత్వవేత్తలు.అర్థం లేని నిరీక్షణ- కాలాన్ని వ్యర్థపరుస్తుంది. ఆలోచనల భారాన్ని పెంచుతుంది. అదే నిరీక్షణ విపరీతమైతే, మనోవైకల్యం కలిగిస్తుంది. అందువల్ల నిరీక్షణ కాలాన్ని ఇతర వ్యాపకాల వైపు మళ్లించడం ఎంతో ఉత్తమం. మహాపురుషులు సమాజంలో చైతన్యవంతమైన మార్పును ఆశిస్తారు. అందుకు నిరంతరం శ్రమిస్తుంటారు.

తాము నిర్వర్తించాల్సిన కార్యాలపై మనసు లగ్నం చేస్తారే తప్ప, జరిగిపోయినవాటి ఫలితాల కోసం నిరీక్షిస్తూ కాలాన్ని వృథా చేయరు. ఆ ఫలితాలు ఉత్తమంగా ఉంటాయని వారికి కొండంత విశ్వాసం!శ్రీకృష్ణుడి కోసం రాధ నిరీక్షించినవన్నీ మధుర క్షణాలే! ఆమె ఎదురుచూపులన్నీ ప్రేమానురాగాలతో నిండి ఉండేవి. ఆయన బృందావనంలోకి ప్రవేశించక ముందు, రాధకు ప్రతి క్షణమూ ఒక యుగం!సాహితీమూర్తులకు అక్షరమే ఉపాసన. గంగాప్రవాహంలా సాగే వారి వ్యాసంగం, నిరీక్షణకు ఆస్కారమివ్వదు. ఆహార పానీయాలు సైతం మరచి ప్రయోగశాలల పనుల్లో మునిగితేలే శాస్త్రవేత్తలకూ నిరీక్షణ అనే మాటే ఉండదు.



## అదృష్టవంతురాలికి మాత్రమే శరీరంలోని ఈ భాగంలో మచ్చ...



**అదృష్ట పుట్టుమచ్చలు:** ప్రతి వ్యక్తి శరీరంపై పుట్టుమచ్చ ఉంటుంది. ఇది సహజమైనది. అదృష్టవంతురాలికి మాత్రమే శరీరంలోని ఈ భాగంలో పుట్టుమచ్చలు ఉంటాయని శాస్త్రం చెబుతుంది. ఆ పుట్టుమచ్చలు ఆమె భర్త జీవితంలో చాలా ముఖ్యమైన పాత్ర పోషిస్తాయని నిపుణులు చెబుతున్నారు. ఉదాహరణకు, శరీరంపై ఉన్న పుట్టుమచ్చ నిద్రిస్తున్న చాపకు తగిలితే, అది మంచిది కాదు. అలాంటి వ్యక్తికి జీవితం కష్టమవుతుంది. అదేవిధంగా, సముద్ర శాస్త్రం జాపత్రి విషయంలో ముఖ్యమైన అంశాలను అందించింది. వాటి గురించి ఇక్కడ తెలుసుకుందాం.

చెంపపై పుట్టుమచ్చ..ఒక వ్యక్తి చెంపపై పుట్టుమచ్చ చాలా శుభప్రదంగా పరిగణించబడుతుంది. అలాంటి వారు చాలా అదృష్టవంతులు. అలాగే అలాంటి వ్యక్తులు తమ భాగస్వామికి చాలా విధేయులుగా ఉంటారు.నుదిటికి కుడి వైపు..నుదిటికి కుడి వైపున పుట్టుమచ్చ ఉన్న అమ్మాయి చాలా అదృష్టవంతురాలు. అలాంటి వారికి సంపద పెరుగుతూనే ఉంటుంది. డబ్బుకు ఎప్పుడూ కొరత ఉండదు.

ఛాతీ మధ్యలో పుట్టుమచ్చ..ఛాతీ మధ్యలో పుట్టుమచ్చ ఉన్నవారిని అదృష్టవంతులుగా పరిగణిస్తారు. ఇలాంటి వారికి లక్ష్మీదేవి అనుగ్రహం ఉంటుంది. సమాజంలో తమకంటూ ఓ గుర్తింపును ఏర్పరుచుకుంటారు.

కుడి అరచేతిలో పుట్టుమచ్చ..కుడి అరచేతిలో పుట్టుమచ్చ ఉన్న వ్యక్తులు వ్యాపారంలో మంచి విజయాన్ని పొందుతారు.

# చలికాలంలో వేడిగా తాగండి!

**చలికాలంలో సహజంగానే బద్ధకంగా, నీరసంగా అనిపిస్తుంటుంది. వాతావరణం చల్లగా ఉండడం వల్ల శరీర ఉష్ణోగ్రత తగ్గి రోగనిరోధక శక్తి బలహీనమవుతుంది. తరచూ జలుబు, దగ్గు, శ్వాసకోశ సమస్యలు వేధిస్తుంటాయి. వీటి నుంచి ఉపశమనం పొంది రోజంతా ఉత్సాహంగా పనిచేయడానికి ఉదయాన్నే వేడిగా కొన్ని పానీయాలు తాగడం మంచిదని అంటున్నారు నిపుణులు. వాటి గురించి తెలుసుకుందాం!**



**అల్లం-నిమ్మకాయ టీ:** అల్లం, నిమ్మకాయ రెండూ శరీర ఉష్ణోగ్రతను పెంచుతాయి. వీటిలోని యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు గొంతు గరగరను నివారిస్తాయి. నిమ్మకాయలోని సి-విటమిన్ వ్యాధులను వ్యాప్తిచేసే బ్యాక్టీరియా, వైరసలతో పోరాడుతుంది. రోగనిరోధక శక్తిని పెంచుతుంది. ఒక గిన్నెలో రెండు చిన్న అల్లం ముక్కలు వేసి, అందులో ఒక గ్లాసు మంచినీళ్లు పోసి బాగా మరిగించాలి. తరవాత ఈ నీళ్లను వడబోసి అందులో రెండు చెంచాల నిమ్మరసం కలిపి వేడిగా తాగాలి.

**పసుపు పాలు**

ఫ పసుపులోని కర్కుమిన్ గుండె జబ్బుల నివారణకు, నరాలు పటిష్టంగా ఉండేందుకు తోడ్పడుతుంది. చలికాలంలో కీళ్లు పట్టేయకుండా కాపాడుతుంది. పాలలోని కాల్షియం ఎముకలను దృఢంగా ఉంచుతుంది. ఒక గ్లాసు వేడి పాలలో ఒక చెంచా పసుపు, చిటికెడు నల్ల మిరియాల పొడి, ఒక చెంచా తేనె కలిపి తాగితే రోజంతా ఉత్సాహంగా ఉంటుంది. ఈ కషాయంలో మిరియాల పొడిని కలపడం వల్ల పసుపులోని కర్కుమిన్ పూర్తిస్థాయిలో శరీరానికి అందుతుంది.

**దాల్చిన చెక్క పానీయం**

ఫ దాల్చిన చెక్క జీవక్రియలను వేగవంతం చేసి శరీరాన్ని ఉత్సాహపరుస్తుంది. రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రిస్తుంది. ఒక గ్లాసు వేడినీటిలో అర చెంచా దాల్చిన చెక్క పొడి, ఒక చెంచా తేనె వేసి బాగా కలిపి వేడిగా ఉన్నప్పుడే తాగాలి.

**నిమ్మకాయ-తేనె**

ఫ నిమ్మరసం, తేనెల మిశ్రమం శరీరంలోని వ్యర్థ పదార్థాలను బయటికి పంపుతుంది. జీర్ణాశయం, కాలేయం సక్రమంగా పనిచేసేలా చూస్తుంది. ఒక గ్లాసు వేడి నీళ్లలో మూడు చెంచాల నిమ్మరసం, రెండు చెంచాల తేనె కలిపి వేడిగా తాగితే చలికాలంలో వచ్చే శ్వాసకోశ సమస్యలనుంచి ఉపశమనం కలుగుతుంది.

**తులసి-పుదీనా**

తులసి ఆకులు ఒత్తిడిని తగ్గిస్తాయి. పుదీనా పొట్టను శుభ్రం చేస్తుంది. ఒక గ్లాసు వేడినీటిలో అయిదు తులసి ఆకులు, ఎనిమిది పుదీనా ఆకులు వేసి కొంతసేపు నాననివ్వాలి. గోరువెచ్చని ఈ పానీయం తాగుతున్నపుడు వచ్చే సువాసన వల్ల మనసుకు ఉత్సాహం కలిగి శరీరానికి బద్ధకం వదులుతుంది.

**యాపిల్ సైడర్ వెనిగర్-తేనె**

యాపిల్ సైడర్ వెనిగర్ శరీరంలో పీహెచ్ స్థాయిని నియంత్రణలో ఉంచుతుంది. ఒక గ్లాసు వేడినీటిలో ఒక చెంచా యాపిల్ సైడర్ వెనిగర్, ఒక చెంచా తేనె కలపాలి. దీని రుచి అద్భుతంగా ఉంటుంది. ఈ పానీయం తాగిన వెంటనే కడుపులో తేలికగా ఉన్న భావన కలుగుతుంది. శరీరానికి తక్షణ శక్తి లభిస్తుంది.

**కశ్మీరీ కహ్వా**

ఒక గిన్నెలో రెండు గ్లాసుల మంచి నీళ్లు, రెండు యాలకులు, చిన్న దాల్చిన చెక్క ముక్క, ఒక చెంచా గ్రీన్ టీ ఆకుల పొడి, రెండు చెంచాల ఎండు గులాబీ రేకులు వేసి బాగా మరిగించాలి. తరవాత ఈ నీళ్లను వడబోసి అందులో ఒక చెంచా తేనె, కొన్ని బాదం పలుకులు, కుంకుమ పువ్వు రేకులు వేసి బాగా కలపాలి. ఈ పానీయాన్ని పొద్దున్నే వేడిగా తాగితే జలుబు, ముక్కు దిబ్బడ నుంచి ఉపశమనం కలుగుతుంది. దీని ఘాటైన పరిమళం అలసటను, ఒత్తిడిని తగ్గిస్తుంది.

## జిడ్డుగారే తలకు నిమ్మ



నాలుగు చినుకులు పడితే చాలు జుట్టు జిడ్డుగారుతూ కనిపిస్తుంది. అలాగే చివర్లు చివర్లు చిట్లడం, జుట్టురాలడం వంటి సమస్యలూ ఈ కాలంలో మామూలే. వీటిని అధిగమించాలంటే... ఇంట్లోనే అప్పుడప్పుడూ ఈ పూతలు ప్రయత్నించి చూడండి.

– ఆలివ్‌నూనె, తేనెను 2:1 నిష్పత్తిలో తీసుకోవాలి. ఈ రెండింటినీ కలిపి కాస్త గోరువెచ్చగా చేసి తరువాత మాడుకు కాకుండా మిగిలిన జుట్టుకు పట్టించాలి. ఇరవై నిమిషాల తరువాత గాఢత తక్కువగా ఉన్న షాంపూతో కడిగేయాలి. ఇలా వారానికోసారి చేస్తుంటే జుట్టు ఆరోగ్యంగా మారుతుంది.

–చివర్లు చిట్లిన సమస్య చాలామందిలో కనిపిస్తుంది. దీన్ని నివారించాలంటే అరకప్పు పెరుగులో పావుకప్పు బొప్పాయి గుజ్జు కలిపి తలంతా పూతలా పట్టించాలి. అరగంటాగి గోరువెచ్చని నీటితో కడిగేస్తే చాలు. అదేవిధంగా కలబంద గుజ్జులో పెద్ద చెంచాడు నిమ్మరసం, రెండు పెద్ద చెంచాల ఆముదం కలిపి తలంతా రాసి బాగా మర్దనా చేయాలి. ఇలా వారానికి రెండుసార్లు చేస్తుంటే చివర్లు చిట్లడటం తగ్గుతుంది.

– తలస్నానం చేసినా జుట్టు జిడ్డుగా కనిపిస్తోందా. రెండు గుడ్ల పచ్చసొనలో కొద్దిగా నిమ్మరసం, తేనె వేసి బాగా కలపాలి. దీన్ని తలకు రాయాలి. బాగా ఆరాక తలస్నానం చేయాలి. జిడ్డు వదలడమే కాదు, మెరుస్తుంది కూడా.

## ఇండో-చైనీస్ డ్రై చిల్లీ చికెన్



**కావలసినవి:**బోన్‌లెస్ చికెన్: అరకిలో, ఉల్లిపాయ: ఒకటి, ఆకుపచ్చ క్యాప్సికమ్: ఒకటి(చిన్నది), సోయాసాస్: టేబుల్‌స్పూను, వ్హైట్ వినెగర్: పావుటీస్పూను, గ్రీన్ చిల్లీ సాస్: టేబుల్‌స్పూను, మిరియాలపొడి: టీస్పూను, పచ్చిమిర్చి: మూడు, కాశ్మీరీ కారప్పొడి: 3 టీస్పూన్లు, వెల్లుల్లి ముద్ద: టేబుల్‌స్పూను, కార్న్‌ఫ్లోర్: టేబుల్‌స్పూను, మైదాపిండి: టేబుల్‌స్పూను, గుడ్డు: ఒకటి, ఉప్పు: రుచికి సరిపడా, నూనె: తగినంత, ఉల్లికాడలు: కొద్దిగా

**తయారుచేసే విధానం** ..–చికెన్ ముక్కల్లో అర టేబుల్‌స్పూను సోయాసాస్, గుడ్డుసొన, ఉప్పు, మిరియాలపొడి, మైదాపిండి, సగం వెల్లుల్లి ముద్ద, సగం చిల్లీ సాస్ వేసి కలిపి ఓ అరగంటసేపు నాననివ్వాలి.

– ఓ పాన్‌లో తగినంత నూనె పోసి చికెన్ ముక్కలు వేసి బంగారు వర్ణంలోకి మారేవరకూ వేయించి తీసి పక్కన ఉంచాలి.

– అదే పాన్‌లో మరికాస్త నూనె వేసి మిగిలిన వెల్లుల్లి ముద్ద, కాశ్మీరీ కారం వేసి రెండు నిమిషాలు వేయించాలి. తరవాత ఉల్లి, క్యాప్సికమ్ ముక్కలు వేసి బాగా వేగాక వినెగర్ వేసి కలపాలి. తరవాత వేయించిన చికెన్ ముక్కలు వేసి మిగిలిన సోయాసాస్, గ్రీన్ చిల్లీ సాస్, ఉప్పు, పంచదార, మిరియాలపొడి వేసి కలిపి నాలుగైదు నిమిషాలు వేయించాలి. చివరగా ఉల్లికాడల ముక్కలు చల్లి దించి వేడివేడిగా వడ్డించాలి.

## మెడలో మందిరం





దేవుడికి మెడలోనూ గుడి కడుతున్నారు డిజైనర్లు. 'టెంపుల్ లాకెట్లు' నగల డిజైన్లలో కొత్త ట్రెండ్ ఇప్పుడు. దేవుడి ప్రతిమ ఏదైనా.. దాని చుట్టూ ముచ్చటైన మందిరాన్ని పోలిన నిర్మాణం ఉండటం వీటి ప్రత్యేకత. శిల్ప కళకు దీటుగా నగిషీలు చెక్కుతున్నారు. అందమైన స్తంభాలు, ముచ్చటైన గోపురాలను ఆభరణాల్లో ఆవిష్కరిస్తున్నారు. లక్ష్మి, గణపతి, కృష్ణుడు, శివుడు, వేంకటేశ్వరుడు.. ఇలా రకరకాల దేవతా ప్రతిమలు ఉంటున్నాయి ఇందులో. ముఖ్యంగా లక్ష్మీదేవికి సంబంధించి బోలెడు డిజైన్లు వస్తున్నాయి. మందిరం ఆకృతుల్లో అయితే లెక్కకు మిక్కిలి వెరైటీలు దొరుకుతున్నాయి. యాంటిక్ ఫినిష్‌తో చోకర్లు, హారాలు, నెక్లెస్‌లు.. ఇలా అన్నిటిలోనూ వస్తున్నాయి. పచ్చలు, కెంపులు, వజ్రాలు, ముత్యాలు పొదిగినవే కాదు.. నగకు ప్రత్యేక లుక్ తీసుకు వచ్చేలా బీడ్స్ తరహాలోనూ టెంపుల్ లాకెట్లు రూపొందుతున్నాయి. కొన్ని మందిరాలు త్రీడీ తరహాలో ఉంటే, కొన్ని అచ్చమైన మండపంలా చదరంగా ఉంటున్నాయి.

















# అధిక బరువు తగ్గాలంటే.. వీటిని తినాలి..!



అధిక బరువుతో నానా అవస్థలు పడుతూ రోజూ వ్యాయామం చేయడం, తిండి తగ్గించడం వంటి పద్ధతులను చాలా మంది ఫాలో అవుతున్నారు. ఈ క్రమంలో ఒక్కోసారి ఆహారం విషయంలో కఠిన నియమాలను పాటిస్తున్నారు. అయితే దీనికితోడు కింద ఇచ్చిన పలు ఆహార పదార్థాలను కూడా నిత్యం తింటుంటే దాంతో ఒంట్లో ఉన్న కొవ్వు కరిగిపోతుంది. తద్వారా అధిక బరువు తగ్గుతారు. పొట్ట కూడా కరిగిపోతుంది. మరి ఆ ఆహార పదార్థాలు ఏమిటో ఇప్పుడు తెలుసుకుందామా..!

**1. బాదం పప్పు**

బాదం పప్పులో మన శరీరానికి కావల్సిన కీలక పోషకాలు ఉంటాయి. ముఖ్యంగా వీటిలో ఉండే విటమిన్ ఇ అధిక బరువును తగ్గించేందుకు పనికొస్తుంది. నిత్యం గుప్పెడు బాదం పప్పును నీటిలో నానబెట్టి తింటే ఫలితం ఉంటుంది.

**2. చిరుధాన్యాలు**

శరీరంలో ఉన్న కొవ్వును వేగవంతంగా కరిగించడంలో చిరుధాన్యాలు ప్రముఖ పాత్ర వహిస్తాయి. కాబట్టి వీటిని ఆహారంలో భాగం చేసుకోవాలి. రాగులు, సజ్జలు, జొన్నలు వంటివి ఈ కోవకు చెందుతాయి.

**3. కొబ్బరి నూనె**

కొబ్బరి నూనె శరీర బరువును తగ్గించడంలో శక్తివంతంగా పని చేస్తుంది. దీంట్లో ఉండే పోషకాలు శరీర జీవక్రియను పెంచుతాయి. శక్తి వినియోగాన్ని రెట్టింపు చేస్తాయి. కాబట్టి బరువు తగ్గించుకోవాలనుకునే వారు తినే ఆహార పదార్థాల తయారీలో కొబ్బరి నూనె వాడడం చాలా మంచిది.

**4. మిరియాలు**

మన శరీరంలో ఉండే కొవ్వు పదార్థాలను కరిగించే సామర్థ్యం మిరియాలకు ఉంది. మిరియాలలో ఉండే క్యాప్సైసిన్ అనే సమ్మేళనం ఆక్సిడేషన్ అనే ప్రక్రియ ద్వారా శరీరంలో ఉండే కొవ్వు పదార్థాలను కరిగిస్తుంది. అంతేకాకుండా, జీవక్రియను పెంచటం ద్వారా క్యాలరీలు ఖర్చు అయ్యేలా చేస్తుంది. దీంతో అధిక బరువు తగ్గుతారు.

**5. ద్రాక్ష పండ్లు**

కొవ్వు కరిగించే అద్భుత ఆహార పదార్థంగా ద్రాక్షపండ్లని చెప్పవచ్చు. ఇవి జీవక్రియను పెంచి శరీరంలో అదనంగా ఉండే కొవ్వు పదార్థాలను కరిగేలా చేస్తాయి. అంతేకాకుండా, ఈ పండ్లు ఫైబర్ (పీచు)ను కలిగి ఉండి, రక్తంలోని గ్లూకోజ్ స్థాయిలను ఆరోగ్యకర స్థాయిలో ఉండేలా చేస్తాయి. వ్యాయామం చేయడంతో పాటు వీటిని తింటుంటే త్వరగా బరువు తగ్గుతారు.

## గోల్డ్ లోన్లకూ ఈఎంఐలు



**న్యూఢిల్లీ-నవభూమి:** గోల్డ్ లోన్లకూ త్వరలో ఈఎంఐలు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం గృహ, వాహన, వ్యక్తిగత, విద్యా తదితర రుణాలకే నెలవారీ వాయిదా చెల్లింపుల (ఈఎంఐ) సౌకర్యం ఉన్నది. బంగారాన్ని తాకట్టు పెట్టి తీసుకునే అప్పులకు ఈ సదుపాయం లేదు. అయితే ఈ రుణాల మంజూరులో ఆర్బీఐ రకరకాల లోపాలను గుర్తించింది. దీంతో బ్యాంకులు, గోల్డ్ లోన్ కంపెనీల వంటి బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్బీఎఫ్సీ)లు బంగారంపై రుణాలకూ ఈఎంఐలను తేవాలని చూస్తున్నట్టు తెలుస్తున్నది.
ఇదీ సంగతి..బంగారు ఆభరణాలను తనఖా పెట్టి తీసుకునే రుణాల్లో లోపాలను గుర్తించామని ఈ సెప్టెంబర్ 30న ఓ న ర్క్యులర్ లో ఆర్బీఐ తెలిపింది. విలువ, పరిశీలన, రుణగ్రహీత ఆర్థిక సామర్థ్యం, వేలం వంటి అంశాల్లో బ్యాంకులు, రుణదాతలు నిర్లక్ష్యం చేస్తున్నారన్నది. తీసుకున్న అప్పును తిరిగి చెల్లిస్తారా? లేదా? అన్నది చూడాలని ఆర్బీఐ అంటున్నది. దీంతో ఈఎంఐ ఆధారిత వ్యవస్థను గోల్డ్ లోన్లకూ తేవాలనుకుంటున్నట్టు బ్యాంకర్లు చెప్తున్నారు. కాగా, సెప్టెంబర్ 30 నాటికి బ్యాంకులు రూ.1.4 లక్షల కోట్ల గోల్డ్ లోన్లను ఇచ్చాయి. గతంతో పోల్చితే 51 శాతం పెరిగాయి.

## బిజినెస్




## రోజూ రూ. 171 సేవ్ చేసి.. రూ. 28 లక్షలు దక్కించుకోండి..



**న్యూఢిల్లీ-నవభూమి:** మీరు తక్కువ మొత్తంలో పెట్టుబడులు చేసి మంది ఆదాయాన్ని పొందాలని చూస్తున్నారా. అందుకు ప్రభుత్వ పథకాలలో ఒకటైన లో జీవన్ తరుణ్ స్కీం అనే మంచి స్కీం ఉంది. దీనిలో మీరు మీ పిల్లల కోసం ఒక పెట్టుబడి విధానాన్ని ఎంపిక చేసుకోవచ్చు. అందుకోసం ప్రతి రోజు మీరు కనీసం రూ. 150 చెల్లించి మీ పిల్లల భద్రతకు భరోసా కల్పించుకోవచ్చు. రోజుకు రూ. 150 ఇన్వెస్ట్ చేస్తే ఏడాదికి రూ. 54000 ఆదా చేసుకోవచ్చు. ఆ క్రమంలో మీరు ఎనిమిదేళ్లు చెల్లించాలి.
ఈ పథకం ప్రయోజనాలను పొందడానికి మీ పిల్లల కనీస వయస్సు 3 నెలలు లేదా గరిష్టంగా 12 సంవత్సరాలు ఉండాలి. మీ బిడ్డకు 20 ఏళ్లు వచ్చే వరకు ప్రీమియం చెల్లించాలి. దీనికి 5 సంవత్సరాల లాక్ ఇన్ పీరియడ్ ఉంటుంది. మీ బిడ్డకు 25 సంవత్సరాలు నిండినప్పుడు, ఆమె కళాశాల ఫీజులు లేదా వివాహానికి కూడా చెల్లించడానికి వచ్చే మొత్తం డబ్బును ఉపయోగించుకోవచ్చు. బీమా చేసిన మొత్తానికి గరిష్ట పరిమితి లేదు. పిల్లల వయస్సు 12 సంవత్సరాలు అయితే, పాలసీ వ్యవధి 13 సంవత్సరాలుగా ఉంటుంది. ఈ సందర్భంలో కనీస బీమా మొత్తం రూ. 5 లక్షలు కూడా అందజేస్తారు.

**ఎన్నేళ్లు పడుతుందంటే..**

ఆ క్రమంలో మీరు ప్రతి ఏటా రూ. 54000 ప్రీమియం చెల్లిస్తే, మీరు మొత్తం రూ.4,32,000 పెట్టుబడి చేస్తారు. ఆ తర్వాత మరో ఎనిమిది సంవత్సరాల లాక్ ఇన్ పీరియడ్ తర్వాత మీరు రూ. 8,44,500 పొందుతారు. ఈ నేపథ్యంలోనే మీ పిల్లల వయస్సు 18 సంవత్సరాల వరకు రోజుకు రూ. 171 పెట్టుబడి పెడితే, మీరు రూ. 1089196 పెట్టుబడి చేస్తారు. కానీ 23 ఏళ్ల తర్వాత మీకు వచ్చే మొత్తం రూ. 28,24,800 అవుతుంది.

**మెచ్యూరిటీ సమయంలో..**

మీరు జీవన్ తరుణ్ స్కీమ్‌లో పెట్టుబడి పెట్టడం ద్వారా మంచి ఫండ్‌ను సృష్టించుకోవచ్చు. మెచ్యూరిటీలో మీరు రూ. 28 లక్షల కంటే ఎక్కువ మొత్తం తిరిగి పొందుతారు. అన్ని వయసుల వారు, సమాజంలోని అన్ని వర్గాల సేవింగ్స్ ఉత్పత్తులను ఉపయోగించుకోవచ్చు. మీరు జీవన్ తరుణ్ స్కీంలో మీరు చేసే పెట్టుబడిని బట్టి మీకు వచ్చే మొత్తం ఆధారపడి ఉంటుంది. ప్రతి నెలలో మీరు ఎక్కువ మొత్తాన్ని తక్కువ సమయంలో పెట్టుబడులు చేసినా కూడా మంచి మొత్తాన్ని దక్కించుకోవచ్చు.

## గూగుల్ క్రోమ్ బ్రౌజర్‌ను సేల్ చేస్తున్నారా.. అమెరికా ప్రభుత్వం..




**న్యూయార్క్-నవభూమి:** అమెరికాలో గత కొన్ని రోజులుగా గూగుల్ క్రోమ్ బ్రౌజర్‌ను సేల్ చేస్తున్నారనే మొదలైంది. ఈ క్రమంలోనే డిపార్ట్‌మెంట్ ఆఫ్ జస్టిస్ త్వరలో భారీ షాక్ ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. వాస్తవానికి మాతృ సంస్థ ఆల్ఫాబెట్ దాని ఇంటర్నెట్ బ్రౌజర్‌ను విక్రయించమని ఆదేశించాలని కోర్టును ఆశ్రయించింది. బ్లూమ్‌బెర్గ్ నివేదికలో ఈ విషయాన్ని వెల్లడించింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ దాని ఆండ్రాయిడ్ స్మార్ట్‌ఫోన్ ఆపరేటింగ్ సిస్టమ్‌కు సంబంధించిన చర్యలను డిమాండ్ చేయాలని డిపార్ట్‌మెంట్ న్యాయమూర్తి అమిత్ మెహతా అభ్యర్థించినట్లు బ్లూమ్‌బెర్గ్ నివేదిక తెలిపింది.

**చట్టవిరుద్ధంగా గుత్తాధిపత్యం**

అంతకుముందు న్యాయమూర్తి అమిత్ మెహతా ఆగస్టు 2024లో సెర్చ్ మార్కెట్‌ను చట్టవిరుద్ధంగా గుత్తాధిపత్యం చేసిందని తీర్పు ఇచ్చారు. ఈ నేపథ్యంలో క్రోమ్‌ను విక్రయించమని గూగుల్‌ను ఆదేశించాలని యాంటీట్రస్ట్ ఎన్‌ఫోర్సర్‌లు కోరుకుంటున్నారని నివేదిక పేర్కొంది. అంతేకాదు గూగుల్ సెర్చ్ గుత్తాధిపత్యం పోటీకి హాని కలిగిస్తోందని ప్రభుత్వ న్యాయవాదులు అంటున్నారు. అలాగే తమ ఉత్పత్తులను ప్రమోట్ చేయడానికి ఉపయోగించడం పెద్ద సమస్యగా మారిందని చెబుతున్నారు. ఈ కారణంగా పోటీదారులు మార్కెట్లోకి ప్రవేశించ డానికి, ఎదగడానికి అవకాశాలు తగ్గుతున్నాయని అంటున్నారు.

**ఈ షరతులు విధించవచ్చు**

ఈ నేపథ్యంలో న్యాయ శాఖ కొన్ని అవసరమైన మార్పులు చేయవలసిందిగా కోరవచ్చని తెలిసింది. సెర్చ్, గూగుల్ ప్లే నుంచి ఆండ్రాయిడ్‌ని వేరు చేసే గూగుల్ షరతు కూడా వీటిలో ఉన్నాయి. అయితే ఆండ్రాయిడ్‌ను విక్రయించమని గూగుల్‌ను బలవంతం చేయదు. అలాగే ప్రకటనదారులతో మరింత సమాచారాన్ని పంచుకోవాల్సి ఉంటుంది. న్యాయ శాఖ కూడా గూగుల్ వెబ్‌సైట్‌లకు మరిన్ని ఎంపికలను అందించాలని కోరనున్నట్లు సమాచారం. గూగుల్ తన కృత్రిమ మేధస్సు, ఆండ్రాయిడ్ ఆపరేటింగ్ సిస్టమ్, డేటా వినియోగం గురించి కొత్త చర్యలను ఏర్పాటు చేయాలని కోరనుంది.
మార్కెట్ వాటా ఎలా ఉందంటే..ప్రపంచంలోనే అత్యంత ప్రజాదరణ పొందిన వెబ్ బ్రౌజర్ బలవంతంగా విక్రయించాల్సి వస్తే అది వినియోగదారులకు, వ్యాపారులకు ఇబ్బంది కలిగిస్తుందని గూగుల్ చెబుతోంది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ జస్టిస్ బుధవారం ఈ చర్యను న్యాయమూర్తికి ప్రతిపాదించనుంది. వెబ్ ట్రాఫిక్ ట్రాకర్ ప్రకారం గూగుల్ క్రోమ్ అక్టోబర్‌లో గ్లోబల్ మార్కెట్ వాటాను 64.61 శాతం కల్గి ఉంది. స్టాట్‌కౌంటర్ ప్రకారం అక్టోబర్ నాటికి గ్లోబల్ సెర్చ్ ఇంజిన్ మార్కెట్‌లో గూగుల్ సెర్చ్ దాదాపు 90% వాటాను కలిగి ఉండటం విశేషం. ఇది అలాగే iPhoneలలో Safari సహా అనేక స్మార్ట్‌ఫోన్ బ్రౌజర్‌లలో డిఫాల్ట్ ఇంజిన్‌గా ఉంది.

# హైదరాబాద్‌లో డెలివరీ చేయబడిన 100 ఎంజి విండ్సర్

### రాం ఎంజీ సహకారంతో ఈ విజయం సాధించిన జేఎస్ డబ్ల్యూ మోటార్ ఇండియా



**న్యూఢిల్లీ-నవభూమి:** తన వేగాన్ని కొనసాగిస్తూ, జేఎస్ డబ్ల్యూ ఎంజి మోటార్ ఇండియా భారతదేశపు మొదటి ఇంటిలిజెంట్ సియువి, ఎంజి విండ్సర్ 100 యూనిట్ల మెగా డెలివరీ హైదరాబాద్ లో చేయనున్నట్లు ప్రకటించింది. విశేషంగా విక్రయించబడే ఈవీని డెలివరీ చేసింది, దేశవ్యాప్తంగా ఈ ఎలక్ట్రిక్ సియువి కోసం పెరుగుతున్న ఉత్సుకతను ప్రతిబింబించింది.
తెలంగాణలో ఈవీల కోసం మరింత డిమాండ్ ను మెరుగుపరచడానికి, రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా 'తెలంగాణ ఎలక్ట్రిక్ వెహికిల్ %డ% ఎనర్జీ స్టోరేజ్ పాలసీ 2020-2030ని' చేర్చింది. కొత్త ఈవీ పాలసీ ద్వారా, తెలంగాణ ప్రభుత్వం మొదటి రెండు సంవత్సరాల కోసం అనగా డిసెంబర్ 31, 2026 వరకు రాష్ట్రంలో కొనుగోలు చేసి నమోదు చేసిన ఈవీల కోసం 100% రోడ్ పన్ను మినహాయింపును కేటాయిస్తోంది. ప్రభుత్వం ఆదేశం ప్రకారం, ఈ మినహాయింపు ఎలక్ట్రిక్ 2-వీలర్స్, 4-వీలర్స్ వాణిజ్య వాహనాలకు వర్తిస్తుంది.ఎంజి విండ్సర్ అక్టోబర్ 2024లో గొప్ప సేల్స్ నమోదు చేసింది, తమ డెలివరీ మొదటి నెల లోపు బెస్ట్-సెల్లర్ గా మారింది. కంపెనీ సియువి 3116 యూనిట్లను విక్రయించింది, అక్టోబర్ లో మొత్తం ప్యాసింజర్ ఎలక్ట్రిక్ కార్ సేల్స్ లో సుమారు 30% తోడ్పాటు అందించింది. బుక్కింగ్ ను ప్రకటించిన 24 గంటలు లోగా భారతదేశంలో 15,176 బుక్కింగ్స్ ను సంపాదించిన మొదటి ప్యాసింజర్ ఈవీగా మైలురాయిని సృష్టించింది.
ఈ సందర్భంగా మాట్లాడుతూ, అమిత్ నల్లా రెడ్డి, డీలర్ ప్రిన్సిపల్, RAAM MG ఇలా అన్నారు, "ఆరంభమైన నాటి నుండి ఎంజి విండ్సర్ అందుకున్న ప్రతిస్పందనతో RAAM MGలో పూర్తి టీమ్ ఆనందపడుతోంది. తన విలక్షణమైన ఉత్పత్తి ప్రతిపాదన ఆకర్షణీయమైన యాజమాన్య ప్యాకేజీలతో ఈవీ మార్కెట్ లో ద ఎంజి విండ్సర్ సంచలనంగా నిరూపిస్తోంది. ఒక్క రోజులో 100 ఈవీలను డెలివరీ చేయడం అనేది చాలా స్వల్ప సమయంలోనే విండ్సర్ జనాదరణ గురించి ఎంతగానో తెలియచేస్తోంది. ఇంకా, 100% రోడ్ పన్ను మినహాయింపును కేటాయించడం ద్వారా ఈవీ కొనుగోళ్లను పెంచడానికి రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల పాలసీ ఈవీలను వేగంగా ఉపయోగించే దిశగా చేపట్టిన వాస్తవికమైన ప్రగతిశీలకమైన చర్య."
ఎంజి విండ్సర్ సిడాన్ సౌకర్యాన్ని ఎస్ యువి విస్తరణను కలిపింది వినూత్నమైన ఏరోడైనమిక్ డిజైన్, విశాలమైన విలాసవంతమైన ఇంటీరియర్లను అందిస్తోంది, భద్రతకు భరోసా కల్పిస్తుంది. స్మార్ట్ కనక్టివిటి, డ్రైవింగ్ సౌకర్యం, ఎన్నో ఇతర హై-టెక్ ఫీచర్లను కూడా కేటాయిస్తోంది. ఇది 'ప్యూరీ ఈవీ ప్లాట్ ఫాం' పైన నిర్మించబడింది విలాసవంతమైన వ్యాపార-తరగతి అనుభవం కూడా కేటాయిస్తోంది. సింగిల్ ఛార్జ్ పై దీనికి ధృవీకరించబడిన 332 కిమీ రేంజ్ ఉంది. ఎంజి విండ్సర్ రూ. 13, 49, 800కి ప్రారంభమవుతోంది (ఎక్స్-షోరూం). సర్వీస్ ప్రోగ్రాంగా విలక్షణమైన బ్యాటరీ ద్వారా, ఇది 9.99 లక్షలుం బ్యాటరీ కిరాయి ఏ?3.5/కిమీకి లభిస్తోంది. ఇంకా మొదటి యజమానికి బ్యాటరీ పై జీవిత కాలం వారంటీని, మూడేళ్లు తరువాత ఖచ్చితంగా 60% బైబ్యాక్ ను, ఎంజి యాప్ ద్వారా %eHUB%ను ఉపయోగిస్తూ పబ్లిక్ ఛార్జర్స్ వద్ద ఏడాది ఉచిత ఛార్జింగ్ ను అందిస్తోంది."ఎంజి విండ్సర్ పరిశ్రమలోనే మొదటిసారి ప్రవేశపెట్టిన ఫీచర్లను కలిగి ఉంది, డ్రైవర్లు ప్రయాణికులు ఇరువురికీ ఒకే విధంగా సౌకర్యం టెక్నాలజీని మెరుగుపరచడానికి రూపొందించబడింది. దీని శ్రేణిలోనే మొదటి ఏరో లౌంజ్ సీట్లు తమ 135ళీ రిక్లైన్ సామర్థ్యంతో సాటిలేని విశ్రాంతిని అందిస్తాయి, విశాలమైన 604- లీటర్ బూట్ స్థలం లగేజీ కోసం కావలిసినంత బూట్ స్థలాన్ని కేటాయిస్తుంది. విండ్సర్ ఐపి 67-చే ధృవీకరించబడిన 38kWh బ్యాటరీని కూడా కలిగి ఉంది, మన్నిక భద్రతలను నిర్థారిస్తోంది, వివిధ డ్రైవింగ్ ప్రాధాన్యతలకు సేవలు అందించడానికి నాలుగు డ్రైవింగ్ మోడ్స్, ఇకోం ఇకో, నార్మల్, స్పోర్ట్ తో జత చేయబడింది. ఇంకా, దీని ఇన్ఫినిటి వ్యూ గ్లాస్ రూఫ్ శ్రేణిలో ఉత్తమమైన వీల్ బేస్ 2700 మీమీ విలాసం బహిరంగదనం భావనను కలిగిస్తుంది, సియువి నుండి కస్టమర్లు ఆశించేది పునర్నిర్వచిస్తోంది.ఎంజి విండ్సర్ స్మార్ట్ కనక్టివిటి ఇన్-కార్ టెక్నాలజీని తన ఎంజి-జియో ఇన్నోవేటివ్ కనక్టివిటి ప్లాట్ ఫాం (ఐసిపి)తో కొత్త స్థాయిలకు తీసుకువెళ్లింది, హోమ్-టు-కార్ ఫంక్షనాలిటి వంటి ఆధునిక ఫీచర్లను 100కి పైగా ఏఐ - మద్దతు గల వాయిస్ కమాండ్స్ ను అందిస్తోంది. డ్రైవర్లు ప్రధానమైన విధులను నియంత్రించవచ్చు బహుళ భారతీయ భాషల్లో సాధారణమైన వాయిస్ కమాండ్స్ ను వినియోగిస్తూ ఇన్ఫోటైన్మెంట్ ను యాక్సెస్ చేయవచ్చు.
సులభంగా వినియోగించడాన్ని మెరుగుపరచవచ్చు. 15.6-అంగుళాల గ్రాండ్ వ్యూ టచ్ డిస్ ప్లే సహజమైన నేవిగేషన్ వినోదాత్మకమైన ఆప్షన్స్ ను అందించడమే కాకుండా, వాహనం స్మార్ట్ వ్యవస్థలతో నిరంతరంగా సమీకృతమవుతుంది. వాస్తవిక సమయం నేవిగేషన్ సహా 80ం కనక్టెడ్ ఫీచర్లు, రిమోట్ వెహికిల్ కంట్రోల్, భద్రతా అలర్ట్స్ సహా, ఎంజి విండ్సర్ ఆధునికమైన, ఇంటిలిజెంట్ డ్రైవింగ్ అనుభవాన్ని నిర్థారిస్తుంది. ద ఇంటిలిజెంట్ సియువి మూడు రకాలలో ఎక్సైట్, ఎక్స్ క్లూజివ్, ఎసెన్స్ లలోబీ నాలుగు రంగులలో లభిస్తోందిబీ స్టార్ బర్స్ట్ బ్లాక్, పెరల్ వైట్, క్లే బీజ్, టర్కాయిష్ గ్రీన్.

# గోల్డ్ లోన్ చెల్లింపుల్లో ఇబ్బందులకు చెక్.. త్వరలో కొత్త విధానం తేనున్న ఆర్‌బీఐ..!



**న్యూఢిల్లీ-నవభూమి:** అత్యవసర పరిస్థితుల్లో చాలామంది ఆర్థిక అవసరాల కోసం బంగారాన్ని తాకట్టుపెట్టి రుణాలు తీసుకుంటారు. ఈ రుణాలు సురక్షితంగా ఉంటాయి. ప్రస్తుతం బంగారం రుణాలను వడ్డీతో కలిపి అసలు కలిపి చెల్లించాల్సిందే. దాంతో చాలామంది వడ్డీతో కలిపి గడువులోగా తిరిగి చెల్లించడం ఇబ్బందికరంగా మారుతున్నది. దాంతో బంగారు ఆభరణాలు వేలానికి వెళ్లే పరిస్థితి నెలకొంది. త్వరలోనే ఈ సమస్యకు పరిష్కారం చూపబోతున్నది రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా. బంగారం ఆభరణాలపై తీసుకునే రుణాలను ఈఎంఐ రూపంలో చెల్లించే సదుపాయాన్ని తీసుకురావాలని యోచిస్తున్నట్లు తెలుస్తున్నది. బంగారు రుణాల మంజూరులో అవకతవకల నేపథ్యంలోనే ఈఎంఐ విధానం అయితే బాగుంటుందని ఆర్‌బీఐ భావించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.
వాస్తవానికి, బంగారు ఆభరణాలపై రుణాలు ఇవ్వడంలో చాలా అక్రమాలు జరుగుతున్నాయని సెప్టెంబర్ 30న ఆర్బీఐ సర్క్యులర్‌లో పేర్కొంది. బంగారంపై రుణాలు అందించే సంస్థల పనితీరులో అవకతవకలు జరిగినట్లు ఆర్‌బీఐ గుర్తించింది. రుణాల సోర్సింగ్, మదింపు కోసం ఉపయోగించే థర్డ్ పార్టీల్లో అనేక లోపాలు ఉన్నాయనే ఆరోపణలున్నాయి. ఆభరణాల వేలంలోనూ పారదర్శకత లేదనే విమర్శలు ఉన్నాయి. ఇదిలా ఉండగా.. ఇటీవల గోల్డ్ రుణాల్లో భారీగానే వృద్ధి ఉందని రేటింగ్ ఏజెన్సీ ఐసీఆర్ఏ అభిప్రాయపడింది. వ్యవస్థీకృత రుణదాతల పోర్ట్‌ఫోలియో మార్చి 2025 నాటికి రూ.10 లక్షల కోట్లకు చేరుకుంటుందని అంచనా. సెప్టెంబర్ 30 నాటికి బ్యాంకుల ఆభరణాల రుణాలు 51 శాతం పెరిగి రూ.1.4 లక్షల కోట్లకు చేరినట్లు ఆర్‌బీఐ గణాంకాలు పేర్కొన్నాయి.

## పసిడి రుణాలకూ ఈఎంఐ!



**న్యూఢిల్లీ-నవభూమి:** బంగారం తాకట్టుపై తీసుకునే రుణాలను నెలవారీ వాయిదా (ఈఎంఐ)ల్లో చెల్లించే అవకాశం అందుబాటులోకి రానుంది. ప్రస్తుతం గృహ, వాహన, వ్యక్తిగత రుణాలకు మాత్రమే ఈ సదుపాయం ఉంది. ఈ రుణాలు తీసుకోవాలంటే బ్యాంకుల నుంచి సవాలక్ష ప్రశ్నలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. అంతేకాదు, క్రెడిట్ స్కోర్, నెలవారీ ఆదాయం ఇతరత్రా అన్నింటిని పరిశీలించిన తర్వాతే అవి రుణాలను మంజూరు చేస్తున్నాయి. అయితే ఇలాంటి చిక్కులు లేకుండా మన దగ్గర ఉన్న బంగారాన్ని తాకట్టు పెట్టి తీసుకునే రుణాలను నెలవారీ వాయిదాల్లో చెల్లించే సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చేందుకు బ్యాంకులు, నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీలు (ఎన్‌బీఎఫ్‌సీ) సన్నాహాలు చేస్తున్నాయి. కాగా ఇప్పటి వరకు బంగారం తాకట్టుపై తీసుకునే రుణాలకు వడ్డీని మాత్రం నెలనెలా చెల్లిస్తే సరిపోతుంది. అది కూడా తప్పనిసరేం కాదు. రుణ కాలపరిమితి ముగిసే నాటికి అసలు, వడ్డీని ఒకేసారి చెల్లించి కూడా తనఖా బంగారాన్ని విడిపించుకోవచ్చు. కానీ, కొందరు రుణగ్రహీతలు తీసుకున్న అప్పును మొత్తం ఒకేసారి చెల్లించడం భారమై తాకట్టు పెట్టిన బంగారాన్ని విడిపించుకోలేని పరిస్థితి.ఈ రుణాన్ని ఒకేసారి తీర్చలేని వారికి ఈ విధానం మేలు చేస్తుందని బ్యాంకింగ్ వర్గాలు భావిస్తున్నాయి. ఇందులో భాగంగానే గృహ, వాహన, వ్యక్తిగత రుణాల్లగే బంగారం తాకట్టు పెట్టి తీసుకున్న అప్పును కూడా అసలు, వడ్డీ కలిపి నెలవారీ వాయిదా పద్ధతుల్లో చెల్లించే వెసులుబాటు కల్పించాలని బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు యోచిస్తున్నాయి. అలాగే, బంగారం తాకట్టుపై టర్మ్ లోన్ మంజూరు ఆలోచన కూడా ఉన్నట్లు తెలిసింది.
ఆర్‌బీఐ ఆందోళన నేపథ్యంలోనే..పసిడి రుణాల మంజూరులో బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు అనుసరిస్తున్న అనుచిత విధానాలపై ఈ ఏడాది సెప్టెంబరు 30న భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) ఆందోళన వ్యక్తం చేసింది. ఈ రుణాల సోర్సింగ్, తాకట్టు బంగారం విలువ మదింపు, తనిఖీ ప్రక్రియ, పర్యవేక్షణ, బంగారం వేలం, లోన్ టు వాల్యూ (ఎల్‌టీవీ) రేషియో, రిస్క్ వెయిటేజీ అంశాల్లో లోపాలను ఎత్తి చూపింది. అంతేకాదు, రుణగ్రహీతలు తాకట్టు పెట్టే బంగారంపైనే ఆధారపడకుండా వారి తిరిగి చెల్లింపుల సామర్థ్యాన్నీ పరిశీలించాలని రుణదాతలను ఆర్‌బీఐ ఆదేశించింది. పాక్షిక చెల్లింపులపై రుణ కాలపరిమితి రెన్యువల్‌నూ ఆర్‌బీఐ తప్పుపట్టింది. ఈ నేపథ్యంలోనే తాము బంగారం తనఖా రుణాలకూ నిర్దేశిత గడువుతో కూడిన ఈఎంఐ ప్రణాళికలను ఏర్పాటు చేస్తున్నామని సీనియర్ బ్యాంకింగ్ అధికారి పేర్కొన్నారు.

**రూ.1.4 లక్షల కోట్ల రుణాలు**

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబరు 30తో ముగిసిన ద్వితీయ త్రైమాసికం నాటికి బ్యాంకుల బంగారం తనఖా రుణాల మంజూరు వార్షిక ప్రాతిపదికన 51 శాతం వృద్ధితో రూ.1.4 లక్షల కోట్లకు చేరుకుంది. గత ఏడాదిలో ఇదే కాలానికి ఈ రుణాల వృద్ధి 14.6 శాతంగా నమోదైంది. గడిచిన ఏడాది కాలంలో బంగారం ధర భారీగా పెరగడంతో ఈ విభాగ రుణాలకూ డిమాండ్ అనూహ్యంగా పెరిగిందని మార్కెట్ వర్గాలు పేర్కొన్నాయి. దేశీయ రేటింగ్ ఏజెన్సీ క్రిసిల్ నివేదిక ప్రకారం.. ఈ ఏప్రిల్-ఆగస్టు మధ్యకాలంలో బ్యాంకుల బంగారం రుణాల మంజూరు 37 శాతం వృద్ధి చెందగా.. గోల్డ్ లోన్ కంపెనీల రుణ ఆస్తులు 11 శాతం పెరిగాయి.

# హైదరాబాద్ ఆఫీస్‌కు గిరాకీ నై



**న్యూఢిల్లీ-నవభూమి:** హైదరాబాద్ రియల్ ఎస్టేట్ పరుగులకు బ్రేక్ పడిందా?.. సుమారు దశాబ్దకాలం కనిపించిన డిమాండ్ ఇప్పుడు కనుమరుగైపోతున్నదా?.. అంటే అవుననే సమాధానాలే వినిపిస్తున్నాయి. కన్సల్టెన్సీ ఏదైనా.. చెప్పేది మాత్రం ఒక్కటే. అదే.. హైదరాబాద్ నిర్మాణ రంగంలో నిస్తేజం ఆవరిస్తున్నదని. ప్రముఖ రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ వెస్టియన్ విడుదల చేసిన తాజా నివేదిక సైతం ఇదే చెప్తున్నది. మంగళవారం వచ్చిన ఈ రిపోర్టు.. హైదరాబాద్‌లోని ఆఫీస్ స్పేస్‌కు గిరాకీ అంతంతమాత్రంగానే ఉన్నట్టు తేల్చింది. ఈ ఏడాది జూలై-సెప్టెంబర్ త్రైమాసికంలో మార్కెట్‌లోకి కొత్తగా అందుబాటులోకి వచ్చిన ఆఫీస్ స్పేస్ గతంతో చూస్తే 25 శాతం తగ్గినట్టు పేర్కొన్నది. 4.1 మిలియన్ చదరపు అడుగులకే పరిమితమైనట్టు స్పష్టం చేసింది. అలాగే ఇదే సమయంలో లీజింగ్ కార్యకలాపాలు సైతం 25 శాతం క్షీణించి 2.79 మిలియన్ చదరపు అడుగుల వద్దే ఉన్నట్టు వెల్లడైంది.

**రివర్స్ గేర్‌లో..**

దేశవ్యాప్తంగా కార్పొరేట్ కంపెనీలకు తమ కార్యాలయాల ఏర్పాటుకు ముందు గుర్తొచ్చేది హైదరాబాద్. ఒకప్పుడు బెంగళూరు, ముంబైలకు ఈ ఘనత దక్కినా.. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుతో సుమారు పదేండ్లపాటు అప్పటి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు, అందించిన సహకారంతో ఆ నగరాల స్థానంలోకి హైదరాబాద్ వచ్చి చేరింది. ఐటీ, ఐటీ అనుబంధ రంగాలు, ఫార్మా, బయోసైన్స్, ఏవియేషన్, డాటా సెంటర్లు ఇలా అన్నింటికీ హైదరాబాదే ప్రధాన కేంద్రంగా విరాజిల్లింది. కానీ ఇప్పుడు ఆ ఉత్సాహం సన్నగిల్లింది. హైదరాబాద్‌లో ఆఫీస్ స్పేస్‌ను లీజుకు తీసుకొనేందుకు ఎవరూ పెద్దగా ఆసక్తి చూపడం లేదు. దీంతో ఆఫీస్ స్పేస్ సైప్లె కూడా అందుకు తగ్గట్టుగానే తగ్గుతూ వస్తున్నది. దీనిపై రియల్టీ వర్గాల్లో ఆందోళనలు పెరుగుతున్నాయి.

**ఢిల్లీ, బెంగళూరుల్లో..**

ఓ వైపు హైదరాబాద్‌లో కొత్తగా వచ్చే ఆఫీస్ స్పేస్ క్షీణిస్తుంటే.. మరోవైపు బెంగళూరు, ఢిల్లీల్లో అది పెరుగుతూపోవడం గమనార్హం. ఈ జూలై-సెప్టెంబర్‌లో బెంగళూరులో అందుబాటులోకి వచ్చిన నూతన ఆఫీస్ స్పేస్ 3.6 మిలియన్ చదరపు అడుగులు. గతంతో పోల్చితే 33 శాతం ఎక్కువ. అలాగే ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లోనూ 2.3 మిలియన్ చదరపు అడుగులకు ఎగిసింది. మునుపటితో చూస్తే ఇది ఏకంగా 360 శాతం పెరగడం విశేషం. ముంబైలో 0.90 మిలియన్ చదరపు అడుగులతో యథాతథంగా కొత్త ఆఫీస్ స్పేస్ సరఫరా ఉన్నది. చెన్నైలో స్వల్పంగా తగ్గగా, కోల్‌కతాలో ఏ-గ్రేడ్ ఆఫీస్ స్పేస్ సైప్లెనే లేదని వెస్టియన్ చెప్పింది. పుణెలో మాత్రం 26 శాతం తరుగుదల కనిపించింది. దీంతో హైదరాబాద్‌సహా దేశంలోని ఈ ఏడు ప్రధాన నగరాల్లో ఓవరాల్‌గా మార్కెట్‌లోకి కొత్త ఆఫీస్ స్పేస్ రాక 4 శాతం పడిపోయి జూలై-సెప్టెంబర్‌లో 12.8 మిలియన్ చదరపు అడుగులుగా నమోదైనట్టు వెస్టియన్ ఈ సందర్భంగా స్పష్టం చేసింది.

**లీజింగ్‌లో..**

ఈ జూలై-సెప్టెంబర్‌లో బెంగళూరులో లీజింగ్ కార్యకలాపాలు 84 శాతం ఎగిసి 6.63 మిలియన్ చదరపు అడుగులకు చేరుకున్నాయి. పుణెలో 112 శాతం పెరిగి 2.33 మిలియన్ చదరపు అడుగులుగా నమోదైంది. చెన్నైలో లీజింగ్ కార్యకలాపాలు యథాతథంగానే ఉండగా, ముంబైలో స్వల్ప క్షీణత కనిపించింది. ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో 17 శాతం, కోల్‌కతాలో 45 శాతం తగ్గాయి. ఇక బ్యాంకింగ్, ఫైనాన్స్ సర్వీసెస్, ఇన్సూరెన్స్ రంగాల్లో డిమాండ్ ఉన్నట్టు వెస్టియన్ చెప్తున్నది.

# హైదరాబాద్ ఇన్‌ఫ్రా, రియల్టీ అదుర్స్

**న్యూఢిల్లీ-నవభూమి:** దేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో హైదరాబాద్ అగ్రస్థానంలో నిలిచింది. పాలనా సౌలభ్యం, ఆర్థిక-సామాజిక పరిస్థితులు, స్థిరాస్తి (రియల్టీ), మౌలిక సదుపాయాలు ఇందుకు కలిసి వస్తున్నాయని రియల్ ఎస్టేట్ కన్సల్టెన్సీ సంస్థ నైట్ ఫ్రాంక్ ఇండియా ఒక నివేదికలో ఈ విషయం తెలిపింది. దీనికి సంబంధించి ఇండియా ప్రైమ్ సిటీ ఇండెక్స్ పేరుతో నివేదిక విడుదల చేసింది. హైదరాబాద్‌లో పెరుగుతున్న నయా సంపన్నుల జనాభా కూడా ఇందుకు దోహదం చేస్తోందని ఆ నివేదిక తెలిపింది.మౌలికమే దన్ను: హైదరాబాద్‌లో ఐటీ, టెక్నాలజీ కంపెనీలు ఇప్పటికే బలంగా వేళ్లూనుకున్నాయి. ఓఆర్ఆర్, మెట్రో రైల్ విస్తరణతో వివిధ ప్రాంతాల మధ్య అనుసంధానత, ఆర్థిక కార్యకలాపాలు పెరిగాయి. ప్రభుత్వ సానుకూల విధానాలు ఇందుకు తోడయ్యాయి. దీనికి తోడు ముంబై, ఢిల్లీ-ఎన్‌సీఆర్‌తో పోలిస్తే నగరంలో ఇళ్ల ధరలు తక్కువగా ఉన్నాయి.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
7 హైదరాబాద్ గురువారం 21 నవంబర్ 2024



# ఢిల్లీ డేంజర్



**న్యూఢిల్లీ/లఖ్‌నవూ-నవభూమి:** దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం రోజురోజుకూ పెరుగుతోంది. విజిబులిటీ స్థాయులు దారుణంగా పడిపోతున్నాయి. గాలి నాణ్యత(ఏక్యూఐ) కూడా కొన్ని చోట్ల 500 మార్కును దాటింది. సగటు గాలి నాణ్యత 494గా ఉంది. ప్రపంచంలోనే అత్యంత కాలుష్య నగరంగా ఢిల్లీ రికార్డుకెక్కింది. ఎంతలా అంటే.. రెండో స్థానంలో ఉన్న బంగ్లాదేశ్ రాజధాని ఢాకాతో పోలిస్తే.. ఢిల్లీలో 4 రెట్ల అధిక కాలుష్యం కొనసాగుతోంది. దీనిపై కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ ఎక్స్‌లో తీవ్రంగా స్పందించారు. "ఇలాంటి పరిస్థితుల్లో కూడా దేశ రాజధానిగా ఢిల్లీ కొనసాగాల్సిన వసరం ఉందా?" అని ప్రశ్నించారు. "ఈ విపత్కర పరిస్థితిని కొన్నేళ్లుగా చూస్తున్నాం. నవంబరు-జనవరి నెలల మధ్య అసలు ఈ నగరం నివాసయోగ్యంగానే ఉండడం లేదు. మిగతా సమయాల్లోనూ జీవనం కొనసాగించడం అంతంతమాత్రమే..! ఈ పరిణామాల మధ్య ఢిల్లీని ఇంకా రాజధానిగా కొనసాగించాలా?" అంటూ ట్వీట్ చేశారు. కాగా.. వాయు కాలుష్య తీవ్రత, విజిబులిటీ దారుణంగా ఉండడంతో ఢిల్లీలో 22 రైళ్లు ఆలస్యంగా ప్రారంభమయ్యాయి.గాలి నాణ్యత పశ్చిమ ఉత్తరప్రదేశ్‌లోనూ దారుణంగా తయారైంది. మంగళవారం ఉదయం నోయిడాలో ఈస్టర్న్-పెరిఫెరల్ ఎక్స్‌ప్రెసవేపై వాహనాలు వరుసగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఇద్దరు ద్విచక్రవాహనదారులు మృతిచెందగా.. డజన్ల కొద్దీ వాహనదారులు గాయపడ్డారు.

## రష్యాపై ఉక్రెయిన్ క్షిపణి దాడి.. పుతిన్ ప్రతీకార దాడి చేయించేనా..?



**న్యూయార్కు-నవభూమి:** పాశ్చాత్య దేశాలు సరఫరా చేసిన క్షిపణులను ఉపయోగించి ఉక్రెయిన్ ప్రభుత్వం రష్యాపై తొలి దాడి చేసింది. రష్యాపై లాంగర్ రేంజ్ క్షిపణులను ప్రయోగించేందుకు అమెరికా అధ్యక్షుడు బైడెన్ ఉక్రెయిన్‌కు అనుమతి ఇచ్చారు. బైడెన్ అనుమతి ఇచ్చిన 24 గంటల్లోనే ఉక్రెయిన్ ప్రభుత్వం పాశ్చాత్య దేశాలు సరఫరా చేసిన క్షిపణులను ఉపయోగించి రష్యా సరిహద్దులపై తొలి దాడికి పాల్పడింది.

దాంతో రష్యా త్వరలో ప్రతీకారం తీర్చుకోవచ్చనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఎందుకంటే రష్యాపై ఉక్రెయిన్ నాటో దళం పంపిన క్షిపణిని ప్రయోగించింది. ఇది తనపై పరోక్షంగా నాటో దాడిగా రష్యా భావిస్తే పరిస్థితి చేయి దాటిపోతుంది. అణ్వాయుధ రహిత దేశాలపై అణ్వాయుధాల ప్రయోగానికి రష్యా అధ్యక్షుడు పుతిన్ ఇవాళే ఆమోదం తెలిపారు. దాంతో ఉక్రెయిన్ సహా అణ్వాయుధరహిత దేశాలపై అణ్వాయుధాలను ప్రయోగించాలని ప్రయోగించేందుకు రష్యా సైన్యానికి అనుమతి లభించింది.దీనంతటికీ కారణం ఒక విధంగా అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ అని చెప్పవచ్చు. జో బైడెన్ చేసిన తప్పిదం వల్ల ప్రపంచ స్థాయిలో అణుయుద్ధం వచ్చే ప్రమాదం పొంచి ఉంది. అమెరికా తీసుకున్న నిర్ణయం మనం నాటోతో ప్రత్యక్ష యుద్ధంలో ఉన్నామని తెలియజేస్తోందని పుతిన్ ఇప్పటికే తన కార్యవర్గంతో అన్నారు. ఇప్పుడు బైడెన్ నిర్ణయంతో ఉక్రెయిన్ క్షిపణి దాడికి పాల్పడటం రష్యాకు మరింత ఆగ్రహం తెప్పిస్తోంది.

## పాక్‌కు భారీ షాక్ ఇచ్చిన యూఏఈ..




### ఆ దేశ పౌరులకు వీసాలు బంద్..!

**దుబాయి-నవభూమి:**యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ కీలక నిర్ణయం తీసుకున్నది. పాక్ పౌరులకు వీసాలు ఇవ్వడాన్ని నిలిపివేసింది. దాంతో పాక్ పౌరులు, యూఏఈకి వెళ్లేందుకు వీసా సమస్యలను ఎదుర్కొంటున్నారు. పాకిస్థాన్ సెలబ్రిటీలు, వ్యాపారవేత్తలు సైతం యూఏఈ వీసాలు అందక ఇబ్బందులు పడుతున్నట్లుగా యూఏఈలోని పాకిస్థాన్ రాయబారి ఫైసల్ నియాజ్ తిర్మిజీ సైతం అంగీకరించారు. తమకు యూఏఈ వీసాలు రావడం లేదని పాకిస్థాన్‌లోని సామాన్యులు సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. ఈ క్రమంలో యూఏఈలోని పాకిస్థాన్ ఎంబసీ తన ఎక్స్ (ట్విట్టర్) ఖాతా నుంచి ఓ వీడియోను పోస్ట్ చేసింది. పాక్ రాయబారి ఫైసల్ నియాజ్ తిర్మిజీ మాట్లాడుతూ పాకిస్థానీలకు వీసాల జారీలో సమస్యలను పరిష్కరించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు.వీసాలు తీసుకువాలంలో రిటర్న్ టికెట్లతో పాటు హొటల్ బుకింగ్స్, 3వేల దిర్హామ్‌లు ఉండాలి. వాస్తవానికి పాక్ పౌరులు యూఏఈకి వెళ్తూ వీసా నిబంధనలు ఉల్లంఘిస్తున్నారు. నకిలీ పత్రాలతో ప్రయాణించడంతో పాటు యూఏఈలో నేర కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లుగా ఆరోపణలున్నాయి. ఆయా అంశాల ఆధారంగా పాకిస్థాన్ పౌరులపై నిషేధం విధించాలని యూఏఈ కేబినెట్ ప్రతిపాదించింది. ఈ విషయాన్ని పాక్ రాయబార కార్యాలయం ఇస్లామాబాద్‌కి అధికారికంగా సమాచారం ఇచ్చింది. ఇందులో పాకిస్థానీ జాతీయులు రాజకీయ కార్యకలాపాల్లో పాల్గొనడం.. దేశంలోని నిరసనలు చేయడం ఎమిరాటీ చట్టాలను ఉల్లంఘించడమేనని యూఏఈ అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.యూఏఈ ప్రభుత్వ విధానాలను విమర్శిస్తూ కొందరు సోషల్ మీడియా వేదికగా పాకిస్థానీలు చేసిన పెట్టిన పోస్టులు దీనికి మరింత ఆజ్యం పోశాయి. నకిలీ డిగ్రీలు, ఫేక్ గుర్తింపు కార్డులు, పాస్‌పోర్ట్‌లకు సంబంధించి కేసులు నమోదయ్యాయి. ఇతర ప్రవాస దేశీయులతో పోలిస్తే దొంగతనాలు, మోసం, భిక్షాటన, వ్యభిచారం, మాదకద్రవ్యాల సంబంధిత నేర కార్యకలాపాల్లో పాకిస్థాన్ జాతీయుల ప్రమేయం ఎక్కువగా ఉందని అధికారులు పేర్కొంటున్నారు. భద్రతతో పాటు యూఏఈ జీరో టాలెర్స్ విధానం ఈ సమస్యల తీవ్రతను నొక్కి చెబుతుందని.. ఆయా అంశాలపై కేబినెట్‌లో చర్చించి.. పాకిస్థానీ పౌరులకు వీసాలపై ఆంక్షలు విధించినట్లు యూఏఈ పేర్కొంది.



## 45 నిమిషాలు ఆగిన గుండె

**హ్యూస్టన్-నవభూమి:** అమెరికాలో అరుదైన సంఘటన జరిగింది. 45 నిమిషాల పాటు గుండె ఆగిపోయిన తర్వాత ఓ మహిళ మళ్లీ ఊపిరి తీసుకొని మృత్యుంజయురాలిగా నిలిచింది. టెక్సాస్‌లోని హ్యూస్టన్‌కు చెందిన మారిసా క్రిస్టీ అనే మహిళ గర్భవతి. ఆగస్టు 21న విడ్‌లాండ్స్ మెడికల్ సెంటర్‌లో సీ-సెక్షన్ ద్వారా ముగ్గురు శిశువులకు జన్మనిచ్చింది.డెలివరీ తర్వాత ఒక్కసారిగా ఆమె ఆరోగ్యం విషమించి స్పృహ కోల్పోయింది. ఆమె గుండె ఆగిపోయిందని, ఊపిరి తీసుకోవడం లేదని గుర్తించిన వైద్యులు వెంటనే సీపీఆర్ ప్రారంభించారు. యంత్రం ద్వారా కృత్రిమంగా రక్తాన్ని పంపింగ్ చేశారు.వైద్యులు తీవ్రంగా శ్రమించిన తర్వాత 45 నిమిషాలకు మళ్లీ ఆమె గుండె కొట్టుకోవడం ప్రారంభించింది. వారం పాటు ఎక్మోపైన చికిత్స అందించిన తర్వాత

# టవల్‌తో పబ్లిక్‌లో మోడల్ డ్యాన్స్.. పిచ్చి పీక్స్ వీడియో!



**న్యూఢిల్లీ-నవభూమి:**ఇటీవల కాలంలో సోషల్ మీడియాలో పోస్ట్ చేసుకోవడం కోసం కొంతమంది యువత చేస్తున్న రచ్చ అంతా ఇంతా కాదనే సంగతి తెలిసిందే. ఈ విషయంలో అబ్బాయిలు, అమ్మాయిలు అనే తారతమ్యాలేవీ లేవు. ఎవరి స్థాయిలో వారు రెచ్చిపోతున్నారు! ఈ సమయంలో తాజాగా ఓ మోడల్.. పబ్లిక్ ప్లేస్‌లో ఓ టవల్ మాత్రమే ధరించి డ్యాన్స్ చేసింది!

అవును... సోషల్ మీడియా మాయలో కొంతమందికి పిచ్చి పీక్స్‌కి వెళ్లిపోతుందనే కామెంట్లు ఇటీవల బలంగా వినిపిస్తున్న సంగతి తెలిసిందే. వీటికి బలం చేకూరుస్తూ అన్నట్లుగా... తాజాగా కోల్ కతా మోడల్ ఢిల్లీలోని ఇండియా గేట్ ముందు పబ్లిక్ అంతా చూస్తుండగా.. తెల్లటి టవల్ మాత్రమే చుట్టుకుని డ్యాన్స్ చేసింది!ఈ సమయంలో... బాలీవుడ్ సినిమా దిల్ వాలే దుల్హానియా లే జాయేంగే పాటకు పెదవి సింక్ చేస్తూ తెల్లటి టవల్ ధరించి, చెప్పులు వేసుకుని డ్యాన్స్ చేస్తూ కనిపించింది. ఆ ప్రాంతంలో పిల్లలతో సహా పెద్ద సంఖ్యలో పర్యాటకుల గుంపు ఉంది. దీనికి సంబంధించిన వీడియోను ఇన్ స్టాగ్రామ్ లో షేర్ చేసింది. ఇప్పుడు ఈ వీడియో వైరల్ గా మారింది.ఈ వీడియోతో పాటు.. అంతర్జాతీయ పురుషుల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపింది. ఈ సందర్భంగా మీరంతా ధైర్యం, దయ, సానుభూతితో ప్రేరేపించడం కొనసాగించండి అంటూ రాసుకొచ్చింది.

ఇక ఈ వీడియోకి సంబంధించిన కామెట్స్ లో విభిన్నంగా స్పందిస్తున్నారు నెటిజన్లు.ఇందులో భాగంగా... "స్వతంత్ర దేశంలో మీరు ఏమైనా చేయొచ్చు కానీ... మెమోరియల్ ముందు కాదు" అని ఒకరు కామెంట్ చేస్తే... "ఆమెను అరెస్ట్ చేసి కనీసం మూడేళ్లు జైలులో ఉంచండి!" అని మరొకరు స్పందించారు.

## యూఎస్ సభలో ట్రాన్స్ జెండర్ ఏ బాత్ రూమ్‌లోకి వెళ్లాలి?



**న్యూయార్కు-నవభూమి:** ఇటీవల అత్యంత ఆసక్తికరంగా జరిగిన అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ఓ ఆసక్తికర పరిణామం చోటు చేసుకున్న సంగతి తెలిసిందే! ఇందులో భాగంగా... డెలవేర్ లోని ఎట్ లర్జ్ హౌస్ డిస్ట్రిక్ట్ నుంచి డెమొక్రటిక్ అభ్యర్థిగా పోటీ చేసిన సారా మెక్ బ్రైడ్ విజయం సాధించారు. దీంతో... కాంగ్రెస్ కు ఎన్నికైన తొలి ట్రాన్స్ జెండర్ గా గుర్తింపు తెచ్చుకున్నారు. ఎల్.జీ.బీ.టీ.క్యూ. జాతీయ కార్యకర్తగా వ్యవహరిస్తూ.. ఎన్నికల సమయంలో సుమారు 3 మిలియన్ డాలర్లకు పైగా ప్రచార విరాళాలు సేకరించి.. ఘన విజయం సాధించిన సారా.. వచ్చే ఏడాది జనవరిలో ప్రమాణస్వీకారం చేయనున్నారు. అయితే... క్యాపిటల్ భవనంలో ఆమె ఏ బాత్ రూమ్ వినియోగించుకోవాలి అనేది ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. అవును... క్యాపిటల్ భవనంలో మహిళల బాత్ రూమ్ వినియోగించుకునేందుకు సారా మెక్ బ్రైడ్‌కు వీల్లేకుండా ఓ తీర్మానం తీసుకొచ్చేందుకు రిపబ్లికన్లు సిద్ధమవుతున్నారనే విషయం ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. దీంతో.. సంకుచిత మనస్థత్వాలు, వివక్ష చూపించే ఆలోచనలకు అగ్రరాజ్యం ప్రజలూ అతీతులు కాదన్నమాట అనే చర్చ తెరపైకి వచ్చింది. ఇలా.. డెమొక్రటిక్ సభ్యురాలు, ట్రాన్స్ జెండర్ సారా మెక్ బ్రైడ్ ను మహిళల బాత్ రూమ్ లోకి అనుమతించబోమని రిపబ్లికన్లు చెబుతుండగా.. దీన్ని ప్రతినిధుల సభ స్పీకర్ మైక్ జాన్సన్ కూడా సమర్థించారని అంటున్నారు. పురుషులను స్త్రీల టాయిలెట్స్ లోకి అనుమతించబోమంటూ ఆయన తీర్మానంపై సంకేతాలిచ్చారట. దక్షిణ కరోలినా నుంచి ఎన్నికైన రిపబ్లికన్ నేత నాన్సీ మేస్ ఈ తీర్మానాన్ని ప్రతిపాదించినట్లు అమెరికా మీడియా కథనాలు పేర్కొన్నాయి. అయితే... ఈ చర్యను సారా మెక్ బ్రైడ్ తీవ్రంగా ఖండించారు. డైవర్షన్ పాలిటిక్స్ లో భాగంగానే ఇలాంటి వివాదాలు సృష్టించి బెదిరింపులకు పాల్పడుతున్నారని దుయ్యబట్టారు. కాగా... ట్రాన్స్ జెండర్ల బాత్ రూమ్ ల విషయంలో అమెరికాలో గత కొంతకాలంగా చర్చ జరుగుతూనే ఉంది. ఈ క్రమలో పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో మహిళ బాత్ రూమ్ లను ట్రాన్స్ జెండర్ మహిళలు వినియోగించకుండా ఇప్పటికే 10కి పైగా రాష్ట్రాలు చట్టాలు తీసుకొచ్చాయి! దీంతో... సభా సమయంలో సారా ఏ బాత్ రూమ్ వినియోగించాలనేది ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది.

## రష్యా దగ్గర 'డెడ్ హ్యాండ్' ఉంది.. అమెరికా జాగ్రత్త..



**న్యూఢిల్లీ-నవభూమి:**రెండున్నరేళ్లకు పైగా సాగుతున్న రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ఇప్పుడు ప్రపంచ యుద్ధంగా మారే ప్రమాదం అంచున ఉంది.. ఉక్రెయిన్ కు అందించిన దీర్ఘ శ్రేణి క్షిపణులను రష్యా భూభాగంపైకి ప్రయోగించేందుకు అమెరికా అనుమతివ్వడంతో పరిస్థితి అణు యుద్ధం వరకు వచ్చింది. దీంతో నాటో దేశాలు మరీ ముఖ్యంగా కొత్తగా చేరిన ఫిన్లాండ్, స్వీడన్ వణికిపోతున్నాయి. ఇక ఉక్రెయిన్ సైతం అమెరికా నుంచి అనుమతి వచ్చిందే ఆలస్యం.. రష్యాపైకి ఆరు దీర్ఘశ్రేణి క్షిపణులను ప్రయోగించేసింది. ఇంత జరుగుతుంటే రష్యా అధ్యక్షుడు పుతిన్ చూస్తూ ఊరుకుంటారా? గట్టిగా బదులు తీర్చుకునేందుకు ఏదైనా చేయడం ఆయన నైజం. అందుకే ప్రపంచం యావత్తూ ఉత్కంఠంగా ఉంది. అప్పట్లో సూపర్ పవర్ ఇప్పుడంటే రష్యా కాస్త తక్కువగా కనిపిస్తోంది కానీ.. ఒకప్పుడు అంటే.. యునైటెడ్ సోవియట్ సోషలిస్ట్ రష్యా (యూఎస్ఎస్ఆర్)గా ఉన్నప్పుడు దాని సత్తా ఏమిటో అందరికీ తెలిసిందే. ఉక్రెయిన్ సహా యూఎస్ఎస్ఆర్ నుంచి విడిపోయిన 15 దేశాల్లో కొన్ని దేశాలు భూభాగంలో చాలా పెద్దవి. అయినప్పటికీ రష్యా ఇప్పటికీ ప్రపంచంలోనే అతి పెద్ద దేశం. 1.72 లక్షల కోట్ల చదరపు కిలోమీటర్ల వైశాల్యంతో భారత్ కు ఐదు రెట్లు ఉంటుంది రష్యా. దాదాపు రెండు అమెరికాల వైశాల్యం అంత అనుకోవాల. కాగా, రెండో ప్రపంచ యుద్ధం అనంతరం అమెరికా, యూఎస్ఎస్ఆర్ మధ్య ప్రచ్ఛన్న యుద్ధం జరిగి.. ప్రపంచంలోని దేశాలన్నీ చెరోవైపు నిలిచిన సంగతి తెలిసిందే. అయితే, 1990ల మొదట్లో యూఎస్ఎస్ఆర్ విచ్ఛిన్నం కావడంతో ప్రచ్ఛన్న యుద్ధానికి తెరపడింది. అమెరికా బలపడింది.. రష్యా కుదేలైంది యూఎస్ఎస్ఆర్ విచ్ఛిన్నం అనంతరం రష్యా అనేక ఒడిదొడులకు లోనైంది. ఓ దశలో ప్రపంచంలో ఒంటరిగా మిగిలింది. అదే సమయంలో అమెరికా ఏకైక సూపర్ పవర్ గా ఎదిగింది. దీంతో రష్యాను సాధారణ దేశంగా పరిగణించడం మొదలుపెట్టారు. అయితే, ఎప్పుడైతే అత్యంత బలవంతుడైన, గట్టి నిర్ణయాలు తీసుకోగల పుతిన్ శకం ప్రారంభమైందో అప్పట్నుంచి రష్యా మళ్లీ గాడిన పడింది. ఒకప్పటి స్థాయిలో కాకున్నా.. అమెరికా వ్యతిరేక శక్తులైన చైనా, ఉత్తర కొరియా, ఇరాన్ తదితర దేశాలను కలుపుకొని అమెరికాను సవాల్ చేయగల స్థితికి వచ్చింది. భద్రతా సమస్య తలెత్తితే.. అమెరికా అధ్యక్షుడు ఎక్కడికైనా వెళ్తే ఎంత భద్రత ఉంటుందో అందరికీ తెలిసిందే. చీమ చిటుక్కుమన్నా పసిగట్టే కమాండోలు విధుల్లో ఉంటారు. అయితే, రష్యా అధ్యక్షుడికీ అదే స్థాయిలో భద్రత ఉంటుందనే భావించాలి. కాగా, ఇప్పుడు ఉక్రెయిన్ పై రష్యా సాగిస్తున్న యుద్ధంలో దీర్ఘ శ్రేణి క్షిపణుల వాడకానికి ఉక్రెయిన్ కు అమెరికా అనుమతి ఇవ్వడంతో పరిస్థితి ఎక్కడకు వెళ్తుందో తెలియని పరిస్థితి. ఆ డెడ్ హ్యాండ్ ప్రపంచాన్నే అంతం చేయగలదు వ్యాపారుల చందా రష్యా-ఉక్రెయిన్ యుద్ధం తీవ్రమై అమెరికా నేరుగా రంగంలోకి దిగితే..? ఈ క్రమంలో పుతిన్ సహా రష్యా అగ్ర నాయకత్వాన్ని నాటో కూటమిలోని పాశ్చాత్య దేశాలు హతమారిస్తే? ఇదంతా జరగాలని కాదు కానీ.. ఒకవేళ జరిగితే...? అప్పుడు అది ప్రపంచానికే పెను ప్రమాదం అని చెప్పాలి. ఎందుకంటే రష్యా వద్ద డెడ్ హ్యాండ్ (పెరీమీటర్) అనే వ్యవస్థ ఉంది. ప్రపంచాన్ని అంతం చేయగల సత్తా దీని సొంతం అట. బలగాలన్నీ తుడిచిపెట్టుకుపోయినా అమెరికా, నాటో కూటమి దాడిలో తమ బలగాలన్నీ తుడిచిపెట్టుకుపోయినా.. రష్యా అధికారి ఎవరైనా ఒక్కరు పెరీ మీటర్ ను ఆపరేట్ చేస్తే చాలట.. రష్యా వద్ద ఉన్న అణ్వాయుధాలు మొత్తం శత్రు దేశాల మీదకు దూసుకెళ్తాయి. దీనికి కారణం ఏమంటే.. "మనమే పోయే పరిస్థితి వస్తే.. మనతో పాటు అందరూ పోవాలి" అనే సూత్రంతో సోవియట్ యూనియన్ కాలంలో ఈ వ్యవస్థను రూపొందించారట. అణు పెద్దన్న రష్యానే.. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత అణు బాంబు దాడి విపరిణామాలు ఎలా ఉంటాయో అందరూ చూశారు. ఆ తర్వాత తమ వద్ద పోగైన అణ్వాయుధాలను ధ్వంసం చేయాలని నిర్ణయించారు. కానీ, ఇప్పటికీ రష్యా వద్ద 5,500 అణు వార్ హెడ్స్ ఉన్నాయట. అమెరికా వద్ద ఉన్నవి 5,044. అంటే అణు పెద్దన్న రష్యానే.

## కీవ్‌లోని ఎంబసీని ఖాళీ చేసిన అమెరికా




**న్యూయార్కు-నవభూమి:** రష్యా- ఉక్రెయిన్ యుద్ధం మరింత ముదురుతున్నది. రష్యాలోని సుదూర ప్రాంతాలపై దాడికి అమెరికా సరఫరా చేసిన దీర్ఘశ్రేణి క్షిపణులు వినియోగించేందుకు ఉక్రెయిన్‌కు అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ అనుమతివ్వడం ఉద్రిక్తతలను ఒక్కసారిగా పెంచేసింది. ఈ పరిస్థితుల నేపథ్యంలో తాజాగా కీలక పరిణామం చోటు చేసుకుంది. ఉక్రెయిన్‌లోని తమ రాయబార కార్యాలయాన్ని మూసివేస్తున్నట్లు అమెరికా ప్రకటించింది.కీవ్ లోని అమెరికా రాయబార కార్యాలయంపై రష్యా భారీ వైమానిక దాడులకు పాల్పడే అవకాశం ఉన్నట్లు అమెరికాకు సమాచారం అందింది. దీంతో అప్రమత్తమైన అధికారులు వెంటనే ఎంబసీని మూసివేయాలని నిర్ణయించారు. నవంబర్ 20న దాడి జరిగే అవకాశం ఉందని తమకు కచ్చితమైన సమాచారం వచ్చిందని అమెరికా తాజాగా వెల్లడించింది. ఈ నేపథ్యంలో రాయబార కార్యాలయాన్ని తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు ప్రకటించింది. అందులో పనిచేసే ఉద్యోగులను సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించింది. అదేవిధంగా ఎయిర్ అలర్ట్‌లు ప్రకటించగానే కీవ్‌లోని అమెరికా పౌరులు షెల్టర్లలోకి వెళ్లిపోవాలని సూచించింది.రష్యాలోని సుదూర ప్రాంతాలపై దాడికి అమెరికా సరఫరా చేసిన దీర్ఘశ్రేణి క్షిపణులు వినియోగించేందుకు ఉక్రెయిన్‌కు అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ అనుమతిచ్చిన విషయం తెలిసిందే. చాలా కాలంగా కోరుతున్న అనుమతి లభించడంతో ఉక్రెయిన్ దూకుడుగా వ్యవహరిస్తున్నది. అమెరికా ఇచ్చిన అనుమతితో ఉక్రెయిన్ ఏకంగా ఆరు దీర్ఘశ్రేణి క్షిపణుల్ని రష్యాపై ప్రయోగించింది. దీంతో రెండు దేశాల మధ్య యుద్ధం మరింత ముదిరింది.రష్యాపై దీర్ఘశ్రేణి క్షిపణుల వినియోగానికి అనుమతిస్తే తమ అణు విధానాన్ని మార్చుకుంటామని, తమపై దాడిని ఉమ్మడి దాడిగా భావిస్తామని ఆ దేశాధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ హెచ్చరిస్తూ వచ్చారు. ఇప్పుడు అమెరికా అనుమతివ్వడాన్ని రష్యా తీవ్రంగా పరిగణించింది. ఉక్రెయిన్‌పై అణుదాడి చేసేందుకు వీలుగా తన అణు విధానాన్ని మార్చుకుంది. ఈ మేరకు తయారుచేసిన కీలక ఉత్తర్వుపై ఆ దేశ అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ మంగళవారం సంతకం చేశారు. ఏదైనా దేశం వద్ద అణ్వాయుధాలు లేకపోయినప్పటికీ అణ్వాయుధాలు కలిగిన దేశాల మద్దతుతో తమ దేశంపై దాడి చేస్తే, తమ దేశం అణ్వాయుధాలతో దాడి చేసేందుకు ఈ ఉత్తర్వు అనుమతి ఇస్తున్నది. దీంతో ఉక్రెయిన్‌పై అణుదాడికి వెనుకాడబోమని రష్యా పరోక్షంగా హెచ్చరించినట్టు అయ్యింది.తాజా పరిణామాల నేపథ్యంలో ఇప్పటివరకు రెండు దేశాల మధ్య నడిచిన యుద్ధం ఇప్పుడు ఇతర దేశాలకు విస్తరించే ప్రమాదం కనిపిస్తున్నది. రష్యాపై దీర్ఘశ్రేణి క్షిపణులతో దాడి చేసేందుకు ఉక్రెయిన్‌కు అమెరికా అనుమతించడం, దీనిని స్పందన తమ అణువిధానాన్ని రష్యా మార్చుకోవడంతో ఐరోపాలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. అమెరికా సహా నాటో దేశాలు సైతం అనివార్యంగా యుద్ధంలో భాగమయ్యే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. దీంతో మూడో ప్రపంచ యుద్ధం ముంచుకొస్తున్నదనే భయాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో యుద్ధమే సంభవిస్తే ఎలా వ్యవహరించాలి, ఏం చేయాలి, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి వంటి అంశాలను స్వీడన్, ఫిన్‌లాండ్, నార్వే, డెన్మార్క్ వంటి దేశాలు ప్రజలకు వివరిస్తున్నాయి.

## అమెరికాకు బాంబ్ సైక్లోన్ ముప్పు



**న్యూయార్క్, నవంబర్ 19:** అమెరికాకు 'బాంబ్ సైక్లోన్' ముప్పు పొంచి ఉంది. ముంచుకొస్తున్న తీవ్ర తుఫానుతో అనేక రాష్ట్రాలు చిగురుటాకులా వణుకుతున్నాయి. గంటల వ్యవధిలోనే గణనీయంగా బలపడే తుఫానును 'బాంబ్ సైక్లోన్' అని పిలుస్తారు. తుఫాను తీరం చేరే సమయంలో హరికేన్ స్థాయిలో భీకర గాలులు వీస్తాయని, భారీ వర్షాలు పడే అవకాశం ఉందని, పర్వత ప్రాంతాల్లో మంచు పడొచ్చని వాతావరణ శాఖ సూచించింది.

ముఖ్యంగా దక్షిణ ఓరెగన్, ఉత్తర కాలిఫోర్నియాలో అతి భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొన్నది. తుఫాను ముప్పు ఎక్కువగా ఉండే ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైన సురక్షిత ప్రాంతాలకు వెళ్లేందుకు సిద్ధంగా ఉండాలని ప్రభుత్వం అప్రమత్తం చేస్తున్నది.

### ఇకపై 50% ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోం విధానం..

# ప్రభుత్వం కీలక నిర్ణయం..



**న్యూఢిల్లీ-నవభూమి:**ఢిల్లీలో పెరుగుతున్న కాలుష్యం కారణంగా, గాలి నాణ్యత చాలా ప్రమాదకరంగా మారింది. ఈ తీవ్రమైన పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ఢిల్లీ ప్రభుత్వం ప్రభుత్వ కార్యాలయాల్లో వర్క్ ఫ్రమ్ హెూమ్ విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. దీని ప్రకారం ఢిల్లీ ప్రభుత్వ ఉద్యోగులలో 50 శాతం మంది ఇప్పుడు ఇంటి నుంచి పని చేస్తారు. ఈరోజు మధ్యాహ్నం 1 గంటలకు ఢిల్లీ సెక్రటేరియట్‌లో అధికారుల సమావేశం జరిగిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. దీని అమలు కోసం ఇవాళ మధ్యాహ్నం ఒంటిగంటకు సచివాలయంలో అధికారులతో సమావేశం కానున్నారు.

పాఠశాలలు, కాలేజీల మార్పులు

గత కొన్ని రోజులుగా ఢిల్లీ, జాతీయ రాజధాని ప్రాంతం లో గాలి నాణ్యత చాలా తక్కువగా ఉంది. ఈ కారణంగా కాలుష్య స్థాయి తీవ్ర స్థాయికి చేరుకుంది. ఈ కాలుష్య ప్రభావాన్ని తగ్గించేందుకు ఢిల్లీ ప్రభుత్వం 12వ తరగతి వరకు విద్యార్థుల కోసం ఆన్‌లైన్ విధానంలో పాఠశాలలను నడపాలని నిర్ణయించింది. ఢిల్లీ యూనివర్సిటీ, జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ కూడా ముందుజాగ్రత్త చర్యగా ఆన్‌లైన్ తరగతులు నిర్వహించాలని నిర్ణయించాయి.ప్రభుత్వ ఆఫీసులు..

దీంతో పాటు ఢిల్లీ ప్రభుత్వం తన కార్యాలయాల సమయాన్ని కూడా మార్చింది. 50 శాతం వరకు ప్రభుత్వ ఉద్యోగులకు ఇంటి నుండి పని చేసే విధానం అమలులో చేయాలని చూస్తోంది. కార్యాలయాలు ఇప్పుడు ఉదయం 8:30 నుంచి సాయంత్రం 5:00 వరకు, ఢిల్లీ ప్రభుత్వ కార్యాలయాలు ఉదయం 10:00 నుంచి 6 గంటల వరకు తెరవబడతాయి. ఈ మార్పులతో కొంతమేర కాలుష్యాన్ని నియంత్రించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.

**సుప్రీంకోర్టు ఆదేశాలు:**ఢిల్లీలో కాలుష్యానికి సంబంధించి పాఠశాలలను మూసివేయాలని, గ్రేడ్ 4 (గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్) పరిమితులను కఠినంగా అమలు చేయాలని సుప్రీంకోర్టు ఇప్పటికే ఆదేశించింది. ఇందులో భాగంగా నిర్మాణ పనులపై ఆంక్షలు, వాహనాల సంఖ్యను తగ్గించే చర్యలపై దృష్టి సారించారు. ప్రమాదకర స్థాయి కాలుష్యాన్ని దృష్టిలో ఉంచుకుని, పర్యావరణంలో కాలుష్య కారకాలను తగ్గించేందుకు ఢిల్లీ ప్రభుత్వం ఈ చర్యలను అమలు చేసింది.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
8 | హైదరాబాద్ గురువారం 21 ı నవంబర్ ı 2024

## విచారణకు డుమ్మా.. రాంగోపాల్ వర్మకు మరోసారి పోలీసుల నోటీసులు



ప్రముఖ దర్శకుడు రాంగోపాల్ వర్మ పై ప్రకాశం జిల్లా మద్దిపాడు పీఎస్‌లో కేసు నమోదైన విషయం తెలిసిందే. అయితే ఈ కేసులో 19న విచారణకు హాజరుకావాల్సి ఉండగా.. డుమ్మా కొట్టాడు. ఈ నేపథ్యంలో పోలీసులు వర్మకు మరోసారి నోటీసులు జారీ చేశారు. ఈ నెల 25న విచారణకు హాజరుకావాలని పోలీసులు నోటీసుల్లో పేర్కొన్నారు. అంతకుముందు తాను సినిమా షూటింగ్‌లో బిజీగా ఉండటం వల్ల విచారణకు రాలేనని ఒంగోలు రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ బాబుకు వాట్సాప్‌లో మెసేజ్ పెట్టాడు వర్మ. విచారణకు సహకరిస్తానని చెప్పిన వర్మ పోలీసులను వారం రోజుల గడువు కోరాడు.సోషల్ మీడియాలో పోస్టుల ఎఫెక్ట్.. వ్యూహం సినిమా సమయంలో టీడీపీ అధినేత, ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్, నారా బ్రాహ్మణిలను కించపరిచేలా రామ్ గోపాల్ వర్మ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టినందుకు గాను మద్దిపాడు టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి రామలింగం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు వర్మపై కేసు నమోదు చేశారు. ఈ కేసులో విచారణకు హాజరుకావాల్సిందిగా ఏపీ పోలీసులు వర్మకు నోటీసులు ఇవ్వగా.. మంగళవారం వర్మ కోర్టుకు హాజరుకావాల్సి ఉంది. అయితే అంతకంటే ముందే వర్మ ఏపీ హైకోర్టును ఆశ్రయించి క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. అయితే వర్మ క్వాష్ పిటిషన్‌ను విచారించిన హైకోర్టు వర్మ చేసిన పిటిషన్ కొట్టివేసింది. అలాగే అరెస్ట్ నుంచి తాము రక్షించలేమని వర్మ న్యాయవాదికి కోర్టు స్పష్టం చేసింది.



## కీర్తి సురేష్ పెళ్లి.. ఆ బంధం ఈనాటిది కాదు..







సౌత్ ఇండియా స్టార్ హీరోయిన్ కీర్తి సురేష్ పెళ్లి పీటలు ఎక్కబోతోందంటూ గత కొంతకాలంగా సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతూనే ఉంది. ఆరంభంలో దుబాయ్ కి చెందిన వ్యాపారవేత్తని కీర్తి సురేష్ పెళ్లి చేసుకుంటుందనే వార్తలు వినిపించాయి. తరువాత కోలీవుడ్ మ్యూజిక్ డైరెక్టర్ అనిరుద్ రవిచందర్ తో కొంతకాలం పాటు రిలేషన్ పెట్టి సోషల్ మీడియాలో ప్రచారం చేశారు. వారిద్దరూ కలిసి ఉన్న ఫోటోలని వైరల్ చేసి కీర్తి, అనిరుద్ రిలేషన్ షిప్ లో ఉన్నారంటూ గాసిప్స్ అల్లేశారు.ే అందులో వాస్తవం లేదని కీర్తి సురేష్ తల్లిదండ్రులు క్లారిటీ ఇచ్చారు. ఇదిలా ఉంటే మరోసారి కీర్తి సురేష్ పెళ్లి గురించి సోషల్ మీడియాలో వార్తలు వినిపిస్తున్నాయి. ఆమె పెళ్లి ఫిక్స్ అయ్యిందని. తన స్నేహితుడైన వ్యాపారవేత్తని కీర్తి సురేష్ పెళ్లాడబోతోందని టాక్ నడుస్తోంది. అలాగే అతని పేరు ఆంటోనీ తటిల్ అనే మాట ప్రచారంలో ఉంది. కీర్తి సురేష్ పెళ్లిచేసుకోబోయే వ్యక్తి ఇతనే అంటూ ఆంటోనీ తటిల్ ఫోటో కూడా వైరల్ చేస్తున్నారు. ఇద్దరు కలిసి 12వ తరగతి వరకు కలిసి చదువుకున్నారంట. మొదటి పరిచయం నుంచి కీర్తి సురేష్ కు అతను క్లోజ్ ఫ్రెండ్ అని సమాచారం. అయితే వారి ప్రేమలో పడడానికి మాత్రం కొంత సమయం పట్టిందట. కెరీర్ సెట్ చేసుకున్న తరువాతనే పెళ్లి గురించి ఆలోచించుకోవాలి అని డిసైడ్ అయ్యారు. ఆంటోనీ తటిల్ కొచ్చిలో ప్రముఖ వ్యాపారవేత్తగా ఉన్నారంట. గతంలో దుబాయ్ లో ఇంజనీర్ గా కొంతకాలం వర్క్ చేసి మరల తిరిగి కేరళ వచ్చేసి వ్యాపారం పెట్టుకున్నారంట. ఇక ఇప్పుడు ఇద్దరు ఒక ట్రాక్ లో ఉండడంతో పెళ్లికి సరైన సమయం అని ఫిక్స్ అయినట్లు తెలుస్తోంది. డిసెంబర్ 11 లేదా 12 తేదీలలో గోవాలో వారి వివాహ వేడుక జరగబోతోందని అంటున్నారు. దీనికి సంబందించిన అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయని కేరళ ఇండస్ట్రీలో వినిపిస్తోంది. అయితే కీర్తి సురేష్ కుటుంబం నుంచి మాత్రం దీనిపై ఇప్పటి వరకు ఎలాంటి అఫీషియల్ ప్రకటన రాలేదు. కానీ ఈ సారి జరుగుతోన్న పెళ్లి ప్రచారం వాస్తవమే అని సినీ వర్గాలలో అనుకుంటున్నారు. కేవలం కుటుంబ సభ్యులు, కొంతమంది బంధుమిత్రుల సమక్షంలోనే ప్రైవేట్ గా వీరి వివాహ వేడుక జరగబోతోందని టాక్ నడుస్తోంది. ఈ ప్రచారంపై కీర్తి సురేష్ లేదంటే ఆమె ఫ్యామిలీ క్లారిటీ ఇస్తే బాగుంటుందని అభిమానులు కోరుకుంటున్నారు. ఒకవేళ కీర్తి సురేష్ పెళ్లి చేసుకుంటే తరువాత సినిమాలకి దూరం అవుతుందా లేదంటే ఈ జెనరేషన్ హీరోయిన్స్ తరహాలో కెరియర్ కొనసాగిస్తుందా అనేది వేచి చూడాలి. ప్రస్తుతం కీర్తి సురేష్ చేతిలో నాలుగు సినిమాల వరకు ఉన్నాయి. 'రివాల్వర్ రీటా' అనే మూవీ పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది.

## ముచ్చటగా మూడు లాక్ చేసిందిలా!



'మిస్టర్ బచ్చన్' తో టాలీవుడ్ కి ఎంట్రీ ఇచ్చిన భాగ్యశ్రీ భోర్సే సుపరిచితమే. అమ్మడికి తొలి సినిమా ఫ్లాప్ ఇచ్చినా? నటన పరంగా పాస్ అయిపోయింది. వచ్చిన అవకాశంతో ట్యాలెంటెడ్ బ్యూటీనని నిరూపించుకుంది. సోగసరి నటనలో ఈజ్ ఉంది. హీరోయిన్ పక్కన హీరోయిన్ అనే లెక్కలో కాకుండా వినూత్నమైన నటనతో రీచ్ అయింది. ప్రస్తుతం దుల్కర్ సల్మాన్, రానా నటిస్తోన్న 'కాంత'లో హీరోయిన్‌గా నటిస్తోంది. ఇది భాగ్యశ్రీకి రెండవ సినిమా. తాజాగా మూడవ సినిమా కూడా ఖాతాలో వేసుకుంది. ఎనర్జిటిక్ స్టార్ రామ్ హీరోగా మైత్రీ మూవీ మేకర్స్ ఓ సినిమా నిర్మిస్తుంది. ఇది రామ్‌కి 22వ సినిమా. ఇందులో ఆయనకు జోడీగా భాగ్యశ్రీని ఎంపిక చేసారు. ఎనర్జిటిక్ స్టార్ కి జోడీగా తీసుకున్నారంటే? ఆయన నటన మ్యాచ్ చేయాలి. అందులో భాగ్య శ్రీ ఎక్కడా తగ్గే నటి కాదు. రామ్ కి పోటీగా నటించగల సమర్ధురాలే. 'మిస్టర్ బచ్చన్' లో రవితేజకి జోడీగా పోటీగా నటించింది. అమ్మడు ఎక్కడా డెబ్యూ అనే ఫీల్ తీసుకురాకుండా చేయడంతో మంచి సక్సస్ అయింది. మహేష్ బాబు.పి దర్శకత్వం వహిస్తోన్న ఈ సినిమా మరికొన్ని గంటల్లో అధికారికంగా ప్రారంభం కానుంది. లైనప్ లో ఉన్న సినిమాలు గనుక సక్సెస్ అయితే భాగ్య శ్రీ ట్యాలెంట్‌కి తక్కువ సమయంలోనే స్టార్ లీగ్‌లో చేరడానికి అవకాశం ఉంది. అమ్మడు టాలీవుడ్ కంటే ముందే బాలీవుడ్లో లాంచ్ అయింది. అక్కడ 'యారియాన్-2'లో నటించింది. ఇటీవల రిలీజ్ అయిన 'చందు ఛాంపియన్' తోనూ అలరించింది.

కానీ అక్కడ ఆశించిన విధంగా ఛాన్సులు రాలేదు. ఈ క్రమంలోనే టాలీవుడ్ లో అడగు పెట్టింది. అయితే అమ్మడి కెరీర్ ప్రారంభమై ఏడాది మాత్రమే గడిచింది. ముసు ముందు మంచి భవిష్యత్ ఉంది. భాగ్య శ్రీది ఔరంగాబాద్. మోడలింగ్ నుంచి సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చింది.

## నేను కూడా విన్నా..

### సుశాంత్‌తో పెళ్లిపై మీనాక్షి చౌదరి ఏమన్నదంటే..?



ప్రస్తుతం తెలుగు, తమిళ భాషల్లో బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేస్తూ లీడింగ్‌లో కొనసాగుతోంది మీనాక్షి చౌదరి . సుశాంత్ నటించిన ఇచ్చట వాహనములు నిలపరాదు సినిమాతో ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చింది. ఈ భామ ఇటీవలే లక్కీ భాస్కర్ సినిమాతో సూపర్ హిట్ కొట్టింది. ఈ భామ అక్కినేని సుశాంత్‌ను పెళ్లి చేసుకోబోతుందని ఇండస్ట్రీ సర్కిల్‌లో వార్తలు హల్ చల్ చేస్తున్న విషయం తెలిసిందే.తాజాగా ఈ వార్తలపై మీనాక్షి చౌదరి క్లారిటీ ఇచ్చేసింది. మెకానిక్ రాకీ ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో భాగంగా ఈ విషయమై మాట్లాడుతూ.. తాను కూడా ఈ పుకార్లను విన్నానని చెప్పింది. వెడ్డింగ్ అంటూ వస్తోన్న వార్తలను కొట్టిపారేస్తూ.. తాను ప్రస్తుతం సింగిల్‌గానే ఉన్నానని స్పష్టం చేసింది. అంతేకాదు సలార్ 2లో తాను భాగస్వామ్యం అవుతున్నట్టు వస్తున్న వార్తల్లో కూడా నిజం లేదని చెప్పింది. తన పర్సనల్, ప్రొఫెషనల్ లైఫ్‌లో ఏదైనా ముఖ్యమైన విషయముంటే అందరితో షేర్ చేసుకుంటానంది.మీనాక్షి చౌదరి ఇటీవలే మట్కాతో ప్రేక్షకుల ముందుకు రాగా బాక్సాఫీస్ వద్ద బోల్తా కొట్టింది. ఈ భామ మరోవైపు వెంకటేశ్-అనిల్ రావిపూడి కాంబోలో తెరకెక్కుతున్న సంక్రాంతికి వస్తున్నాం చిత్రంలో వన్ ఆఫ్ ది ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది.

## పుష్ప 2: ఆ రూట్లో బిగ్గెస్ట్ డీల్



సుకుమార్ దర్శకత్వంలో అల్లు అర్జున్ హీరోగా తెరకెక్కుతున్న పుష్ప: ది రూల్‌పై అంచనాలు ఏ స్థాయిలో ఉన్నాయో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఈ యాక్షన్ డ్రామా డిసెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా పాన్ ఇండియా రేంజ్ లో విడుదల కానుంది. అయితే సినిమా విడుదలకు రెండు వారాల ముందు నుంచే హాట్ టాపిక్ అవుతోంది. ప్రొడక్షన్ పరంగా, మార్కెటింగ్ స్ట్రాటజీతో పాటు ముందుగానే భారీ లాభాలను సంపాదించడంలో మేకర్స్ కృషి చేస్తున్నారు. తాజా సమాచారం ప్రకారం, ఈ సినిమాకి సంబంధించిన టీవీ రైట్స్‌ను పెన్ స్టూడియోస్ భారీ ధరకు కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. ఈ సంస్థ అధినేత జయంతిలాల్ గడ ఈ ప్రాజెక్ట్ కోసం ముందుకు వచ్చారు. డీల్ మొత్తాన్ని ఇంకా అధికారికంగా ప్రకటించలేదు, అయితే ఇది ఇండస్ట్రీలోనే అత్యంత ఖరీదైన టీవీ రైట్స్ డీల్‌గా నిలవనున్నట్లు తెలుస్తోంది. రికార్డ్ కూడా బ్రేక్ అయినట్లు టాక్ వినిపిస్తోంది. ఇకపోతే, ఓటిటి హక్కులను ప్రముఖ స్ట్రీమింగ్ ప్లాట్‌ఫార్మ్ నెట్‌ఫ్లిక్స్ రూ. 275 కోట్లకు సొంతం చేసుకున్నట్లు సమాచారం. దీంతో, సినిమా థియేటర్లలో విడుదలకు ముందే మేకర్స్ భారీ లాభాలను ఆర్జించారు. ఈ భారీ బడ్జెట్ సినిమాకు సంబంధించి ఇంత త్వరగా రికవరీ పూర్తవ్వడం విశేషం. ఈ వ్యవహారాలతో సినిమా ఫలితం ఎటువంటి ప్రభావం చూపినా నిర్మాతలకు ఆర్థికంగా ఎటువంటి నష్టాలు ఉండవు. ఇక తప్పకుండా సినిమా వెయ్యి కోట్ల కలెక్షన్స్ అందుకుంటుంది అని మేకర్స్ ఎంతో నమ్మకంతో ఉన్నారు. రీసెంట్‌గా విడుదల చేసిన ట్రైలర్ ఇప్పటికే ప్రేక్షకుల్లో అంచనాలను రెట్టింపు చేసింది. ప్రత్యేకంగా, పట్నాలో ట్రైలర్ విడుదల చేయడం ఉత్తర భారత ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. ట్రైలర్‌లో ఉన్న డైలాగులు, మాస్ ఎలిమెంట్స్, ఆల్రెడీ సోషల్ మీడియాలో ట్రెండింగ్ అవుతుండటం విశేషం. ఈ ట్రైలర్ సినిమాకి కొత్త ట్రెండ్‌ను సృష్టించ నుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మరోవైపు, మేకర్స్ ప్రమోషన్లలో పూర్తిగా మునిగిపోయారు. సినిమా ఫుల్ ఆడియో ఆల్బమ్ ఇంకా విడుదల కాలేదు, కానీ సంగీతం, పాటలపై కూడా భారీ అంచనాలు ఉన్నాయి. దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందించిన ఈ సినిమా బీజీఎం ప్రేక్షకులను థియేటర్లలో నిలబెట్టేలా ఉంటుందని టాక్ వినిపిస్తోంది. మొత్తం మీద, పుష్ప: ది రూల్ సినిమాకి అన్ని కోణాల్లో విజయవంతమైన ప్లాన్ సిద్ధమవుతోంది. భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమా ఆర్థికంగా ఇప్పటికే విజయం సాధించగా, థియేటర్లలో విజయం సాధించడానికి ప్రేక్షకుల నుండి మిశ్రమ స్పందన అవసరం.

## ఆ యంగ్ డైరెక్టర్‌తో తారక్ క్లారిటీ ఎప్పుడంటే?



మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ పాన్ ఇండియా క్రేజ్ గురించి చెప్పాల్సి పనిలేదు. 'ఆర్ ఆర్ ఆర్' తో గ్లోబల్ స్టార్ అయ్యాడు. ఇటీవల రిలీజ్ అయిన 'దేవర'తో మరో పాన్ ఇండియా సక్సెస్ ఖాతాలో వేసుకున్నాడు. తదుపరి 'వార్-2' తో బాలీవుడ్ లోనూ ఎంట్రీ ఇస్తున్నాడు. ఈ సినిమా తర్వాత తారక్ మేనియా అంతకంతకు రెట్టింపు అవుతుంది. మరోవైపు 'కేజీఎఫ్' లాంటి హిట్ ఇచ్చిన డైరెక్టర్ తో కొత్త సినిమాని పట్టాలెక్కిస్తున్నాడు. ప్రస్తుతానికి తారక్ లైనప్ ఇలా ఉంది. అయితే ఇప్పుడీ వరుసలోకి తారక్ కొత్త దర్శకుడిని తెరపైకి తెస్తున్నట్లు కొంత కాలంగా ప్రచారంలో ఉంది. 'హాయ్ నాన్న' తో దర్శకుడిగా పరిచయమైన శౌర్యువ్ సినిమా చేస్తున్నాడనే ప్రచారం ఉంది. కానీ ఇందులో నిజమెంతో తెలియని పరిస్థితి. ఈ నేపథ్యంలో శౌర్యువ్ పేరు మరోసారి తెరపైకి వస్తోంది. యంగ్ మేకర్ స్టోరీకి తారక్ ఒకే చెప్పినట్లు సన్నిహిత వర్గాల నుంచి వినిపిస్తుంది. పాన్ ఇండియా కనెక్టింగ్ పాటు యూనిక్ పాయింట్ కావడంతో తారక్ గ్రీన్ సిగ్నెల్ ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. ఇదే నిజమైతే శౌర్యువ్ కెరీర్ టర్న్ అయినట్లే. మేకర్ గా తొలి సినిమాతోనే మంచి మార్కులు వేయించుకున్నాడు. డెబ్యూ చిత్రమైనా ఎంతో స్టైలిష్ గా 'హాయ్ నాన్న' చేసాడు. మేకింగ్ పరంగా మంచి మార్కులు పడ్డాయి. కమర్శియల్‌గా వర్కౌట్ కానప్పటికీ మేకర్‌గా తనకంటూ ఓ గుర్తింపును దక్కించుకున్నాడు. అందుకే ఇప్పుడు తారక్ లైనప్ లో అతడి పేరు వినిపిస్తుంది. మరి ఇందులో వాస్తవం ఎంతో తెలియాలి. 'వార్ -'2 షూటింగ్ ముగించిన వెంటనే తారక్ ప్రశాంత్ నీల్ సినిమాని పట్టాలెక్కిస్తాడు. ఇది పూర్తవ్వడానికి సమయం పడుతుంది. ఆ తర్వాత శౌర్యువ్ ప్రాజెక్ట్ విషయంలో మరింత క్లారిటీ వస్తుంది. తారక్ కూడా ఈ మధ్య రూట్ మార్చాడు. ఒకేసారి రెండు సినిమాల షూటింగ్ లకు హాజరవ్వడం అలవాటు చేసుకుంటున్నాడు. మరి శౌర్యువ్ ప్రాజెక్ట్ ఇప్పటికప్పుడు పట్టాలెక్కించాలి అనుకుంటే? ప్రశాంత్ నీల్ సినిమాతో పాటు మొదలు పెట్టే అవకాశం ఉంటుంది.

## ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్ విడుదల.. మూడోస్థానానికి చేరిన యువ సంచలనం తిలక్ వర్మ



**న్యూఢిల్లీ-నవభూమి:** ఐసీసీ తాజాగా టీ20 ర్యాంకింగ్స్‌ను విడుదల చేసింది. దక్షిణాఫ్రికాతో జరిగిన టీ20 సిరీస్‌లో వరుస సెంచరీలు సాధించిన టీమిండియా యువ స్టార్ బ్యాటర్ తిలక్ వర్మ ఏకంగా 69 స్థానాలను మెరుగుపరుచుకొని ఏకంగా టాప్-కి చేరుకున్నాడు. తిలక్ టీ20 బ్యాట్స్‌మెన్ ర్యాంకింగ్స్‌లో టాప్-10లో చోటు సంపాదించడం ఇదే తొలిసారి. ఇంగ్లండ్ ఆటగాడు లియామ్ లివింగ్‌స్టోన్‌ను వెనక్కి నెట్టి భారత స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా నెంబర్ వన్ ఆల్ రౌండర్‌గా నిలిచాడు. ఇటీవల దక్షిణాఫ్రికాతో జరిగిన సిరీస్‌లో పాండ్యా బ్యాట్‌తో పాటు బాల్‌తోనూ అద్భుత ప్రదర్శన చేశాడు. నాలుగు మ్యాచ్‌ల సిరీస్‌ను టీమిండియా 3-1 తేడాతో గెలుచుకున్నది. టీ20 ఆల్‌రౌండర్ల జాబితాలో హార్దిక్ నంబర్ వన్ ర్యాంక్‌కు చేరుకోవడం ఇది రెండోసారి. ఐసీసీ తాజా ర్యాంకింగ్స్‌లో ఆస్ట్రేలియా ఆటగాడు మార్కస్ స్టోయినిస్ నాలుగో స్థానంలో, శ్రీలంక మాజీ కెప్టెన్ వనిందు హసరంగ ఐదో స్థానంలో నిలిచారు.

దక్షిణాఫ్రికాతో జరిగిన టీ20 సిరీస్‌లో టీమిండియా యువ ఆటగాడు తిలక్ 280 పరుగులు సాధించాడు. ఇందులో రెండు సెంచరీలు ఉన్నాయి. దాంతో ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో 69 స్థానాలను మెరుగుపరుచుకొని మూడోస్థానానికి చేరుకున్నాడు.

## ఫుట్‌బాల్ అభిమానులకు గుడ్‌న్యూస్.. కేరళలో ఆడనున్న లియోనిల్ మెస్సి



**తిరువనంతపురం-నవభూమి:** ఫుట్ బాల్ లెజెండరీ ప్లేయర్ లియోనిల్ మెస్సితో పాటు అర్జెంటీనా జట్టు వచ్చే ఏడాది కేరళలో పర్యటించనున్నారు. అక్కడ ఓ ఇంటర్నేషనల్ మ్యాచ్ ఆడను న్నారు. కేరళ క్రీడాశాఖ మంత్రి అబ్దు రహ్మాన్ ఈ విషయాన్ని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలోనే ఆ మ్యాచ్‌ను నిర్వహించనున్నట్లు ఆయన చెప్పారు. అర్జెంటీనా జట్టు కేరళలో రెండు మ్యాచ్‌లు ఆడనున్నట్లు ఆయన తెలిపారు. కొచ్చి వేదికను ఖరారు చేశారు.అయితే అర్జెంటీనాతో తలపడే జట్టు కోసం ఇంకా అంచనా వేస్తున్నారు. ఖతార్ లేదా జపాన్‌తో అర్జెంటీనా తలపబడే అవకాశాలు ఉన్నట్లు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అర్జెంటీనా ఫుట్‌బాల్ అసోసియేషన్‌తో స్పెయిన్‌లో జరిగిన చర్చలు దీనిపై నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి వెల్లడించారు. ఏఎఫ్ఏకు చెందిన బృందం త్వరలో కేరళలో పర్యటించనున్నారు. ఆ మ్యాచ్‌లకు స్పాన్సర్‌గా వ్యవహరించేందుకు కేరళ వ్యాపార సంఘాలు సిద్ధంగా

## ఐపీఎల్ చరిత్రలో వేలంలోకి ఎంట్రీ ఇచ్చిన నలుగురు అత్యంత పిన్నయస్కులు వీళ్లే..!



**న్యూఢిల్లీ-నవభూమి:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ -2025కి ముందు మెగావేలం నవంబర్ 24, 25 తేదీల్లో సౌదీ అరేబియాలోని జెడ్డా వేదికగా జరుగనున్నది. యువ క్రికెటర్లతోపాటు సీనియర్ ఆటగాళ్లు వేలానికి రానున్నారు. ఐపీఎల్ యువ ఆటగాళ్లకు కీలకంగా మారనున్నది. ఐపీఎల్‌లో మంచి ప్రదర్శన కనబరిస్తే జాతీయ జట్టులో ఎంపికయ్యే అవకాశాలున్నాయి. ఇప్పటికే పలువురు ఆటగాళ్లు ఐపీఎల్‌లో రాణించి.. జాతీయ జట్టులో చోటు సాధించారు. ఈ సారి వేలం పూల్‌లో 318 మంది అన్‌క్యాప్డ్ ఇండియన్ ప్లేయర్స్, 12 మంది అన్‌క్యాప్డ్ ప్లేయర్స్ సహా మొత్తం 574 మంది ఆటగాళ్లు ఉన్నారు. షార్ట్‌లిస్ట్ చేసిన ఆటగాళ్ల జాబితాలో 366 మంది భారతీయ ఆటగాళ్లు, 208 మంది విదేశీ క్రికెటర్లు ఉన్నారు. ఈ వేలం యువ క్రికెటర్లకు కీలకం కానున్నది. 204 మంది ఆటగాళ్లను ఫ్రాంచైజీలు తీసుకోనుండగా.. ఇందులో 70 మంది విదేశీ ఆటగాళ్లకు చోటు కల్పించనున్నది. ఇప్పటి వరకు జరిగిన లీగ్ వేలం చరిత్రలో అత్యంత పిన్న వయస్కుల ఆటగాళ్ల గురించి ఓసారి తెలుసుకుందాం..!

Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**